V3 NEWS

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం,
ఏప్రిల్ 26, 2025

సంపుటి : 01 | సంచిక : 351 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్






## పోరాడి ఓడిన హైదరాబాద్ బీజేపీ..



హైదరాబాద్:హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ లో బీజేపీ పోరాడి ఓడింది. అదే సమయంలో చాలా వ్యూహా త్మకంగా అడుగులు వేసి.. ముందు నుంచి చాలా భరోసాతో ఉన్న ఎంఐఎం.. సునాయాసంగా విజయం దక్కించుకుంది. అయితే.. బీజేపీకి అనుకూలంగా మొత్తం 28 ఓట్లు పడాల్సి ఉండగా.. కేవలం 25 మాత్రమే పడ్డాయి. అయితే.. వీరిలోనూ.. ముగ్గురు సొంత పార్టీ నాయకుడికి ఓటేయలేదని తెలుస్తోంది.గత బుధవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తంగా.. 112 మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారు. వీరిలో 31 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు.. ఇతర ఎక్స్ అఫిషియో సభ్యులు ఉన్నారు. వీరిలోనూ ఒక్క బీజేపీకి చెందిన వారే ఆరుగురు ఉన్నారు. మిగిలిన 22 మంది బీజేపీ కార్పొరేటర్లతో కలుపుకుంటే.. ఆ పార్టీ తరఫున ఎమ్మెల్సీగా బరిలో నిలిచిన గౌతం రావుకు 28 ఓట్లు గ్యారెంటీగా వచ్చి తీరాలి.కానీ.. శుక్రవారం ఉదయం వెలువడిన ఎన్నికల ఫలితాల్లో గౌతం రావుకు కేవలం 25 ఓట్లు మాత్రమే పడ్డాయి. అంటే.. మరో మూడు ఓట్లు పడలేదు. వీరిలో రాజాసింగ్ ఓటేయలేదని భావిస్తున్నారు. ఇక, మరో ఇద్దరు ఎవరు అనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. ఇక, ఫలితాల ప్రకారం చూసుకుంటే.. ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హాసన్ కు మొత్తం 112 ఓట్లలో 63 ఓట్లు ఆయన సొంతమయ్యాయి.అయితే.. బీఆర్ ఎస్ కార్పొరేటర్లు, ఎక్స్ అఫిషియో సభ్యులు ఏడుగురు కూడా పోలింగ్‌కు దూరంగా ఉన్నారు. మిగిలిన వారిలో కాంగ్రెస్ పార్టీ నుంచి కూడా.. కొందరు పోలింగ్‌కు హాజరు కాలేదు. ఈ పరిణామాలతో ఓటింగ్ శాతం తగ్గినా.. బీజేపీకి పడాల్సిన ఓట్లు కూడా.. పడకపోగా.. 3 ఓట్లు తగ్గడం.. కమలం పార్టీలో చర్చనీయాంశంగా మారింది.

## పాకిస్థాన్‌కు చెప్పలేక.. భారత్ కు నీతులా



పాకిస్థాన్:ఐక్యరాజ్యసమితి(యూఎన్) వ్యవహారంపై ప్రపంచ దేశాలు.. ముఖ్యంగా ఉగ్రవాద వ్యతిరేక దేశాలు మండి పడుతున్నాయి. అప్పుడు ఉక్రెయిన్ రష్యా విషయంలోనూ ఇలానే చేశారు అంటూ.. యూఎన్‌పై నిప్పులు చెరిగారు. 26 మంది ప్రాణాలను బలిగొన్న పహిల్గామ్ ఉగ్రదాడి ఘటనపై పాకిస్థాన్‌ను హెచ్చరించాల్సిందిపోయి.. భారత్‌కు నీతులు చెప్పడం ఏంటని నిలదీస్తున్నారు. ఈ వ్యవహారంపై ఐక్యరాజ్యసమి తి ఏమైనా చేయాలని అనుకుంటే.. ఉగ్రవాదులను ప్రోత్సహిస్తున్న పాకిస్థాన్‌కు గట్టి హెచ్చరిక చేయాలని సూచించారు.తాజాగా జరిగిన ఉగ్రదాడిపై యూఎన్ ప్రధాన కార్యదర్శి గుట్రెరస్ స్పందించారు. భారత్.. పాకిస్థాన్‌పై యుద్ధానికి సన్నద్ధమవుతున్న వస్తున్నవార్తలు విచారకరమని వ్యాఖ్యానించారు. ఈ సమయంలో భారత్ సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. పాకిస్థాన్‌పై యుద్ధం చేయడం వల్ల ఏమీ ఒరగదని.. ఇరు దేశాలూ కలిసి కూర్చుని శాంతి చర్చలు చేయాలని ఆయన సూచించారు. దీనికి ఐక్యరాజ్యసమితి కూడా.. సహకరిస్తుందన్నారు.అయితే.. ఈ వ్యాఖ్యలపైనే భారత్‌కు మిత్రదేశాలుగా ఉన్న అమెరికా సహా.. పలు దేశాలు.. స్పందించాయి. ఐక్యరాజ్యసమితి ధ్రుతరాష్ట్ర పాత్ర పోషిస్తోందని(బ్లైండ్ రోల్) వ్యాఖ్యానించాయి. ఏదైనా చేయాలని అనుకుంటే.. నిజాయితీగా చేయాలని.. పాకిస్థాన్‌ను వెనుకేసుకు వస్తున్నట్టుగా వ్యాఖ్యానించడం సరికాదని.. స్విట్జర్లాండ్ పేర్కొంది. దాదాపు అమెరికా కూడా.. ఇదే వ్యాఖ్య చేసింది.

## భారత్-పాక్ యుద్ధ భయం 7.5 లక్షల కోట్లు ఆవిరి



పాకిస్థాన్:భారత స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. శుక్రవారం ఉదయం ట్రేడింగ్ ప్రారంభం నుంచి కూడా.. మార్కెట్ పతనం దిశగా దూసుకుపోయింది. దీనికి ప్రధాన కారణం.. భారత్-పాకిస్థాన్‌ల మధ్య యుద్ధం వచ్చే అవకాశం ఉందన్న భయమేనని తెలుస్తోంది. మార్కెట్ వర్గాలు కూడా.. ఇదే విషయాన్ని చెబుతున్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితి.. యుద్ధానికి దారితీసే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. పహిల్గామ్ లో ఉగ్రవాదుల దాడి అనంతరం.. పాకిస్థాన్ విషయంలో భారత్ కీలక నిర్ణయాలు తీసుకుంది.ఈ క్రమంలోనే కీలకమైన సింధు నది జలాల ఒప్పందాన్ని రద్దు చేసింది. ఇది పాకిస్థాన్‌కు ప్రాణాధారమైన ప్రాజెక్టు కావడంతో ఆదేశం ఉక్కిరిబిక్కిరి అవుతోంది. అదేవిధంగా వీసాల రద్దు.. పాకిస్థాన్ పౌరులను తక్షణమే భారత్ నుంచి పంపేయడం వంటివి కూడా.. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలను మరింత పెంచా యి. ఈ నేపథ్యానికి తోడు.. బోర్డర్‌లో పాకిస్థాన్ దళాలు.. భారత సైనికులపై కాల్పులు జరిపాయి. ఈ నేపథ్యంలో మార్కెట్లు కుదేలయ్యాయని విశ్లేషకులు చెబుతున్నారు.శుక్రవారంఉదయం ట్రేడింగ్ ప్రారంభంలోనే సెన్సెక్స్ 950 పాయింట్లు, నిఫ్టీ 24 వేల పాయింట్ల మేరకు నష్టపోయాయి. ఉదయం 11 గంటల వరకు ఈ తిరోగమనం కొనసాగుతూనే ఉంది. దీంతో ఇన్వెస్టర్ల సంపద 7.5 లక్షల కోట్ల రూపాయలు ఆవి రైనట్టు మార్కెట్ వర్గాలు తెలిపాయి. అదే విధంగా కీలక బ్యాంకు లు ఎస్ బీఐ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ షేర్లు కూడా.. నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఫలితం పెట్టుబడులు పెట్టేవారు.. లేక.. వచ్చిందే చాలన్నట్టుగా.. లాభాలు తీసేసుకోవడంతోనే ఈపరిస్థితి వచ్చినట్టు మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. మరో నాలుగు రోజుల వరకు ఇదే పరిస్థితి కొనసాగే అవకాశం ఉంటుందని తెలిపారు.

## హైదరాబాద్‌లో నక్కిన 200 మందికిపైగా పాకిస్థాన్ పౌరులు..



హైదరాబాద్ :పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో పాకిస్థాన్ పై భారత ప్రభుత్వం వేట మొదలైంది. ఇప్పటికే పాకిస్థాన్ పౌరులకు సార్క్ వీసాలను రద్దుచేసింది కేంద్ర ప్రభుత్వం. పాకిస్థాన్ పౌరులంతా తక్షణమే దేశం వీడిచి వెళ్లాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు అమిత్ షా కీలక ఆదేశాలు జారీ చేశారు.ఈ మేరకు తాత్కాలిక వీసాలతో భారత్‌లోకి వచ్చిన వారి వివరాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్ర ప్రభుత్వం పంపింది. ఈ క్రమంలో హైదరాబాద్ నగరానికి 208 మంది పాక్ పౌరులు తాత్కాలిక వీసాపై వచ్చినట్టు తేలింది. వారి వివరాలపై ప్రస్తుతం స్పెషల్ బ్రాంచ్ ఆరా తీస్తోంది. వీలైనంత త్వరగా వారిని గుర్తించి పాకిస్థాన్ కు పంపించాలని ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది.మరోవైపు పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. దేశంలోని పారామిలిటరీ బలగాలకు సెలవులు రద్దు చేసింది. సెలవులపై వెళ్లిన జవాన్లు వెంటనే రిపోర్ట్ చేయాలని ఆదేశాలు కూడా జారీ చేసింది. ఈ మేరకు జమ్మూకాశ్మీర్ పరిస్థితులపై అన్ని సైనిక విభాగాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు అధికారులు.

## దంచికొడుతున్న ఎండలు తెలంగాణలో



హైదరాబాద్ :ఎండలు దంచికొడుతున్నాయి. వడగాల్పులు, ఉక్కపోతకు రాష్ట్రంలోని ప్రజలు అల్లాడు తున్నారు. ఎండల బీభత్సానికి ప్రజలు బయ టకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. దక్షిణ తెలం గాణతో పోల్చుకుంటే ఉత్తర తెలంగాణలో ఎం డలు తీవ్రంగా ఉన్నాయి. ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే ప్రమాదం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. దీంతో ఉత్తర తెలంగాణలోని పలు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు అధికారులు.మరోవైపు రానున్న రోజుల్లో రాష్ట్రంలో ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలోని 7 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు అధికారులు. ఈ మేరకు ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమరం భీమ్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేశారు. ఈ జిల్లాలలో 44 డిగ్రీల పైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వెల్లడించారు.ఉత్తర తెలంగాణ జిల్లాలతో పాటు హైదరాబాద్, రంగారెడ్డి, ఉందని సమాచారం.

## ‘కల్మా అంటే ఏమిటో తెలియదన్నాం అంతే నాన్నను కాల్చేశాడు’



కేరళ :పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడిలో అమాయకులైన టూరిస్టులు 26మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో తన తండ్రిని కోల్పోయిన కేరళకు చెందిన ఆర్తీ మీనన్ ఆ భయానక క్షణాలను గుర్తు చేసుకుంటూ, “మేము చుట్టూ ఉన్నవాళ్లంతా పరుగులు తీస్తుండడం చూశాం. అక్కడంతా గందరగోళంగా ఉంది” అని చెప్పింది. “ఒక వ్యక్తి మా దగ్గరకు వచ్చి ‘కల్మా’ అన్నాడు. దాని అర్థం మాకు తెలియదని చెప్పగానే ఆ వ్యక్తి మా నాన్నను కాల్చేశాడు” అని ఆమె తెలిపింది.పహల్గామ్ ఉగ్రదాడి ఎంత భయంకరంగా జరిగిందో కళ్లారా చూసిన ఒక కేరళ మహిళ ఆ దుర్ఘటనను వివరించింది. తుపాకీ పేలిన శబ్దం వినిపించగానే అందరూ పరుగులు తీశారని.. అక్కడ అప్పటి ఎంతో ప్రశాంతంగా ఉన్న వాతావరణం గందరగోళంగా మారిందని ఆమె చెప్పింది. ఇంతలో ఒక ఉగ్రవాది వారి దగ్గరకు వచ్చి ‘కల్మా’ (ముస్లింల పవిత్ర వచనం) చెప్పమని అడిగాడు. దాని అర్థం వారికి తెలియకపోవడంతో, ఆ ఉగ్రవాది వారి కళ్లముందే ఆమె తండ్రిని కాల్చి చంపేశాడు.ఆ యువతి ఇంకా మాట్లాడుతూ.. “ఒక తుపాకీ శబ్దం వినిపించగానే అది ఏమిటని మా నాన్నను అడిగాను. ఆయనకు కూడా నాకు తెలియదు అన్నారు. తర్వాత మరిన్ని కాల్పుల శబ్దాలు వినిపించడంతో మేం పరిగెత్తడం మొదలుపెట్టాం. చుట్టూ ఉన్నవాళ్లంతా పరుగులు తీస్తుండడం చూశాం. అక్కడంతా గందరగోళంగా ఉంది. అప్పుడు సడన్‌గా ఒక తుపాకీ పట్టుకున్న వ్యక్తి మా వైపు రావడం నేను చూశాను. మా పక్కన రెండు మూడు గుంపుల వాళ్లు ఉన్నారు. ఆ వ్యక్తి వాళ్లను ఏదో అడుగుతున్నాడు. తర్వాత వాళ్లపై కాల్పులు జరుపుతున్నాడు. అది చూసి నేను భయపడిపోయాను. మా నాన్నతో ఆ వ్యక్తి మన వైపు వస్తున్నాడని అన్నాను. మా నాన్న మాత్రం ప్రశాంతంగా ‘చూద్దాం ఏం జరుగుతుందో’ అన్నారు. ఆ వ్యక్తి మా దగ్గరకు వచ్చి ‘కల్మా’ అన్నాడు. దాని అర్థం మాకు తెలియదని చెప్పగానే ఆ వ్యక్తి మా నాన్నను కాల్చేశాడు... కాశ్మీర్ ప్రజలు చాలా మంచివాళ్లు. సెంట్రల్ గవర్నమెంట్, జమ్మూ కాశ్మీర్ గవర్నమెంట్ కూడా మాకు చాలా సహాయం చేశారు” అని కన్నీటి పర్యంతం అయింది.ఈ దాడిలో కేవలం ఆమె తండ్రి మాత్రమే కాదు, పెళ్లయిన కొద్ది రోజులకే తన భార్యతో కలిసి కాశ్మీర్‌కు వెళ్లిన 26 ఏళ్ల నేవీ అధికారి కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనలో కేరళ, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, స్థానిక ప్రజలు కూడా ఉన్నారు. అమాయక టూరిస్టులపై జరిగిన ఈ దారుణమైన కలిగించింది.

## జగన్ పై ఎంపీ కేశినేని చిన్ని సంచలన ఆరోపణలు



అమరావతి:గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు గత ముఖ్యమంత్రి జగన్ కుట్ర చేస్తున్నారని విజయవాడ తెదేపా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) సంచలన ఆరోపణలు చేశారు.తనపై వస్తున్న ఆరోపణలకు క్లారిటీ ఇచ్చారు. కేశినేని చిన్ని సోదరుడు, మాజీ ఎంపీ కేశినేని నాని మాత్రం అనూహ్యంగా ప్రస్తుత తెదేపా ప్రభుత్వం తీసుకున్న ఓ భూ కేటాయింపుపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, దాని వెనుక తన సోదరుడు, ఎంపీ చిన్ని హస్తం ఉందని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఫిర్యాదు చేయడం రాష్ట్ర రాజకీయాల్లో ముఖ్యంగా తెలుగుదేశం పార్టీలో తీవ్ర కలకలం రేపుతోంది.– జగన్‌పై ఎంపీ కేశినేని చిన్ని ఆరోపణలు:వైసీపీ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై ప్రజల దృష్టి మళ్లించేందుకే జగన్ విదేశీ కంపెనీలు, ప్రవాసాంధ్రులపై అసత్య ప్రచారం చేయిస్తున్నారని ఎంపీ కేశినేని చిన్ని మండిపడ్డారు. పెట్టుబడులు పెట్టే ప్రవాసాంధ్రులకు తెదేపా అండగా ఉంటుందని, వారు నిర్భయంగా పెట్టుబడులు పెట్టవచ్చని భరోసా ఇచ్చారు. వారిపై నిరాధార ఆరోపణలు చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాజధాని అమరావతికి నిధులు రాకుండా జగన్ బ్యాచ్ ప్రయత్నిస్తోందని, రాష్ట్రానికి, నిరుద్యోగ యువతకు నష్టం చేసే పనులను మానుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.– ఇటీవల కేశినేని నాని సంచలన ఆరోపణలువిజయవాడ మాజీ ఎంపీ కేశినేని నాని గత ఎన్నికలకు ముందు తెదేపాకు దూరమై వైసీపీలో చేరి, విజయవాడ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసి తన సోదరుడు చిన్ని చేతిలో ఓటమి పాలయ్యారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ, ఇటీవల సీఎం చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి, తెదేపా రీఎంట్రీపై ఊహాగానాలకు తావిచ్చారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు సొంత తమ్ముడిపైనే, అది కూడా అధికార తెదేపా హయాంలో జరిగిన ఒక కేటాయింపుపై ఆరోపణలు చేయడం సంచలనం రేపింది.– వైజాగ్ భూ కేటాయింపుపై నాని అభ్యంతరం.. చిన్ని హస్తం ఉందని ఆరోపణ:రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు వస్తున్న సంస్థలకు ప్రభుత్వం భూములు కేటాయిస్తున్న ప్రక్రియపై స్పందించిన కేశినేని నాని, టాటా కన్సల్టెన్సీ సర్వీస్ భూమి కేటాయించడాన్ని స్వాగతించారు. ఇది వేలాది ఉద్యోగాల కల్పనకు దోహదపడుతుందని, రాష్ట్ర అభివృద్ధికి అవసరమని ప్రశంసించారు. చంద్రబాబు దార్శనికతకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు. అయితే, విశాఖపట్నంలో ఉర్సా క్లస్టర్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థకు 60 ఎకరాల భూమిని కేటాయించడంపై మాత్రం మాజీ ఎంపీ నాని తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. విశాఖ ఐటీ పార్కులో 3.5 ఎకరాలు, కాపులుప్పాడలో 56.36 ఎకరాలు కేటాయించారని పేర్కొంటూ, ఈ వ్యవహారం వెనుక అక్రమాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఉర్సా క్లస్టర్ సంస్థ ఏర్పాటు అయిన కొన్ని వారాలకే భారీగా భూమి కేటాయించడం, ఆ సంస్థకు ఎలాంటి అనుభవం లేకపోవడం, భారీ ప్రాజెక్టులు అమలు చేయడానికి తగిన నేపథ్యం లేకపోవడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. ఈ ఐటీ సంస్థ భూ కేటాయింపుల వెనుక తన సోదరుడు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్నికి ప్రయోజనం ఉందని నాని సంచలన ఆరోపణ చేశారు. ఉర్సా క్లస్టర్ సంస్థ డైరెక్టర్లలో ఒకరైన అబ్బూరి సతీష్ ఎంపీ చిన్నికి అత్యంత సన్నిహితుడని, కాలేజీలో కలిసి చదువుకున్నారని నాని తెలిపారు.గతంలో 21 సెంచరీ ఇన్వెస్ట్ మెంట్ మరియు ప్రాపర్టీస్ ప్రైవేట్ లిమిటెడ్ అనే సంస్థలో వీరిద్దరూ భాగస్వాములుగా ఉండేవారని, ఆ సంస్థ ప్రజల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసి మోసగించిందని ఆరోపణ లున్నాయని గుర్తు చేశారు.ఉర్సా క్లస్టర్‌కు భూముల కేటాయింపు వెనుక కేశినేని చిన్ని హస్తం ఉందని, ఎంపీగా, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తన పలుకుబడిని ఉపయోగించి ఈ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారని నాని ఆరోపించారు. విజయవాడలోనూ ఎన్నో అక్రమాలతో చిన్నికి సంబంధాలున్నాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు నేరుగా లేఖ రాసినట్లు, తన ఫేస్బుక్ అధికారిక అకౌంట్లో ఈ సమాచారాన్ని పోస్ట్ చేసినట్లు తెలిపారు.మొత్తంగా, ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములు, అందులో ఒకరు ప్రస్తుత తెదేపా ఎంపీగా గత ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తుండగా, మరొకరు మాజీ ఎంపీగా ఉంటూ ప్రస్తుత ప్రభుత్వ కేటాయింపులపై అనుమానాలు వ్యక్తం చేస్తూ, సొంత తమ్ముడి హస్తం ఉందని ఆరోపిస్తూ ఏకంగా పార్టీ అధినేత, సీఎం చంద్రబాబుకు ఫిర్యాదు చేయడం తెలుగుదేశం పార్టీలో, రాష్ట్ర రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పుడీ వ్యవహారంలోకి జగన్ ను లాగి టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని మరో సంచలనానికి తెరతీశారు.

## బైసరన్ లోయ తెరిచారని మాకు తెలీదు అఖిలపక్ష భేటీలో కేంద్రం



పాకిస్థాన్:పహల్గామ్‌లో టూరిస్టులపై జరిగిన ఉగ్రదాడి తర్వాత ప్రతిపక్షాలు కొన్ని అనుమానాలను వ్యక్తం చేస్తున్నాయి. భద్రతా బలగాల వైఫల్యం కూడా ఈ దారుణానికి కారణం కావచ్చని అంటున్నాయి. ఇదే విషయాన్న అఖిలపక్ష సమావేశంలో కూడా లేవనెత్తాయి. దీనికి కేంద్రం స్పందిస్తూ కొన్ని ముఖ్యమైన విషయాలు చెప్పినట్లు సమాచారం. ఆ దాడి జరిగిన బైసరన్ లోయకు టూరిస్టులను అనుమతిస్తున్న విషయం అక్కడి అధికారులు భద్రతా సిబ్బందికి చెప్పలేదని ప్రభుత్వం వెల్లడించినట్లు తెలుస్తోంది. కొన్ని ఇంగ్లీష్ మీడియా కథనాలు ఈ విషయాన్ని పేర్కొన్నాయి.పహల్గామ్ ఉగ్రదాడి గురించి ఢిల్లీలో గురువారం అఖిలపక్ష సమావేశం జరిగింది. ఈ ఘటన వెనుక భద్రతా లోపం ఉందని.. దాడి జరిగిన వెంటనే ప్రభుత్వం సరిగా స్పందించలేదని ప్రతిపక్షాలు విమర్శించాయి. దాడి జరిగినప్పుడు భద్రతా బలగాలు, సీఆర్పీఎఫ్ ఎక్కడ ఉన్నాయని చాలా మంది నేతలు ప్రశ్నించారు. దీనికి ప్రభుత్వం తరఫున ఒక కేంద్ర మంత్రి సమాధానం ఇస్తూ.. సాధారణంగా జూన్ నుంచి మొదలయ్యే అమర్‌నాథ్ యాత్ర వరకు ఆ లోయ దగ్గరకు టూరిస్టులు వెళ్లకుండా ఆంక్షలు ఉంటాయి. కానీ ఈసారి భద్రతా ఏజెన్సీలకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే స్థానిక అధికారులు బైసరన్‌కు టూరిస్టులను అనుమతించారు. అంతేకాకుండా ఎత్తులో ఉండే ఆ ప్రాంతానికి చేరుకోవాలంటే 45 నిమిషాలు నడుచుకుంటూ వెళ్లాలి. అత్యవసర పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో దానిపై ఎలాంటి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ కూడా లేదు అని వివరించినట్లు తెలుస్తోంది.ప్రభుత్వం చెప్పిన దానికి కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు సమాచారం. వేల మంది టూరిస్టులు అక్కడికి వెళ్తుంటే ప్రభుత్వానికి తెలియక పోవడమేంటని ఆయన ప్రశ్నించారట. పహల్గామ్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండే ఈ బైసరన్ లోయను ‘మినీ స్విట్జర్లాండ్’ అని పిలుస్తారు. వేసవిలో చాలా మంది టూరిస్టులు ఇక్కడికి వస్తుంటారు. ఇక్కడి అందమైన పచ్చిక బయళ్లు, దట్టమైన చెట్లు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి.

## పహల్గామ్ దాడి సూత్రధారిని హతమార్చిన ఇండియన్ ఆర్మీ



బందిపొరా జిల్లా:ఇటీవల పహల్గామ్ లో అమాయక పర్యాటకులపై జరిగిన దారుణమైన ఉగ్రదాడి నేపథ్యంలో భారత భద్రతా బలగాలకు భారీ విజయం లభించింది. జమ్మూ కాశ్మీ ర్లోని బందిపొరా జిల్లాలో శుక్రవారం జరిగిన ఎదురుకాల్పుల్లో లష్కరే తోయిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీని భద్రతా బలగాలు మట్టుబెట్టాయి. పహల్గామ్ దాడి వెనుక కీలక సూత్రధారిగా భావిస్తున్న లల్లీ హతంతో ఉగ్రవాదులకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది.బందిపొరాలోని అల్తాఫ్ లల్లీ స్థావరం గురించి నిర్దిష్ట సమాచారం అందిన వెంటనే, భారత సైన్యం, జమ్మూ కాశ్మీర్ పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ ప్రారంభించాయి. ఈ క్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో అల్తాఫ్ లల్లీ హతమయ్యాడు. ఈ ఆపరేషన్లో ఒక ఉగ్రవాది గాయపడినట్లు, అలాగే ఇద్దరు పోలీసు సిబ్బంది కూడా గాయపడ్డారని అధికారులు తెలిపారు. గాయపడిన పోలీసులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.ఏప్రిల్ 22న పహల్గామ్లో జరిగిన హేయమైన ఉగ్రదాడిలో 25 మంది పర్యాటకులు , ఒక స్థానికుడు సహా మొత్తం 26 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దాడిలో పలువురు గాయపడ్డారు. ది రెసిస్టెన్స్ ఫ్రంట్ లష్కరే తోయిబాకు అనుబంధ సంస్థ ఈ దాడికి బాధ్యత వహించింది. ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్ కాశ్మీర్లో కార్యకలాపాలను పర్యవేక్షిస్తున్నాడు, ఇందులో విదేశీ ఉగ్రవాదులతో పాటు కొంతమంది స్థానిక మద్దతుదారులు కూడా ఉన్నారు. లాజిస్టికల్ సహాయం, సమాచారం , ఆశ్రయం కల్పించడంలో కొంతమంది స్థానికులు ఈ ఉగ్రవాదులకు సహకరిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి.పహల్గామ్ దాడి తరువాత, భారత సైన్యం కాశ్మీర్ లోయలో ఉగ్రవాదుల స్థావరాలపై అన్వేషణ , నిర్మూలన ఆపరేషన్లను తీవ్రతరం చేసింది. ఈ విస్తృత ఆపరేషన్లలో భాగంగానే ఈరోజు అల్తాఫ్ లల్లీని మట్టుబెట్టడం భద్రతా బలగాలకు లభించిన ముఖ్యమైన విజయం. ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి అమాయక పౌరుల భద్రతను కట్టుదిట్టం చేయడానికి భద్రతా బలగాలు నిరంతర ప్రయత్నాలు చేస్తున్నాయి.

## “పందులకు, పాకిస్తానీయులకు నో ఎంట్రీ”ఇండోర్‌లో భగ్గుమన్న ఆగ్రహం




పాకిస్తాన్:పహల్గామ్‌లో అంతమంది అమాయకులు చనిపోవడానికి కారణమైన ఉగ్రదాడి తర్వాత దేశం మొత్తం కోపంతో ఊగిపోతుంది. ఆ టైమ్‌లో ఇండోర్‌లోని ఒక ఫుడ్ స్టాల్ ముందు పెట్టిన బోర్డు అందరి దృష్టిని ఆకర్షించింది. దాని మీద “పందులు, పాకిస్తాన్ సిటిజన్లు ఛప్పన్ దుకాన్‌లోకి రావొద్దు” అని పెద్దగా రాసి ఉంది.ఇండోర్ లోని బాగా పేరున్న ఫుడ్ స్ట్రీట్ ఛప్పన్ దుకాన్‌లో పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ ఫోటోను పంది మొహంలా మార్చి పెట్టారు. ఆ పోస్టర్‌తో చాలామంది అక్కడికి వచ్చి సెల్ఫీలు దిగుతున్నారు. అదో పెద్ద నిరసనలా మారింది.ఆ పోస్టర్ ఎందుకు పెట్టారో ఛప్పన్ దుకాన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుంజన్ శర్మ చెబుతూ.. “వాళ్లు (పాకిస్తాన్) మనవాళ్ల విశ్వాసాన్ని టార్గెట్ చేశారు. అందుకే మేం ఇలా నిలబడి న్యాయం అడుగుతున్నాం. మోదీ గారు దీనికి గట్టిగా సమాధానం చెబుతారని ఎదురు చూస్తున్నాం.” అన్నారు.ఆ ఫుడ్ స్ట్రీట్‌లోని వ్యాపారులు, పనిచేసేవాళ్లు కూడా నల్ల బ్యాడ్జీలు కట్టుకుని దాడిలో చనిపోయినవాళ్లకు తమ సంతాపాన్ని తెలిపారు. లోకల్ లాయర్ లోకేష్ మంగల్ ప్రధాని మోదీకి ఒక లెటర్ రాశారు. పహల్గామ్ దాడితో సంబంధం ఉన్న ఏ ఉగ్రవాదినైనా చంపితే, అది సైనికుడైనా సరే, సామాన్యుడైనా సరే, కోటి రూపాయలు రివార్డు ఇస్తామంటూ ప్రకటించారు.వంద మంది ఉగ్రవాదులను చంపితే వంద కోట్లు ఇస్తానని మంగల్ తేల్చి చెప్పారు. “మేం రక్షణ కోసం టాక్స్ కడుతున్నాం కదా. ఆ డబ్బులో కొంచెం మా భద్రత కోసం ఎందుకు వాడకూడదు?” అని ఆయన అడిగారు. తన సవాలు కింద దేశం కోసం పనిచేసే ఎవరికైనా ఫ్రీగా లీగల్ హెల్ప్ కూడా ఇస్తానంటూ ఆయన ప్రామిస్ చేశారు. ఏప్రిల్ 22, 2025న పిరికిపందల్లా చేసిన ఆ ఉగ్రదాడిలో 26 మంది చనిపోయారు.

www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం,
ఏప్రిల్ 26, 2025

సంపుటి : 01 | సంచిక : 351 పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ
CMD

# మోడీకి మద్దతు తెలుపుతున్నా...



## రైతులకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి

- ఎన్‌డీఎస్ఏ నివేదిక చూసిన తర్వాతైనా వారు సిగ్గుపడాలి
- కాళేశ్వరం నిర్మాణం చేసినవారు, చేయించిన వారు రైతులకు ద్రోహం చేశారు

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వివరాలు 5లో

- 140 కోట్ల మంది ప్రజలు ప్రధాని వెంట ఉంటారు
- ప్రజలు ఏకమై ఉగ్రవాదంపై పోరాడాలి
- పాక్ ఉగ్రవాదుల దాడి చేయడం హేయమైన చర్య
- బాధిత కుటుంబాలకు అండగా ఉండాల్సిన అవసరం ఉంది
- 1971లో పాకిస్థాన్‌కు ఇందిరాగాంధీ గట్టిగా బుద్ధి చెప్పారు
- ఆమెను గుర్తుకుతెచ్చుకొని పాక్‌కు మరోసారి గట్టిగా బుద్ధి చెప్పాలి
- పార్టీలు, సిద్ధాంతాలకు అతీతంగా ఉగ్రవాదంపై పోరు జరపాలి
- అందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతం చేసి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలి
- ఉగ్రదాడికి పాల్పడిన వారికి కఠినంగా శిక్షించాలి - ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ
- ర్యాలీలో పాల్గొన్న ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ



**విశ్వంభర, హైదరాబాద్:** జమ్ముకశ్మీర్‌లోని పహల్గాం ఉగ్రదాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో సీఎం రేవంత్ రెడ్డి సహా పలువురు మంత్రులు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, భారత్ సమ్మిట్‌కు వచ్చిన విదేశీ ప్రతినిధులు పాల్గొన్నారు. భారీ సంఖ్యలో నగరవాసులు పాల్గొని పహల్గాం మృతులకు సంతాపం తెలిపారు.

**మరోసారి పాకిస్థాన్‌ను ఓడించాలి: రేవంత్**

పాకిస్తాన్ ఉగ్రవాదులు భారతదేశంలోకి చొచ్చుకొని వచ్చి పర్యాటకుల మీద దాడి చేయడం హేయమైన చర్య అని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే భారత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. 140 కోట్ల మంది భారతీయులందరూ రాజకీయాలకు, మిగతా 5లో...

## భారత్ సమ్మిట్ ద్వారా దిశా నిర్దేశం

- హైదరాబాదులో నిర్వహిస్తున్న భారత్ సమ్మిట్ చారిత్రాత్మకమైనది
- తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రపంచానికి చాటి చెప్పాం
- దీని ద్వారా తెలంగాణకు పెట్టుబడులు ఆహ్వానించాం.
- టెర్రరిజానికి వ్యతిరేకంగా దేశం కోసం అందరం ఒక్కటై నిలబడదాం
- మీడియా సమావేశంలో వెల్లడించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** భారత్ సమ్మిట్ ద్వారా కాంగ్రెస్ పార్టీ దిశా నిర్దేశం చేస్తున్నదని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ హెచ్ఐసిసి నోవాటేల్లో జరిగిన భారత్ సమ్మిట్ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క మాట్లాడారు. ప్రపంచంలో కోల్డ్ వార్ జరుగుతున్న సమయంలో ప్రపంచం మొత్తం రెండు కూటములుగా విడిపోయిన సమయంలో కొన్ని దేశాలతో కలిసి ఆనాటి మిగతా 5లో...





## నిపుణుల కమిటీ ఆ ప్రాజెక్టునే చూడలేదు

- ఎన్‌డీఎస్ఏను కేంద్రం పంపిన దూతగా మాత్రమే చూస్తాం
- వారు కనీసం విచారణ కూడాజరుపలేదు

బిహార్‌లో బ్రిడ్జీలు కూలుతుంటే ఎన్డీఎస్ఏ ఏం చేస్తుంది

- పదేళ్లలోనే తాము తెలంగాణను దేశంలోనే నెంబర్ స్టేట్‌గా నిలిపాం
- కాంగ్రెస్ మంత్రులు అలర్ట్‌గా ఉండాలి..
- సీఎం ఫోన్‌లు ట్యాప్ చేయిస్తున్నారు..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్

వివరాలు 5లో



## వక్ఫ్ సవరణ చట్టంపై పిల్..

- సుప్రీంలో తేలాక చూద్దామన్న హైకోర్టు
- తదుపరి విచారణ వేసవి సెలవుల తర్వాతకు వాయిదా

వక్ఫ్ సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయొద్దంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది.

వివరాలు 5లో

## సోనియా, రాహుల్‌కు నోటీసులు ఇవ్వలేం

- నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ విజ్ఞప్తిని నిరాకరించిన కోర్టు
- ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేవు.ఆ పత్రాలను దాఖలు చేయాలి
- ఈడీ అధికారులకు న్యాయమూర్తి ఆదేశాలు





**ఢిల్లీ:** నేషనల్ హెరాల్డ్‌కు సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో కాంగ్రెస్ అగ్రనాయకులు సోనియా గాంధీ , రాహుల్ గాంధీలకు నోటీసులు ఇవ్వాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ ఢిల్లీ కోర్టును ఆశ్రయించింది. కాగా న్యాయస్థానం దీనికి నిరాకరించింది. కొత్త చట్ట నిబంధనల ప్రకారం నిందితులను విచారించకుండా ఛార్జిషీట్‌ను పరిగణనలోకి మిగతా 5లో...



## హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎంఐఎం కైవసం..

- మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఘన విజయం
- 38 ఓట్ల తేడాతో గెలిచిన ఎంఐఎం అభ్యర్థి
- ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నకాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు

వివరాలు 5లో



## ఉగ్రవాదంపై పోరులో కేంద్రానికి అండగా ఉంటాం

- ఏ నిర్ణయం తీసుకున్నా ఏపీ ప్రభుత్వం, ప్రజలు మీ వెంటే..
- ప్రధాని నరేంద్రమోడీని కలిసి సంఘీభావం తెలిపిన సీఎం చంద్రబాబు
- రాజధాని నిర్మాణం పనుల పున:ప్రారంభానికి ప్రధానికి ఆహ్వానం

**న్యూఢిల్లీ :** ఉగ్రవాదంపై పోరాటంలో కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు, ప్రభుత్వం అండగా నిలుస్తారని, ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పేలా కేంద్రం తీసుకునే ఎలాంటి నిర్ణయానికైనా కట్టుబడి ఉంటామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రధాని నరేంద్ర మోదీతో అన్నారు. పహల్గామ్‌లో జరిగిన భయంకరమైన మిగతా 5లో...



## మంత్రి పొంగులేటి పేరిట వసూళ్లు..

- ఇద్దరు నిందితుల అరెస్టు
- ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకటరెడ్డి, మచ్చ సురేశ్‌లుగా గుర్తింపు
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన పొంగులేటి

**విశ్వంభర, వరంగల్:** తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పీఏలుగా చెప్పుకొంటూ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకటరెడ్డి, మచ్చ సురేశ్‌లుగా గుర్తించారు. దీనిపై మంత్రి పొంగులేటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పేరు చెప్పి ఎవరైనా మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. " ఎవరైనా నా పీఏలమని ఫోన్ చేస్తే నా దృష్టికి తీసుకురావాలి. నా కార్యాలయం 040-234561072/ 040-23451073కు ఫోన్ చేసి చెప్పాలి" అని తెలిపారు.వరంగల్: తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పీఏలుగా చెప్పుకొంటూ వసూళ్లకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు మిగతా 5లో...

## పాక్ పౌరులు ఈనెల 30లోపు వాఘా సరిహద్దు దాటాలి

- వీసాలు పొందిన వారికి ఈనెల 27 వరకు గడువు
- మెడికల్ వీసాలపై వచ్చిన వారికి ఈనెల 29కు అనుమతి
- ఆదేశాలను ఉల్లంఘిస్తే.. చట్టపరంగా కఠిన చర్యలు
- డీజీపీ జితేందర్ కీలక ఆదేశాలు



**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణకు వచ్చిన పాకిస్థానీయులకు డీజీపీ జితేందర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. వారంతా వెంటనే దేశం విడిచి వెళ్లిపోవాలన్నారు. పాకిస్థానీయులకు వీసాలను కేంద్రం మిగతా 5లో...

## 2047 నాటికి మానవ రహిత వ్యవసాయం

- బిట్స్, అగ్రికల్చర్ యూనివర్సిటీ మధ్య ఒప్పందం
- ఆధునిక టెక్నాలజీని వినియోగించి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకే ఒప్పందం
- బిట్స్ పిలాని ఉపకులపతి ప్రొఫెసర్ వి. రాంగోపాల్ రావు



వివరాలు 5లో

## ఇరు దేశాలూ సంయమనం పాటించాలి

- ఉగ్రవాదుల దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నాం
- సామాన్య పౌరులపై దాడి చేయడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు
- ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్



**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాద దాడి తర్వాత ఉద్రిక్త పరిస్థితులు మరింత దిగజారకుండా ఉండేందుకు భారత్, పాకిస్థాన్‌లు వీలైనంత సంయమనం పాటించాలని ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ పిలుపునిచ్చారు. పెహల్‌గామ్‌లో పర్యాటకులపై జరిగిన కుట్ర దాడి, ఆ తర్వాత నెలకొన్న ఆందోళనకర పరిస్థితులను గమనిస్తున్నామని ఐక్యరాజ్యసమితి ప్రతినిధి స్టిఫెన్ దుజారిక్ చెప్పారు. ఉగ్రవాదుల దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. సామాన్య పౌరులపై దాడి చేయడం ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు. ప్రస్తుత పరిణామాల మధ్య రెండు దేశాలూ సంయమనం పాటించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఇరు దేశాల మధ్య ఏవైనా సమస్యలు ఉంటే, అర్థవంతమైన, పరస్పర సహకారంతో శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చని మేము నమ్ముతున్నామని చెప్పారు. మిగతా 5లో...



## ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్ కన్నుమూత

- 9 ఏళ్లపాటు ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహణ
- ఆయన హయాంలో తొలి లూనార్ మిషన్‌కు అడుగులు
- రాజ్యసభ సభ్యునిగా, ప్రణాళిక సంఘం సభ్యునిగా సేవలు
- నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా పనిచేసిన రంగన్

వివరాలు 5లో

# రజతోత్సవ సభకు బీఆర్ఎస్ రెడీ

## కేసీఆర్ ప్రసంగంపై సర్వత్రా ఆసక్తి

**రజతోత్సవ సభకు సమావేశానికి కీలక నేతలతో తన ఎర్రవల్లి ఫామ్ హౌస్ లో భేటీ అవుతూనే ఉన్నారు. బి ఆర్ఎస్ పార్టీ సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు.మాజీ సీఎం కేసీఆర్ ఆట విజయాన్ని తెచ్చి పెడుతుందా..!? లేదా?**



తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడ చూసిన గ్రామీణ పట్టణ నగర ప్రాంతాల్లో ప్రజలందరూ 27వ తేదీ ఆదివారం కేసీఆర్ మీటింగ్ గురించి మాట్లాడుకుంటున్నారు అసలు కేసీఆర్ మీటింగ్ ఇప్పుడు మొదలేం కాదు. తెలంగాణ ఉద్యమ 2001 నుంచి ఆయన ప్రసంగాన్ని వినని వాళ్ళు అంటూ ఎవ్వరు ఉండరు. కానీ మాట్లాడిన ప్రతిసారి కెసిఆర్ తనదైన వాక్చాతుర్యంతో ప్రజలను తన వైపు తిప్పుకుంటాడు. ఒక్క ప్రజలనే కాదు పరిస్థితులను కూడా తనవైపు మళ్ళించుకునేలా రాజకీయ వ్యూహాల్ని రచిస్తుంటాడు. అందుకే కేసీఆర్ ని అపర చాణుక్యుడు అనే పేరు కూడా ఉంది. అవసరం వస్తే ఎక్కడ దాకనైనా వెళ్తాడు. అవసరం లేకపోతే పక్కన ఉన్న పట్టించుకోడు.. నిజానికి పది సంవత్సరాలు అధికారం దక్కించుకున్న కేసీఆర్ తెలంగాణకు తానే జాతిపితగా నిర్ధారించుకొని ప్రజల చేత ఆ పిలుపును పిలిపించుకున్నాడు. నచ్చిన వాళ్లకు బాగానే ఉంది కానీ నచ్చని వాళ్లకు మాత్రం కెసిఆర్ ఒక్కటే తెచ్చాడా విద్యార్థుల బలిదానాలు సబ్బండ వర్ణాల, వర్గాల కలయికతో అన్ని రాజకీయ పార్టీల ఉమ్మడి పోరాటంతో సాధ్యమైంది కదా అని కూడా చెప్పొచ్చు. ఏది ఏమైనా మలిదశ ఉద్యమానికి నాయకుడిగా నిలబడి అవమానాలు తిన్న చీత్కారాలు తిన్న ఎన్ని మాటలు మాట్లాడిన కెసిఆర్ మలిదశ తెలంగాణ ఉద్యమ విజేతగా నిలిచాడు. దీన్ని ఎవరు కాదనలేరు. ఇక్కడే అసలైన ట్విస్ట్ దాగుంది. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ వైపు అనేకమంది కులాలకు మతాలకు అతీతంగా రాజకీయాలకు అతీతంగా తన చేయి పట్టి తన దారిలో నడిచారు. కానీ కెసిఆర్ ఏం చేశారు? ఒక్కొక్క మెట్టు రాజకీయంగా ఎదగాలంటే ఒక్కొక్కరిని ఎంచుకొని వారిని బాగా వాడుకున్నాడు. ఒక్క మాటలో చెప్పాలంటే వాడుకున్నోనికి వాడుకున్నంత..! ఇప్పటికే మీకు బాగా అర్థమైంది అనుకుంటా..

చాలామంది ఆయా నియోజకవర్గాల్లో కులాలకు అతీతంగా ఆర్థిక స్థితిగతులతో మెరుగుపడిన వాళ్లు కేసీఆర్ నినాదం బాగా నచ్చి ఆయననే బాస్ అనుకొని తమకున్న ఆస్తులు అన్ని అమ్మి ఉద్యమంలో ముందు వరుసలో నడిచారు మలిదశ తెలంగాణ పోరులో ముందు వరుసలో నిలబడ్డారు. అధికారం వచ్చిన తరువాత కనీసం వారిని పలకరించిన పాపాన పోలేదు కేసీఆర్. ఆ వరుసలో ఆలే నరేంద్ర దగ్గర నుంచి తెలంగాణ తల్లి విజయశాంతి వరకు అందరూ కెసిఆర్ కు బలి అయిన వాళ్లే.... ఒక స్టేజీలో ఒక్కొక్కరు ఇలా పేర్లు చెప్పుకుంటూ పోతే లిస్టు చాలా పెద్దగానే ఉంటుంది. ఏదైతేనేం తెలంగాణ తెచ్చిండు గప్పుడు గాయనే ముఖ్యమంత్రి అనుకునేంతగా తెలంగాణ ప్రజలు మూకుమ్మడిగా కేసీఆర్ ని ముఖ్యమంత్రిగా నిలబెట్టుకున్నారు. అలాగే రెండవసారి 2018 లో కూడా మళ్లీ కెసిఆర్ నిలబెట్టుకున్నారు. ఎందుకంటే గడచిన ఐదు సంవత్సరాలలో చాలా సంక్షేమ పథకాలు కొనసాగిస్తూ 2018 లో కూడా గెలిపిస్తే మరింత సంక్షేమాన్ని అందిస్తా అన్న ఉద్దేశంతో కేసీఆర్ ని బాగా నమ్మి ప్రజలు 2018 లో కూడా ఆయనను ముఖ్యమంత్రిగా నిలబెట్టుకున్నారు. రెండవసారి తెలంగాణ ముఖ్యమంత్రిగా కేసిఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించాడు. రైతుబంధు దగ్గర నుంచి కల్యాణ లక్ష్మి వరకు... ఇలా అన్ని సామాజిక వర్గాలను దృష్టిలో పెట్టుకొని సంక్షేమాన్ని బాగానే అందించాడు. కానీ అవినీతి ఆక్రమణలు తన ఎమ్మెల్యేల ఆగడాలు ప్రతి నియోజకవర్గంలోని ప్రజలు తట్టుకోలేకపోయారు. మొత్తానికి దొర పాలన జరిపినట్టే ఉంది అనే విధంగా మూడవసారి అనుకున్నట్టుగానే కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది కానీ సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం చేసేదాకా ప్రజలు మౌనముద్రనే దాల్చారు. ఒక్కసారిగా రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత రేవంత్ రెడ్డి పైన కూడా ఆరోపణలు ఇవ్వాలా బాగానే వినిపిస్తున్నాయి.. ఒక మాటలో చెప్పాలంటే రియల్ ఎస్టేట్ వ్యాపారి భూ దోపిడీదారుడు అనే విధంగా సమాజంలో ముఖ్యమంత్రి పై ఆరోపణలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. ఇవన్నీ ఒక వైపు ఉంటే ఇంకో వైపు పది సంవత్సరాలు సీఎంగా అధికారం చలాయించిన కెసిఆర్ ఐదు సంవత్సరాలు అధికారం కోల్పోయేసరికి కొన్ని నెలల వరకు ఫామ్ హౌస్ లోనే ఆయన రెస్ట్ తీసుకున్నాడు. శాసనసభకు రానే రాలేదు. అందులో కూడా ఒక దళిత స్పీకర్ ఉన్నాడనే ఉద్దేశంతో రాలేదని ఆ మధ్యన ఆరోపణలు గట్టిగానే వినబడ్డాయి. వాటిని పటా పంచలు చేస్తూ వెంటనే శాసనసభలో అడుగు పెట్టాడు కేసీఆర్... ఇంకేముంది తెలంగాణ ప్రజల దృష్టి శాసనసభ వైపు మళ్ళింది. ఆ తర్వాత మళ్లీ శాసనసభకు రాలేదు. ఈ మధ్య కాలంలోనే ఆ పార్టీ రజతోత్సవం రానే వచ్చింది. ఈ వేడుకకు ఆధ్యాత్మికంగా మంచి చెడు అన్ని చూసుకున్న కేసీఆర్, దాదాపు ప్రతి నియోజకవర్గంలోని ముఖ్యమైన నాయకులకు ఇప్పటికే 50 లక్షల వరకు ఇచ్చినట్టు సమాచారం. ఒక్కొక్క ముఖ్య నేతకి 50 లక్షల చొప్పున అప్పుడే పంచి వేశాడట. అంటే ఈ వేడుకకు మొత్తం అయ్యే ఖర్చు 100 కోట్లట.... ఈ సొమ్మంతా ఎవరిది? ఎక్కడిది? అనే అనుమానాలు మీకు రావచ్చు. సమాధానం కూడా మీకు తెలుసు. ముఖ్యంగా సభను విజయవంతం చేసి రాబోయే ఎన్నికల్లో అంటే ఇంకా మూడు సంవత్సరాల ముందే తన ముఖ్య నేతలకి కెసిఆర్ సమావేశాలు నిర్వహిస్తూ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఆయా నియోజకవర్గాల వారిగా సన్నాహక సమావేశాలు పెట్టుకోవాలని నేతలకు దిశా నిర్దేశం చేస్తున్నారు. ఎందుకంటే ఒక ప్లాన్ తో ఉండాలనే ఉద్దేశంతోనే తాజా మాజీ ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు ముఖ్య నేతలతో కేసీఆర్ దీర్ఘసమాలోచనలు చేస్తున్నాడు. కెసిఆర్ సభలో యధావిధిగా తన ప్రసంగం ఎలా ఉన్నా.. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తను గతంలో ఇచ్చిన సంక్షేమాన్ని బేరీజు వేసే క్రమంలో కాంగ్రెస్ పార్టీని అటు బిజెపి పార్టీని గట్టిగానే కౌంటర్ ఇచ్చే విధంగా కనిపిస్తోంది. మాట్లాడేంతవరకు మాట్లాడి చివరకు ప్రజలపై విరుచుకుపడతాడు అనే విధంగా ఆయన ప్రసంగం కొనసాగుతుంది.. ఎందుకంటే కెసిఆర్ తప్పును ఒప్పుకుంటాడు. తప్పును ఒప్పుగా చూపిస్తాడు. తను లేకపోతే తెలంగాణ ఎంత ఆగం అవుతుందో అర్థం అయ్యేట్టు ప్రజలకు చెప్పగలిగే ఒక అసలు సిసలైన రాజకీయ నాయకుడు.. మరి ఈ సభ ద్వారా బీఆర్ఎస్ చీఫ్ రాజకీయ జీవితాన్ని మరో ప్రస్థానాన్ని ఒక మాటలో చెప్పాలంటే మళ్ళీ ఆనాటి తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకొని విజయ తీరాలకు చేరుతాడా? లేదా? అనేది ప్రజా కోర్టులోనే తేల్చుకోవాలి...ఇక ఆయన నియోజకవర్గాల్లో ఉన్న ఆశావాదులు తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ తో వెంట నడిచిన వాళ్ళు మళ్లీ వాళ్ళ ఆశలు నిరాశలుగా మిగులుతాయా.? అన్న సందేహంతో ఆశవాదులు కొట్టుమిట్టాడుతూ వెళ్లలేక ఉండలేక సతమతమవుతున్నారు. కనీసం ఇప్పుడైనా అధిపతి మా వైపు చూస్తాడా!? అనే ఆశ నిరాశ చెందిన నేతల్లో మళ్లీ చిగురిస్తుంది.

సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్న క్రమంలో గతంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో ముందు వరుసలో నిలబడి రౌడీషీట్ కేసులు కూడా మీద వేసుకొని కేసిఆర్ కోసం తమ ప్రాణాలను అర్పించేందుకు కూడా సిద్ధపడిన మలిదశ తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం జరిగిందనే మాట మళ్లీ ఒకసారి కేసీఆర్ దృష్టికి వచ్చేలా సన్నాహక సమావేశాల్లో ఉద్యమంలో ముందు నడిచిన వారు అన్ని పోగొట్టుకున్న వారు ఉద్యమం కోసం కేసులు కూడా భరించినవారు గొంతును గర్జించేలా మల్లొకసారి కేసీఆర్ దృష్టిలో పడేందుకు సన్నాహకాలు కూడా చేస్తున్నారు... ఏది ఏమైనా 100 కోట్లు ఖర్చుపెట్టి కేసీఆర్ రజోత్సవ సభ ఏర్పాటు ఎలాగైతే చేస్తున్నాడో మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన వెంట నడిచిన వారిని మరొక్కసారి గుర్తు పెట్టుకుని వారికి సముచిత స్థానం కల్పించాలని వారిని గుర్తుపట్టి దగ్గరకు తీసుకోవాలని కేసీఆర్ అభిమాన నాయకులు ఆశవాదులు ఆయనను వేడుకుంటున్నారు. మరి కెసిఆర్ మీటింగ్ ద్వారా అందరికీ ఒక దిశ నిర్దేశాన్ని అందిస్తాడా? పార్టీ రాజకీయ నాయకుడిగా మాట్లాడతారా? ప్రజల మనిషిగా మాట్లాడుతారా? అన్నది వేచి చూడాల్సిందే..



కదారి శ్రీనివాస్ - సీనియర్ జర్నలిస్ట్

# గణిత శాస్త్ర అపర మేధావి శ్రీనివాస రామానుజన్ నేడు ఆయన వర్ధంతి



సున్నాను కనిపెట్టి ప్రపంచ గణిత శాస్త్రానికి భారతీయులు అద్భుత కానుకను అందించారు. అప్పటి వరకు చుక్కానీ నావలా ప్రయాణిస్తోన్న గణితానికి సున్నా ఆవిష్కరణతో గొప్ప ప్రాధాన్యత సంతరించుకుంది. గణితశాస్త్ర అధ్యయనం భారతదేశంలో వేదకాలం నుంచే ప్రారంభమైంది. ప్రాచీన భారతీయులు గణితంలో ఎన్నో విషయాలు కనుగొన్నారు. సంఖ్యలను కనుగొనడంలో చాల కృషి చేశారు. దశాంశ పద్ధతిని గుర్తించిన మొదటివారు భారతీయులే. ఆర్యభట్ట కాలాన్ని భారతీయ గణితశాస్త్రానికి స్వర్ణయుగంగా పేర్కొంటారు. ఇది భాస్కరాచార్యుని వరకు అప్రతిహతంగా సాగింది. భాస్కరాచార్యుని తర్వాత కాలంలో బహుళ విదేశీ దండయాత్రల వల్ల గణితం కళా విహీనమైంది. అనువాదాలు, వ్యాఖ్యానాలు తప్ప పెద్దగా స్వతంత్ర గణిత సారస్వతం ఏదీ ఆవిష్కరణ కాలేదు. ఆ స్థితిలో మళ్లీ భారతీయ గణిత చరిత్రకు వన్నెలద్దిన వాడు శ్రీనివాస రామానుజన్.అపారమైన మేధస్సుతో భారతదేశపు కీర్తిని ప్రపంచ గణిత శిఖరాలపై ఎగురవేసిన మేధావి శ్రీనివాస రామానుజన్. శ్రీనివాస రామానుజన్ అయ్యంగార్ భారత దేశానికి చెందిన ప్రముఖ గణిత శాస్త్రవేత్త. 20వ శతాబ్దంలో ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన గొప్ప గణిత మేధావులలో ఒకరు. పది సంవత్సరాల వయసులోనే గణిత శాస్త్రంతో అనుబంధం ఏర్పరుచుకొని గణితం పట్ల ఆశక్తిని పెంచుకొని త్రికోణమితి మీద రాసిన పుస్తకాలను చదివి పూర్తిగా అవగాహన చేసుకొని, పదమూడు సంవత్సరాలు నిండే సరికల్లా ఆ పుస్తకాన్ని పరిపూర్ణంగా అర్థం చేసుకొని, సొంతంగా సిద్ధాంతాలు కూడా తయారు చేయడం ప్రారంభించే స్థాయికి ఎదిగిన ప్రజ్ఞావంతుడు రామానుజన్. రామానుజన్ డిసెంబర్ 22, 1887 నాడు తమిళనాడు రాష్ట్రంలోని ఈరోడ్ పట్టణంలో జన్మించారు. రామానుజన్ తండ్రి కె శ్రీనివాస అయ్యంగార్ ఒక చీరల దుకాణం లో గుమాస్తాగా, తల్లి కోమలటమ్మాళ్ గృహిణిగా ఉండేవారు. వీరు కుంభకోణం పట్టణంలోని ఒక పెంకుటింట్లో నివసించేవారు. 1892 అక్టోబరులో రామానుజన్ ఊళ్ళో ఉన్న చిన్న పాఠశాలలో చదవడం ప్రారంభించాడు. రామానుజన్ తాత కాంచీపురం న్యాయస్థానంలోని ఉద్యోగం కోల్పోవడంతో, రామానుజన్ తల్లితో సహా కుంభకోణం చేరుకుని అక్కడ కంగయాన్ ప్రాథమిక పాఠశాలలో చేరాడు. ఆ తర్వాత మద్రాస్ మారినా చదువు పట్ల శ్రద్ధ కనబరచలేదు. తల్లి నుంచి రామానుజన్ సంస్కృతి సంప్రదాయాల గురించి, ఆచార వ్యవహారాల గురించి, పురాణాల గురించి తెలుసుకుని అనతి కాలంలోనే ఆంగ్లం, తమిళం, భూగోళ శాస్త్రం, గణితంలో పట్టు సంపాదిస్తూ ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. మంచి మార్కుల తో జిల్లాలో అందరికన్నా ప్రథముడిగా నిలిచి 1898లో హయ్యర్ సెకండరీ పాఠశాలలో చేరాడు.

ఈ పాఠశాలలోనే మొట్టమొదటి సారిగా గణితశాస్త్రంతో పరిచయం ఏర్పడి కాలక్రమంలో ప్రపంచం మెచ్చే వ్యక్తిని చేసింది. 15 ఏళ్ళకే రామానుజన్‌లోని తెలివితేటలను ప్రపంచానికి చాటడానికి దోహదం చేసిన గ్రంథం జార్జ్ స్కూచ్ సిడ్జ్‌కార్ రాసిన 'సినాప్సిస్'. అందులో ఆల్‌జీబ్రా, అనలిటికల్ జామెట్రీ వంటి విషయాల మీద దాదాపు 6165 సిద్ధాంతాలున్నాయి. వీటి నిరూపణలు చాలా కష్టంగా ఉండేవి. పెద్దపెద్ద ప్రొఫెసర్‌లు సైతం అర్థం చేసుకోలేకపోయిన ఈ సిద్ధాంతాలను, సూత్రాలకు రామానుజన్ ఎటువంటి పుస్తకాలను తిరగేయకుండా వాటి సాధనలను అలవోకగా కనుక్కునేవారు. అప్పటికే అందులో చాలా సమస్యలు నిరూపించబడ్డాయన్న విషయం ఆయనకు తెలియకపోవడం చేత వాటిని తన పద్ధతితో సాధించి చూపారు. 1909, జులై 14వ తేదీన రామానుజన్‌కు జానకీ అమ్మాళ్ అనే తొమ్మిదేళ్ళ బాలికతో వివాహమైంది. లెక్కల వల్ల కొడుకుకి పిచ్చిపడుతుందేమోనని భయపడిన రామానుజం తండ్రి ఆయనకు పెళ్ళి చేశారు. సంసారం గడవటం కోసం 25 రూపాయల వేతనం మీద రామానుజన్ గుమాస్తాగా చేరారు. గణితంలో ఆయన ప్రదర్శిస్తున్న ప్రజ్ఞను చూచి ఏ డిగ్రీ లేకపోయినా మద్రాసు విశ్వవిద్యాలయం నెలకు 75 రూపాయల ఫెలోషిప్ మంజూరు చేసింది. అప్పట్లో కొత్తగా ఒక గణిత శాస్త్ర సమాజాన్ని ఏర్పరిచిన డిప్యూటీ కలెక్టర్ రామస్వామిని కలిసి తనకొక చిన్న ఉద్యోగం ఇప్పించాలని కోరాడు. తాను తీరిక వేళలో గణితం మీద రాసుకున్న నోటు బుక్కులను చూపించాడు. వాటిని చూసిన అయ్యర్ చాలా ఆశ్చర్యపోయి రామానుజన్ ప్రతిభ చాలా గొప్పదని గుర్తించాడు. తన వద్ద చిరుద్యోగిగా చేరడం బాగుండదని భావించి మద్రాస్‌లో తనకు పరిచయం ఉన్న గణిత శాస్త్రవేత్తల దగ్గరకు తన సిఫారసు లేఖతో పంపించాడు. రామానుజన్ రాసుకున్న పుస్తకాలను చూసిన కొద్ది మందిలో ఒకరైన జిల్లా కలెక్టరుగా పని చేస్తున్న రామచంద్రరావు, భారతీయ గణిత శాస్త్ర సమాజంలోని బృందానికి రామానుజన్ ప్రతిభ అమోఘం అని అర్థమైంది. రామానుజన్ ప్రతిభను గుర్తించిన నారాయణ అయ్యర్, రామచంద్ర రావు, ఇడబ్లు మిడిల్‌మాస్ట్ మొదలైన వారు రామానుజన్ పరిశోధనలను ఆంగ్ల గణిత శాస్త్రవేత్తలకు చూపించడానికి ప్రయత్నించారు. లండన్ యూనివర్శిటీ కాలేజీకి చెందిన ఎంజెఎం హిల్ అనే గణితజ్ఞుడు రామానుజన్ పరిశోధనలను చదివి అందులోని తప్పులను సవరించడానికి తగిన సలహాలు అందించి ప్రోత్సహించాడు.

1913లో మద్రాస్ పోర్ట్ ట్రస్ట్‌కు వచ్చిన ప్రసిద్ధ గణిత శాస్త్రవేత్త డాక్టర్ హకర్ రామానుజన్ పరిశోధనలు చూసి ఆశ్చర్యపోయి రామానుజన్ కనుగొన్న 120 పరిశోధనా సిద్ధాంతాలను ఆ కాలంలో ప్రసిద్ధుడైన కేంబ్రిడ్జి ప్రొఫెసర్ గాడ్ ఫ్రెహెరాల్ హార్డికి పంపారు. ఉన్నత స్థాయి గణితజ్ఞుడు రాయగల ఆ ఫలితాలను చూసి వెంటనే రామానుజన్‌ను జిహెచ్ హార్డీ కేంబ్రిడ్జి యూనివర్శిటీకి ఆహ్వానించారు. రామానుజన్ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో 1919 మార్చిలో ఇంగ్లాండ్ నుండి భారత దేశానికి తిరిగి వచ్చారు. వెళ్ళేటప్పుడు ఎలా ఉన్నాడో అలాకాక పాలిపోయిన ముఖంతో ఏమాత్రం బలం లేని శరీరంతో అస్థిపంజరంవలే తిరిగి రావడం చూసి అక్కడి వారందరూ చలించిపోయారు. అనేక రకాల వైద్యం చేయించినా ఆయన కోలుకోలేకపోయారు. దాంతో ఆయన 1920, ఏప్రిల్ 26న పరమపదించారు. అతి చిన్న వయసులో ప్రపంచం ఆశ్చర్యపోయే మేధా సంపత్తిని కలిగిన ఒక గొప్ప గణిత శాస్త్రజ్ఞుడిని కోల్పోవలసి వచ్చింది. ఫిబ్రవరి 28, 1918లో ఫెలో ఆఫ్ ద రాయల్ సొసైటీ గౌరవం పొందిన రెండవ భారతీయునిగా, 1918 అక్టోబరులో 'ఫెలో ఆఫ్ ద ట్రినిటీ కాలేజీ' గౌరవం పొందిన మొదటి భారతీయుడిగా రామానుజన్ చరిత్రకెక్కారు.



చొల్లేటి ఉపేంద్రాచారి
సీనియర్ జర్నలిస్ట్
సూర్యాపేట, సెల్: 9948536001

(మొదటి పేజీ తరువాయి)

# మోడీకి మద్ధతు తెలుపుతున్నా



పార్టీల సిద్ధాంతాలకు అతీతంగా తీవ్రవాదంపై పోరాడాల్సిన అవసరం ఉందని అన్నారు. 1971లో ప్రధాని ఇందిరాగాంధీ పాకిస్థాన్‌ను రెండు ముక్కలు చేశారని... ఇప్పుడు మళ్లీ ఆ దేశాన్ని రెండు ముక్కలు చేసి, పీవోకేను హిందూస్థాన్‌లో కలిపేయాలని ప్రధాని మోడీని కోరారు. పహల్గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, అందరినీ ఆహ్వానించిందని చెప్పారు. భారత ప్రభుత్వానికి అండగా నిలబడి, ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్యకు మద్దతుగా నిలబడాలని నిర్ణయించిందని తెలిపారు. "ఇది చాలా భావోద్వేగమైన సందర్భం... ఇలాంటి సందర్భంలో మనమందరం ఏకమై భారతదేశ సార్వభౌమాధికారాన్ని కాపాడాల్సిన అవసరం ఉంది. మనమందరం ఏకమై తీవ్రవాదాన్ని అంతమొందించి ప్రపంచానికి ఆదర్శంగా నిలబడాల్సిన సమయం వచ్చింది. భారత ప్రభుత్వానికి అండగా నిలబడాలి. దాడులను తిప్పికొట్టడమే కాకుండా, దాడులకు పాల్పడినవారిని కఠినంగా శిక్షించాలి. ఉగ్రదాడి బాధిత కుటుంబాలకు దేశ ప్రజలంతా అండగా నిలబడాలి. చనిపోయిన కుటుంబాలకు తెలంగాణ ప్రభుత్వం మద్దతుగా నిలబడుతుంది" అని రేవంత్ రెడ్డి అన్నారు.'మేమంతా కలిసి దేశ ప్రధాని నరేంద్ర మోదీకి మద్దతిస్తాం. 1967లో చైనా మన దేశంపై దాడి చేసినప్పుడు ఇందిరా గాంధీ తగిన సమాధానం ఇచ్చారు.

## భారత్ సమ్మిట్ ద్వారా దిశా నిర్దేశం

ప్రధాని పండిట్ లాల్ నెహ్రూ అలీన విధానాన్ని తీసుకొని ప్రపంచానికి దిశా నిర్దేశం చూపారని అన్నారు. సుదీర్ఘకాలం తర్వాత ప్రపంచవ్యాప్తం గా పెరుగుతున్న ఆర్థిక రాజకీయ సామాజిక అసమానతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో అహింస సత్యం సామాజిక న్యాయం అనే మూడు ప్రాథమిక మూల సిద్ధాంతాలతో మరోసారి ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ భారత్ సమ్మిట్ ద్వారా దిశా నిర్దేశం చేస్తున్నదని చెప్పారు.కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాల ఆధారంగా భారత్ సమ్మిట్ జరుగుతున్నదని, ఈ సమ్మిట్ లో శాంతి కాముకులు, ప్రపంచ న్యాయం కోరుకునేవారు( గ్లోబల్ జస్టిస్) ప్రోగ్రెసివ్ ఆలోచనలు కలిగిన వారు 8 ప్యానెల్స్ గా చర్చల్లో పాల్గొన్నారని తెలిపారు. 100 దేశాల నుంచి హాజరైన ప్రతిని ధులు లింగ న్యాయం, ఫెమినిస్ట్ ఫ్యూచర్, ఫ్యాక్ట్ వర్సెస్ ఫిక్షన్, కౌంటరింగ్ డిస్ ఇన్ఫర్మేషన్, యూత్ అండ్ పాలిటిక్స్ ఆఫ్ టుమారో, షేవింగ్ న్యూ మల్టీ ల్యాటరీజం వంటి అంశాలపై లోతుగా చర్చలు చేశారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాదులో నిర్వహించే భారత్ సమ్మిట్ కార్యక్రమం చారిత్రాత్మకమైన సమ్మిట్ గా నిలిచిపోతుందని అభివర్ణించారు. తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమం గురించి భారత్ సమ్మిట్ ద్వారా ప్రపంచానికి చాటి చెప్పామన్నారు. సామాజిక న్యాయం, అభివృద్ధిని మేళవించి కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతాలను ఏ విధంగా ముందుకు తీసుకుపోతున్నామో ప్రపంచ ప్రతినిధులకు వివరించామని వెల్లడించారు. క్లీన్ అండ్ గ్రీన్ న్యూ ఎనర్జీ పాలసీ ద్వారా 2035 నాటికి 40 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, రీజినల్ రింగ్ రోడ్ ఔటర్ రింగ్ రోడ్డు మధ్య ఏర్పాటు చేస్తున్న క్లస్టర్స్, ఫ్యూచర్ సిటీ, మూసి పునర్జీవం, నాలెడ్జ్ ఐటీ సెంటర్, ఇందిరా గిరి జల వికాసం, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు, రాజీవ్ యువ వికాసం తదితర పథకాల గురించి భారత్ సమ్మిట్ హాజరైన ప్రతినిధులకు వివరించామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి అమలు చేస్తున్న సంక్షేమం పట్ల ప్రతినిధులు సంతోషాన్ని వ్యక్తం చేశారని వెల్లడించారు. దేశానికే మోడల్ గా నిలవబోతున్న తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా ప్రతినిధులను కోరినట్లు చెప్పారు. అదేవిధంగా లోక్ సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ తీసుకున్న గ్లోబల్ జస్టిస్ నిర్ణయాన్ని ముందుకు తీసుకెళ్లే క్రమంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రయత్నాన్ని ఈ సమ్మిట్ కు హాజరైన ప్రతినిధులు స్వాగతించి, అభినందించారని వెల్లడించారు.జమ్మూ కాశ్మీర్ పెహల్గామ్ లో ఉగ్రవా దులు జరిపిన కాల్పులకు నిరసనగా, బాధితులకు సంఘీభావంగా కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహి ంచాలని ఏఐసీసీ ఇచ్చిన పిలుపుమేరకు హైదరాబాదులో పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ నిర్వహించే కొవ్వొత్తుల ర్యాలీలో స్వచ్ఛందంగా పాల్గొంటామని భారత్ సమ్మిట్ కు హాజరైన ప్రతినిధులు తెలిపారని ఈ సందర్భంగా చెప్పారు. టెర్రరిజానికి వ్యతిరేకంగా దేశం కోసం అందరం ఒక్కటై నిలబడదామని పిలుపునిచ్చారు.శాంతి,అహింసా మార్గంలో గ్లోబల్ జస్టిస్ కోసం కాంగ్రెస్ తో కలిసి రావాలని కోరారు.

## ఉగ్రవాదంపై పోరులో కేంద్రానికి అండగా ఉంటాం

ఉగ్రదాడి తనను తీవ్ర ఆవేదనకు గురిచేసిందని చెప్పారు. శుక్రవారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీని కలిసిన ముఖ్యమంత్రి చంద్రబాబు ఈమేరకు తన సంఘీభావాన్ని తెలిపారు. ఉగ్రవాదులది పిరికిపంద చర్య అని, హింసను ఖండిస్తున్నామని ఈ సందర్భంగా అన్నారు. పహల్గామ్ బాధితుల కుటుంబాలకు అండగా నిలుస్తామని తెలిపారు. భారతదేశ భద్రతను కాపాడే విషయంలో మోదీ నాయకత్వానికి సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు.

**రాజధాని అభివృద్ధి పనులు వివరించిన సీఎం :**

మే 2న చేపట్టే రాజధాని పనుల పున:ప్రారంభానికి ప్రధాని నరేంద్రమోదీని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆహ్వానించారు. అమరావతిలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలను ప్రధానికి వివరించారు. దీనిపై స్పందించిన ప్రధాని, రాజధాని నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. అమరావతిలో పచ్చదనం పెంచేందుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని..., ఇందుకోసం మియావాకి విధానాన్ని అమలు చేయాలని సూచించారు. పనులు పున:ప్రారంభించే కార్యక్రమానికి హాజరయ్యేందుకు ప్రధానమంత్రి అంగీకారం తెలిపారు. మరోవైపు పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పురోగతిని, ఆర్ఐఎన్ఎల్ గురించి ప్రధానికి సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణకు కేంద్రం ఆమోదం తెలిపినందుకు సీఎం చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు.

## ఇరు దేశాలూ సంయమనం పాటించాలి

ఇదే సమయంలో సింధు జలాల ఒప్పందం రద్దు అంశంపై స్పందించిన గుటెరస్, ఉద్రిక్త పరిస్థితుల మధ్య నిబంధనల గురించి సంయమనం పాటించాలని, ఇరు దేశాలు మెరుగైన చర్యలు తీసుకుంటాయనే నమ్మకం ఉందన్నారు. ఈ నెల 22న పెహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో 26 మంది ప్రాణాలను కోల్పోగా, చాలామంది గాయాల పాలయ్యారు. ఈ దారుణంపై తీవ్రంగా స్పందించిన భారత ప్రభుత్వం కఠిన చర్యలు ప్రకటించింది.

## రైతులకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలి

**ఎన్‌డీఎస్‌ఏ నివేదిక చూసిన తర్వాతైనా వారు సిగ్గుపడాలి**
**కాళేశ్వరం నిర్మాణం చేసినవారు, చేయించిన వారు రైతులకు ద్రోహం చేశారు**
**మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి**



**విశ్వంభర, హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వానికి నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక సమర్పించిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీలో నిర్వహిస్తోన్న 'భారత్ సమ్మిట్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై మాట్లాడారు. ఈ నివేదిక చూసిన తర్వాతైనా బీఆర్ఎస్ నేతలు సిగ్గు పడాలని అన్నారు. కాళేశ్వరం నిర్మాణం చేసినవారు, చేయించిన వారు రైతులకు ద్రోహం చేశారని చెప్పారు. రైతులకు బీఆర్ఎస్ నేతలు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు."కాళేశ్వరంతో అద్భుతాలు సృష్టిస్తున్నామని చెప్పి బీఆర్ఎస్ నేతలు రూ.లక్షల కోట్ల ప్రాజెక్టు కట్టారు. వారే డిజైన్ చేశారు.. వారే కట్టారు. ఇప్పుడు మేడిగడ్డ, సుందిళ్ల నిరూపయోకరంగా మారాయి. అబద్ధాలు, తప్పులపై బతకాలని భారాస అనుకుంటోంది. అది కుదరదు. ఎన్‌డీఎస్‌ఏని రేవంత్‌రెడ్డినో.. నేనో వేసింది కాదు.. దేశంలో అత్యుత్తమ నిపుణులు ఎన్‌డీఎస్‌ఏలో ఉన్నారు. ఈ నివేదికపై అధ్యయనం చేస్తాం. వచ్చే క్యాబినెట్ భేటీలో దీనిపై చర్చించి చర్యలు తీసుకుంటాం"అని మంత్రి తెలిపారు.

# నిపుణుల కమిటీ ఆ ప్రాజెక్టునే చూడలేదు

**ఎన్‌డీఎస్‌ఏను కేంద్రం పంపిన దూతగా మాత్రమే చూస్తాం**
**వారు కనీసం విచారణ కూడా జరుపలేదు**
**బిహార్‌లో బ్రిడ్జీలు కూలుతుంటే ఎన్డీఎస్‌ఏ ఏం చేస్తుంది**
**పదేళ్లలోనే తాము తెలంగాణను దేశంలోనే నెంబర్ స్టేట్‌గా నిలిపాం**
**కాంగ్రెస్ మంత్రులు అలర్ట్‌గా ఉండాలి..**
**సీఎం ఫోన్‌లు ట్యాప్ చేయిస్తున్నారు..**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్**



**విశ్వంభర, హైదరాబాద్:** కాళేశ్వరం, మేడిగడ్డ ప్రాజెక్ట్ లపై వచ్చిన రిపోర్ట్ ఎన్‌డీఎస్‌ఏది కాదని.. ఎన్డీఏ ప్రభుత్వ రిపోర్ట్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. శుక్రవారం ఓ మీడియా ఛానల్ ప్రతినిధితో కేటీఆర్ మాట్లాడారు. ఎన్‌డీఎస్‌ఏ నిపుణుల కమిటీ ఇప్పటివరకు ఆ ప్రాజెక్టునే చూడలేదు అని అన్నారు. ఎన్‌డీఎస్‌ఏను కేంద్రం పంపిన దూతగా మాత్రమే చూస్తామని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఎన్‌డీఎస్‌ఏ వారు కనీసం విచారణ కూడా జరుపలేదని విమర్శించారు. బిహార్‌లో బ్రిడ్జీలు కూలుతుంటే ఎన్డీఎస్‌ఏ ఏం చేస్తుందని ప్రశ్నించారు. 60 ఏళ్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి 10 శాతం అయితే.. పదేళ్లలోనే తాము తెలంగాణను దేశంలోనే నెంబర్ స్టేట్‌గా నిలిపామని అన్నారు. అయినా కేసీఆర్ ను విమర్శిస్తున్నారని ఆవేదన చెందారు. తెలంగాణకు విఘాతం, అన్యాయం కలిగితే మొదట స్పందించే వ్యక్తి కేటీఆర్ అని చెప్పారు. అవసరమైతే తెలంగాణ కోసం కేసీఆర్ గర్జించేవారు అని గుర్తుచేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 17 నెలలు అవుతుందని.. ఈ 17 నెలల్లో ఏం చేశారని ప్రజలు అడిగితే చెప్పే పరిస్థితి లేదని విమర్శించారు. ఒక్క ప్రాజెక్ట్ కట్టకపోగా.. ప్రాజెక్టుల నుంచి నీళ్లు వదలకుండా రైతులను వేధిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీలు తెలంగాణకు ఎప్పుడూ ప్రమాదమే అన్నారు. ఒకటి ఢిల్లీకి సంచులు మోసే పార్టీ.. ఇంకోటి ఢిల్లీ పెద్దల చెప్పులు మోసే పార్టీ అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో రేవంత్ – రాహుల్ ట్యాక్స్ వసూలు అవుతోందని ఆరోపించారు. ప్రతీ నెలా ఢిల్లీకి సంచులు పోతున్నాయని అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు ఏడాదికి రూ.40 వేల కోట్ల అప్పులు చేస్తే.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఏడాదిలోనే రూ.1.60 లక్షల కోట్ల అప్పులు చేశారని సంచలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయారని.. కేసీఆర్ కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. వరంగల్ సభతో అందరికీ క్లారిటీ వస్తుందని తెలిపారు.

**కాంగ్రెస్ మంత్రులు అలర్ట్‌గా ఉండాలి..**
**సీఎం ఫోన్‌లు ట్యాప్ చేయిస్తున్నారు..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్వ ర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్సం చలన ఆరోపణలు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోని మంత్రులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్వయంగా సీఎం రేవంత్ రెడ్డే మంత్రుల ఫోన్‌లు ట్యాప్ చేస్తున్నారని ఆరోపించారు. ఆయన సీటుకు ఎక్కడి నుంచి త్రెట్ ఉందోనని నిత్యం భయపడుతున్నారని విమర్శలు చేశారు. అంతేకాదు.. బీఆర్ఎస్‌ను బ్లేమ్ చేయడానికి సీఎం రేవంత్ రెడ్డికి బీజేపీ నేతలు సపోర్ట్ చేస్తున్నారని.. కాంగ్రెస్(%జశీఅస్త్రతీవం%), బీజేపీలు రెండూ కలిసి కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ నేతలు పచ్చి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.రుణమాఫీ చేసినట్లు నిరూపిస్తే రాజీనామా చేయడానికి సిద్ధమని మరోసారి ప్రకటించారు. రాష్ట్రంలో వందశాతం రుణమాఫీ ఏ గ్రామంలోనూ కాలేదని అన్నారు. ఢిల్లీ సంచులు మోసే హడావిడిలో సీఎం ఉంటే.. రాష్ట్రాన్ని ఎలా దోచుకోవాలని మంత్రులు ఆలోచిస్తున్నారని విమర్శించారు.
కొందరు పెద్దల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కీలక వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నమ్మి ప్రజలు మోసపోయారని అన్నారు. మోసపోయామనే సంగతి ఇప్పుడు గ్రహించారని.. అందుకే కేసీఆర్ సభ కోసం వేయి కళ్లతో చూస్తున్నారని తెలిపారు. కళ్యాణ లక్ష్మి పేరుతో తులం బంగారం, దళితబంధు పేరుతో రూ.12 లక్షలు, ఇందిరమ్మ ఇళ్లకు రూ.5 లక్షలు ఇలా అనేక గాలి మాటలు చెప్పి ప్రజల్ని కాంగ్రెస్ నేతలు మోసం చేశారని మండిపడ్డారు. మోసపు హామీలతో గద్దెనెక్కారని సీరియస్ అయ్యారు.

## ఇస్రో మాజీ ఛైర్మన్ కస్తూరి రంగన్ కన్నుమూత

**9 ఏళ్లపాటు ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహణ**
**ఆయన హయాంలో తొలి లూనార్ మిషన్‌కు అడుగులు**
**రాజ్యసభ సభ్యునిగా, ప్రణాళిక సంఘం సభ్యునిగా సేవలు**
**నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా పనిచేసిన రంగన్**



**ఢిల్లీ:** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మాజీ ఛైర్మన్ డా. కృష్ణస్వామి కస్తూరిరంగన్ బెంగళూరులోని తన నివాసంలో కన్నుమూశారు. శుక్రవారం ఉదయం ఆయన తుది శ్వాస విడిచినట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. కస్తూరిరంగన్ 1990–1994 వరకు యూఆర్ఎస్సీ డైరెక్టర్‌గా పనిచేశారు. అనంతరం ఆయన 9 ఏళ్లపాటు (1994–2003) ఇస్రో ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఆయన హయాంలో ఇస్రో తొలి లూనార్ మిషన్‌కు అడుగులు పడ్డాయి. జేఎన్‌యూ ఛాన్సలర్‌గా, కర్ణాటక నాలెడ్జ్ కమిషన్ ఛైర్మన్‌గా కస్తూరిరంగన్ పనిచేశారు. 2003–09 మధ్య రాజ్యసభ సభ్యుడిగానూ ఉన్నారు. అంతేకాకుండా ప్రణాళికా సంఘం సభ్యుడిగానూ సేవలందించారు. అలాగే, 2004 నుంచి 2009 మధ్య కాలంలో బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్‌కు డైరెక్టర్‌గా పనిచేశారు. మోడీ సర్కార్ తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యా విధానం ముసాయిదా కమిటీకి అధ్యక్షుడిగా పనిచేశారు.కస్తూరిరంగన్ మృతిపట్ల ప్రధాని నరేంద్ర మోడీ విచారం వ్యక్తం చేశారు. ఆయన దార్శనిక నాయకత్వం, నిస్వార్థ సహకారం దేశానికి ఎల్లప్పుడూ గుర్తుండిపోతుందన్నారు. భారతదేశ అంతరిక్ష రంగాన్ని కొత్త శిఖరాలకు చేర్చారని కీర్తించారు. ఆయన నాయకత్వంలో ఇస్రో ప్రతిష్ఠాత్మక ఉపగ్రహ ప్రయోగాలను చేసిందని గుర్తు చేసుకున్నారు. ఇస్రో మాజీ ఛైర్మన్ మృతిపట్ల కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎంఐఎం కైవసం..

**మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఘన విజయం – 38 ఓట్ల తేడాతో గెలిచిన ఎంఐఎం అభ్యర్థి**
**ఈ ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉన్నకాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:** హైదరాబాద్ జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానాన్ని ఎంఐఎం కైవసం చేసుకుంది. ఈ మేరకు మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీకి 63 ఓట్లు రాగా బీజేపీ అభ్యర్థి బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ ఎన్.గౌతమ్‌రావుకు 25 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో 38 ఓట్ల తేడాతో ఎంఐఎం అభ్యర్థి మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ ఘన విజయం సాధించారు. అయితే, ఎమ్మెల్సీ ఎన్నిక కౌంటింగ్ ప్రక్రియ జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సరిగ్గా ఉదయం 8 గంటలకు ప్రారంభమైంది. ఈ నెల 23న ఎమ్మెల్సీ స్థానానికి పోలింగ్ జరగ్గా 112 మంది ఓటర్లకు గాను మొత్తం 88 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం 78.57 శాతం పోలింగ్ నమోదైనట్లు రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు.కాగా, పోటీలో మజ్లిస్ అభ్యర్థిగా మిర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ , బీజేపీ అభ్యర్థిగా డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు బరిలో నిలిచారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ , బీఆర్ఎస్ పోటీకి దూరంగా ఉన్నాయి. కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కు వినియోగించుకోగా.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు 24 మంది బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పోలింగ్‌లో పాల్గొనలేదు.

## సోనియా, రాహుల్‌కు నోటీసులు ఇవ్వలేం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోలేమని.. కాబట్టి విచారణకు హాజరయ్యేలా వారికి నోటీసులు ఇవ్వాలని ఈడీ కోరింది. ఈ విషయంలో తాము ఏమీ దాచట్లేదని.. ఈ కేసు విచారణకు ముందు అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి గాంధీ కుటుంబానికి అవకాశమిస్తున్నామని ఈడీ అధికారులు తెలిపారు.నోటీసులు ఇచ్చే ముందు, ఏదైనా ఆర్డర్‌ను జారీ చేసేముందు అందులో ఏదైనా లోపం ఉందా అనే విషయాన్ని న్యాయస్థానం పరిక్షించాల్సి ఉంటుందని ప్రత్యేక న్యాయమూర్తి జస్టిస్ విశాల్ గోగ్నే అన్నారు. ఛార్జిషీట్‌లో సరైన పత్రాలు లేవని..ఆ పత్రాలను దాఖలు చేయాలని ఈడీ అధికారులను న్యాయమూర్తి ఆదేశించారు. వాటిని పరిక్షించిన అనంతరం నోటీసుల జారీపై నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ కేసు విచారణను మే 2వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు కోర్టు పేర్కొంది. 'నేషనల్ హెరాల్డ్' మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ అందులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ , రాహుల్ గాంధీ సహా పలువురి పేర్లను పేర్కొంది. ఇప్పటికే ఈ కేసుతో ముడిపడి ఉన్న ఆస్తుల స్వాధీనానికి నోటీసులు జారీ చేసిన ఈడీ అధికారులు.. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ నేతలు శామ్ పిట్రోడా, సుమన్ దుబే పేర్లతో ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ప్రాసిక్యూషన్ కంప్లయింట్ దాఖలు చేశారు. దీనిపై కోర్టు విచారణ చేపట్టింది.

## మంత్రి పొంగులేటి పేరిట వసూళ్లు..

(మొదటి పేజీ తరువాయి) అరెస్టు చేశారు. వారిని ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బుస్సా వెంకటరెడ్డి, మచ్చ సురేశ్‌లుగా గుర్తించారు. దీనిపై మంత్రి పొంగులేటి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పేరు చెప్పి ఎవరైనా మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "ఎవరైనా నా పీఏలమని ఫోన్ చేస్తే నా దృష్టికి తీసుకురావాలి. నా కార్యాలయం 040–234561072/ 040–23451073కు ఫోన్ చేసి చెప్పాలి" అని తెలిపారు.

## వక్ఫ్ సవరణ చట్టంపై పిల్..

**సుప్రీంలో తేలాక చూద్దామన్న హైకోర్టు**
**తదుపరి విచారణ వేసవి సెలవుల తర్వాతకు వాయిదా**



**విశ్వంభర, హైదరాబాద్:** వక్ఫ్ సవరణ చట్టాన్ని రాష్ట్రంలో అమలు చేయొద్దంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. ఆక్ట్ పబ్లిక్ వెల్ఫేర్ ఫౌండేషన్ ఈ పిల్‌ను దాఖలు చేసింది. వక్ఫ్ సవరణ చట్టంలోని పలు సెక్షన్లను పిటిషన్‌లో సవాల్ చేసింది. అయితే, వక్ఫ్ సవరణ చట్టంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోందని, అక్కడ తేలిన తర్వాత ఈ పిటిషన్‌ను పరిశీలిద్దామని హైకోర్టు తెలిపింది. తదుపరి విచారణను వేసవి సెలవుల తర్వాతకు వాయిదా వేసింది.

## పాక్ పౌరులు ఈనెల 30లోపు వాఘా సరిహద్దు దాటాలి



(మొదటి పేజీ తరువాయి) నిలిపివేసిందని, ఇప్పటికే వీసాలు పొందిన వారికి ఈనెల 27 వరకు గడువు ఉందని చెప్పారు. మెడికల్ వీసాలపై వచ్చిన వారికి ఈనెల 29కు అనుమతి ఉందన్నారు. ఈ నెల 30 వరకే వాఘా సరిహద్దు తెరిచి ఉంటుందని చెప్పారు. అప్పట్లోపు తెలంగాణలో ఉన్న పాక్ పౌరులు వాఘా సరిహద్దు దాటాలన్నారు. ఆదేశాలను ఉల్లంఘిస్తే.. చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## 2047 నాటికి మానవ రహిత వ్యవసాయం

**బిట్స్, అగ్రికల్చర్ యూనివర్సిటీ మధ్య ఒప్పందం**
**ఆధునిక టెక్నాలజీని వినియోగించి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకే ఒప్పందం**
**బిట్స్ పిలాని ఉపకులపతి ప్రొఫెసర్ వి. రాంగోపాల్ రావుం**



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** వ్యవసాయంలో కృత్రిమ మేధ వినియోగంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, బిట్స్ పిలానీతో అవగాహన ఒప్పందం చేసుకుంది. శుక్రవారం రాజేంద్రనగర్ లోని వ్యవసాయ విశ్వవిద్యాలయం క్యాంపస్ లోని అగ్రి హబ్ లో జరిగిన కార్యక్రమంలో ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, బిట్స్ పిలాని ఉపకులపతి ప్రొఫెసర్ వి. రాంగోపాల్ రావు సమక్షంలో అవగాహన ఒప్పందం పత్రాలపై ఇరుసంస్థల అధికారులు సంతకాలు చేసి పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈ రెండు ప్రతిష్టాత్మకమైన సంస్థల మధ్య జరిగిన ఈ అవగాహన ఒప్పందం సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పనకు, పీహెచ్?డీ విద్యార్థులకు పరిశోధన సలహాలు ఇవ్వడానికి దోహదం చేస్తుందని బిట్స్ పిలాని ఉపకులపతి ప్రొఫెసర్ వి. రాంగోపాల్ రావు అన్నారు. ఇరు సంస్థల శాస్త్రవేత్తలు కలిసి నాణ్యమైన పరిశోధనా పత్రాలు ప్రచురించడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు.దుబాయ్ తోపాటు దేశంలోని నాలుగు చోట్ల బిట్స్ క్యాంపస్ లు ఉన్నాయని, అందులో ప్రతి ఏటా సుమారు 600 మంది పీహెచ్?డీ లో ప్రవేశాలు పొందుతున్నారని తెలిపారు. దేశంలోనే మూడవ అత్యంత ప్రతిష్టాత్మకమైన స్టార్టప్ నెట్వర్క్ బిట్స్ పిలానీ సంస్థ కు ఉందని తెలిపారు. ఆధునిక టెక్నాలజీని వినియోగించి రైతులకు మెరుగైన సేవలు అందించడానికి ఈ ఒప్పందం దోహదం చేస్తుందని వివరించారు. అనంతరం ఉపకులపతి ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రాచీన వ్యవసాయ విశ్వవిద్యాలయాలలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండోదని, ఇది అమెరికా ల్యాండ్ గ్రాంట్ మోడల్ లో ఏర్పాటయిందని తెలిపారు. గ్రామీణ స్థాయి వరకు అత్యంత పటిష్టమైన పరిశోధన నెట్ వర్క్ కలిగి ఉండడంతోపాటు అనేక వ్యవసాయ విద్య, విస్తరణ సంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా కలిగి ఉండి రైతులకు మెరుగైన సేవలు అందించడంలో నిమగ్నమైందన్నారు. 2047 నాటికి మానవ రహిత వ్యవసాయం తీసుకురావాలనే లక్ష్యంతో తాము ప్రణాళిక బద్ధంగా కృషి చేస్తున్నట్లు వివరించారు .ఇందుకోసం డిజిటల్ అగ్రికల్చర్ కు అత్యంత ప్రాధాన్యతనిస్తున్నామని తెలిపారు. బిట్స్ ఫిలానితో జరిగిన ఈ అవగాహన ఒప్పందంతో తాము అనుకున్న మానవ రహిత వ్యవసాయ లక్ష్యాలను సాధించడానికి అవకాశం కలుగుతుందన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ పరిజ్ఞానం (హార్డ్ వేర్), బిట్స్ పిలానిలోని సాఫ్ట్ వేర్ కలిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని ఆశిస్తున్నట్లు తెలిపారు.

## ఉగ్రవాద హత్యాకాండను వ్యతిరేకించండి

- జమ్ము కాశ్మీర్ లో శాంతి నెలకొల్పాలి
- సిపిఎం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ
- ఎల్బీనగర్ చౌరస్తాలో ప్ల కార్డ్స్ తో నిరసన



ఉగ్రవాద అత్యాకాండను వ్యతిరేకించాలని, జమ్మూ కాశ్మీర్ లో శాంతి నెలకొల్పాలని సిపిఎం ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో శుక్రవారం ప్ల కార్డ్స్ తో మంథని యాదయ్య అధ్యక్షతన నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ సర్కిల్ సిపిఎం పార్టీ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య హాజరై మాట్లాడుతూ పర్యటన ప్రాంతమైన జమ్ము కాశ్మీర్ లో ఉగ్రవాద ముష్కరులు విచాక్షణా రహితంగా కాల్పులు జరిపి 28 మంది అమాయక పర్యాటకులపై అతి ఘోరంగా కాల్పులు జరిపి చంపివేయడం అతి దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన వారిలో హైదరాబాద్ ఇంటెలిజెన్స్ బ్యూరోలో పనిచేస్తున్న మనీష్ రంజన్ ఉన్నారు. ఇది దేశ పౌరుల్ని కాదు ప్రపంచ దేశాలను కల్చివేసే ఘటనని, అమానీయ ఘటంలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ జోహార్లు అర్పించింది. గాయపడిన 20 మంది క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆప్తులను కోల్పోయిన కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మతం పేరుతో జరుగుతున్న ఇలాంటి ఘటనపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వివరించి మాటలతో సరిపెట్టకుండా అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి దుండలను న్యాయస్థానం ముందు నుంచి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. జమ్ము కాశ్మీర్లో శాంతి నెలకు ఇలాంటి ఉగ్రవాద ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రత కల్పించి అక్కడ ప్రజల ప్రాణాలను కాపాడాలని, హింస వద్దు శాంతి ముద్దు ప్రపంచ శాంతి వర్ధిల్లాలి ఉగ్రవాదుల కాల్పుల్లో మరణించిన యువకుల అందరికీ జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నగర్ సర్కిల్ కమిటీ సభ్యులు పోటెపాకు రామస్వామి, భూష రాజు కాశయ్య, పందుల లక్ష్మయ్య, సుమన్, ఊరే రమేష్ పాల్గొన్నారు.

## ఉగ్రదాడిని ఖండిస్తున్నాం: టిపిటిఎఫ్.



**విశ్వంభర, నెల్లికుదురు:** జమ్మూ కాశ్మీర్ లోని మినీ స్విట్జర్లాండ్ గా భావించే పహల్గంను సందర్శించిన వివిధ ప్రాంతాల పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని టిపిటిఎఫ్ జిల్లా కార్యదర్శి సంగ శ్రీనివాస్ ఖండించారు. శుక్రవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ వేసవి విడిది కోసం వచ్చిన పర్యాటకులపై మతం పేరు అడిగి అమానుషంగా ఉగ్ర వాదులు దాడి చేయడం ద్వారా 26 మంది అమాయకులు బలి కావడం దురదృష్ట కరమైన సంఘటన అని, మతాల పేరు తో జరిగే దాడులను దేశ ప్రజలు ముక్త కంఠంతో వ్యతిరేకించడం దేశ ఐక్యతకు నిదర్శనమన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు కట్టు దిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ ఉగ్ర దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి నివాళుల అర్పిస్తూ, వారిపైన జరిగిన దాడిని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ తీవ్రంగా ఖండిస్తున్న న్నట్లు తెలిపారు.

## ఎమ్మెల్యే వీరేశం ను మర్యాద పూర్వకంగా కలిసిన మార్కెట్ కమిటీ సభ్యులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లాలోని వలిగొండ-రామన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్యానాయక్, వైస్-చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి (రామన్నపేట మండలానికి చెందిన వారు), డైరెక్టర్ నరేందర్ రెడ్డి లు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ను మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిశారు.

## ఉగ్రమూకల మారణకాండపై బార్ అసోసియేషన్ తీవ్ర నిరసన

### మృతులకు సంతాపం, కోర్టు విధుల బహిష్కరణ



**విశ్వంభర, రామన్నపేట:** పహల్గావ్లో ఉగ్రమూకలు చేసిన మారణ కాండపై యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని రామన్నపేట బార్ అసోసియేషన్ తీవ్రమైన నిరసన వ్యక్తం చేస్తూ, మృతుల మరణం పట్ల తీవ్ర సంతాపం తెలియజేస్తూ, కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.ఏమజీద్, సీనియర్ న్యాయవాది కంపాటి యాదగిరి మాట్లాడుతూ జరిగిన ఘోరం చాలా అమానవీయమైనదని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి దేశ నాయకులు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా యావత్ దేశం ముక్త కంఠంతో ఏకీభవించాలని తెలియజేశారు. దేశ సమైక్యతకు భంగం కలిగించే ఉగ్ర మూకలను కూకటి వేళ్ళతో పెకిలించి వేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ నకిరేకంటి మొగులయ్య, ఉపాధ్యక్షులు యదాసు యాదయ్య, సీనియర్ న్యాయవాదులు యాపాల క్రిష్టారెడ్డి, జినుకల ప్రభాకర్, కేమ రామదాసు, బాసరాజు అశోక్ కుమార్, జగతయ్య, దినేష్, శ్రీశైలం, సంగిశెట్టి బాలరాజు, సుక్క శ్రవణ్ కుమార్, మామిడి వెంకట రెడ్డి, సత్తయ్య, కునూరు శ్రీనివాస్, కందగట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాల్లోకి బాలయోగి - ప్రముఖ నేతగా మారబోతున్నాడు!

**విశ్వంభర, భద్రాచలం:** భద్రాచలంకు చెందిన ప్రముఖ విద్యావేత్త, జర్నలిస్టు, క్రీడా నిర్వాహకుడు తోటమల్ల బాలయోగి త్వరలోనే రాజకీయ రంగ ప్రవేశం చేయబోతున్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ పెద్దల ఆశీస్సులతో త్వరలోనే ఓ ప్రధాన రాజకీయ పార్టీలో చేరుకోనున్నట్లు వార్తలు వస్తున్నాయి. బాలయోగి, 30 సంవత్సరాల పైగా క్రీడా రంగంలో సేవలు అందించిన, విద్యావేత్తగా, జర్నలిస్టుగా దశాబ్దాల అనుభవం కలిగిన వ్యక్తి. ఆయనకు జిల్లా వ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలతో సంబంధాలు ఉన్నాయి. ఈ పరిచయాలు ఆయన పార్టీకి మేలు చేసేందుకు దోహదపడతాయని పార్టీ వర్గాల నుండి అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**భద్రాచలంలో రాజకీయ ప్రవేశం:**
భద్రాచలం పట్టణానికి చెందిన బాలయోగి, స్థానిక విద్యార్థులు, విద్యార్థినులు, స్థానికులు గౌరవించే వ్యక్తి. లెక్చరర్ మరియు ప్రిన్సిపాల్ గా దాదాపు 20-25 సంవత్సరాలు సేవలు అందించారు. అతని విద్యార్థులంతా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నారు, వారు తమ బాసీగా తనకు గౌరవం తెలుపుతూ బాలయోగి రాజకీయ రంగ ప్రవేశం పట్ల ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



**పార్టీకి మేలు:**
ప్రజలతో నెట్వర్కింగ్, విద్యావేత్తగా, జర్నలిస్టుగా ఉన్న అనుభవంతో బాలయోగి చేరికతో ఆ పార్టీకి బలం పెరిగే అవకాశం ఉంది. త్వరలోనే పార్టీ పెద్దల సమక్షంలో అతను పార్టీలో చేరిపోవడం ఖాయమవుతోంది.

**ఆధారాలు:**
విద్యావేత్తగా అనుభవం, జర్నలిస్టు అనుభవం, క్రీడా రంగంలో విశేష సేవలు, ప్రజలతో సంబంధాలు
రాజకీయ రంగ ప్రవేశం సర్వసాధారణం బాలయోగి, తన దశాబ్దాల అనుభవం, విశ్వసనీయతతో రాజకీయ వేదికపై తన ప్రభావాన్ని చూపబోతున్నారు.

## రజతోత్సవ సభకి బొట్టుపెట్టి ఆహ్వానం, ఆహ్వానించిన మాజీమంత్రి సత్యవతి

**విశ్వంభర, మహబూబాబాద్:** ఈనెల 27వ తేదీన ఎలకతుర్తిలో జరగబోయే రజతోత్సవ సభకి రమ్మని జిల్లా కేంద్రంలోని 35 వార్డులో ఉన్న మహిళలకు మాజీమంత్రి సత్యవతి రాథోడ్ బొట్టుపెట్టి ఆహ్వానించారు. శుక్రవారం సత్యవతి రాథోడ్ 35 వార్డ్ లో ఉన్న ప్రజలను (చలో వరంగల్) బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభకు మీరందరూ తప్పకుండా తరలిరావాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు . ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర నరా కాలం అయినా రాష్ట్రంలో ఏమాత్రం అభివృద్ధి కాలేదని మనం ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతి ఒక్క కుటుంబానికి న్యాయం జరిగింది. రానున్న ఎన్నికల్లో మళ్లీ మన బిఆర్ఎస్ పార్టీ గేలుస్తుందని ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, పట్టణ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు గద్దె రవి,



మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ ఫరీద్, అశోక్ నాయక్, జనార్ధన్, గోరంట్ల రాజు, మహమ్మద్ షరీఫ్, రంజిత్, సుధాగాని మురళి, సుమన్ తదితరులు ఉన్నారు .

## భూ సమస్యల పరిష్కారానికి భూ భారతి చట్టం గొప్ప వేదిక

- సామాన్య ప్రజలకు అందుబాటులో భూభారతి నూతన ఆర్ఓఆర్ చట్టం
- జిలా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్
- రెవేన్యూ సదస్సు వేదికగా ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళి
- నారాయణపురం, పెరువాడ గ్రామాల భూ సమస్యలకు పరిష్కారం కోసం కృషి చేస్తాం
- మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్




**విశ్వంభర, మహబూబాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి - చట్టం 25, అవగాహన సదస్సు శుక్రవారం మహబూబాబాద్, కేసముద్రం మండలాల రైతు వేదికలలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళీ నాయక్, అదనపు కలెక్టర్లు (రెవెన్యూ) కె.వీరబ్రహ్మంచారి, రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణవేణి, తదితరులు భూభారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం అంశాలపై అవహన కల్పించారు. ఈ సందర్భంగా భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ దేశంలోనే ఎక్కడా లేనివిధంగా చారిత్రాత్మకమైనది నూతన భూభారతి చట్టం అని, సామాన్య ప్రజలకు క్షేత్రస్థాయిలోనే భూ సమస్యల పరిష్కారం, నూతన ఆర్ఓఆర్ చట్టం ద్వారా పిఓటి, ఎల్.టి.ఆర్, సీలింగ్ దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేసే నాటి స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, 100 రూపాయల అపరాధ రుసుం వసూలు చేసి సర్టిఫికెట్ జారీ చేస్తారని, హక్కుల రికార్డులు వివరాలను నమోదు చేసి పాసు బుక్ జారీ చేస్తారని, రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసేందుకు ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అధికారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మనిషికి ఆధార్ కార్డు లాగా భూమికి భూదార్ సంఖ్య కేటాయింపు ప్రణాళిక చేస్తుందని, దీని ద్వారా భూ ఆక్రమణలకు చెక్ పెట్టవచ్చని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డుల తయారు చేసి, ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్ ప్లే చేయడం జరుగుతుందని అన్నారు. గ్రామాలలో సర్వే చేసి, హద్దులు, నక్ష సిద్ధం జరుగుతుందన్నారు. నారాయణపురం, పెరువాడ గ్రామాల భూ సమస్యల పరిష్కారం కోసం నూతన చట్టం ఎంతో ఉపయోగపడుతుందని, అవసరమైతే ముఖ్యమంత్రి తో స్వయంగా మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వం మంత్రివర్గం తీసుకున్న గొప్ప చారిత్రాత్మకమైన నూతన భూభారతి చట్టం అని అన్ని సమస్యల పరిష్కారానికి వేదిక అవుతుందని అన్నారు. జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ భూ భారతి నూతన ఆర్ఓఆర్ చట్టం ప్రకారం దరఖాస్తు చేసుకున్న వారికి న్యాయమైన సేవలు అందుతాయని, ఈ చట్టం ముఖ్యంగా విప్లవంతత్వం మైంది. గత ధరణిలో రెవిన్యూ అధికారులకు ఎలాంటి అధికారాలు లేవని అన్నారు. ప్రస్తుతం చట్టంలో అనేక సౌకర్యాలు కల్పించడం జరిగిందని, తద్వారా రైతులకు సులభతరమైన న్యాయమైన విస్తృత స్థాయిలో సహాయం అందుతుందన్నారు. క్షేత్రస్థాయిలో భూ సమస్యలు పరిష్కారం కోసం ప్రభుత్వం వెసులుబాటుకల్పించింది. గ్రామ, మండల, డివిజనల్ స్థాయి, జిల్లాస్థాయి లలో దరఖాస్తులను పరిశీలించి ఎవరి పరిధిలో ఉంటే వారే పరిష్కరించడానికి కోసం నూతన చట్టం ఎంతో ఉపయోగపడుతుందని అందుకు ప్రభుత్వం గ్రామ పాలన అధికారి, సర్వేయర్లను నియమించుకోవడం జరుగుతుందని అన్నారు. అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కె.వీరబ్రహ్మచారి మాట్లాడుతూ నూతన చట్టంపై రైతులకు సవివరంగా తెలియజేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గంటా సంజీవరెడ్డి, రైతులు వెంకన్న, యాకూబ్ రెడ్డి, తదితరులు భూ సమస్యల పరిష్కారం కోసం అడిగిన ప్రశ్నలకు కలెక్టర్ ఎమ్మెల్యే అదనపు కలెక్టర్లు సమాధానం ఇచ్చారు. ఈ రెవెన్యూ సదస్సులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని విజయనిర్మల, ఏడి సర్వే ల్యాండ్ ఏ.నరసింహమూర్తి, స్థానిక తహసిల్దారులు భగవాన్ రెడ్డి, రాగం ఎర్రయ్య, ఎంపిడిఓలు రఘుపతి రెడ్డి, క్రాంతి, వ్యవసాయ శాఖ ఏడిప శ్రీనివాస్, సంబంధిత అధికారులు, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదాన్ని ఐక్యంగా అంతమొందించాలి




- మత విభజనలు దేశానికి ప్రమాదకరం
- పహల్గాం ఘటనపై సమగ్ర దర్యాప్తు చేయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య

విశ్వంభర, కరీంనగర్: జమ్మూ పహల్గంలో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అత్యంత అమానుష, హేయమైన చర్య అని దేశ ప్రజలు ఒక్కటిగా ఉగ్రవాదాన్ని ఎదుర్కొని టెర్రరిజాన్ని తుదముట్టించాలని, మత విభజనలు దేశానికి అత్యంత ప్రమాదకరమని, ఘటనపై లోతైన దర్యాప్తు జరపాలని సిపిఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య అన్నారు. శుక్రవారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం ముకుంద లాల్ మిశ్రాభవన్లో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల గురించి అఖిలపక్షం ప్రశ్నలకు రక్షణ మంత్రి లోపాలు జరిగింది నిజమేనని వార్తలు కూడా వచ్చాయన్నారు. అనేకసార్లు ప్రధాని, హోం మంత్రి జమ్ముకాశ్మీర్లో ఉగ్రవాదం అంతమైందని అన్నారని, పెద్ద నోట్ల రద్దు సందర్భంగా కూడా నకిలీ నోట్లు టెర్రరిస్టులకు అందుబాటులో లేకుండా చేయాలనే నోట్లు రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు. వారం రోజుల క్రితం నకిలీ నోట్లు చెలామణిలోకి వచ్చాయని ఆర్.బి.ఐ చెప్పిందన్నారు. ప్రకటనలకు ఆచరణకు పూర్తి విరుద్ధంగా ఉన్నాయన్నారు. జమ్మూ కాశ్మీర్లో బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్, కాశ్మీర్ పోలీస్, మిలటరీ, నిఘా వ్యవస్థలన్నీ కేంద్ర ప్రభుత్వ చేతుల్లో ఉన్నాయని భద్రత ఏర్పాట్లు ఎందుకు తగు రీతిలో చేయలేదన్నారు. అనేక ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేన న్నారు. ప్రజల భద్రత ఉగ్రవాదం అంతం కోసం ప్రభుత్వం పనిచేయలే కానీ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం తగదన్నారు. ఘటన జరిగిన తర్వాత 143 కోట్ల భారత పౌరులను ఐక్యంగా నిలబెట్టాల్సిన సమయంలో మతపరమైన సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం జరుగుతూ ఉండడం ఇది చాలా ప్రమాదకరం అన్నారు. ఉగ్రవాదులకు కులం లేదు, మతం లేదు ఉగ్రవాదం అంతా విధ్వంసం తప్ప మరేది లేదని, ఉగ్రవాదాన్నీ అంతం చేయడం కోసం ప్రపంచ దేశాలు సైతం సహకరించుకుంటున్న విషయం మర్చిపోకూడదు అన్నారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాలంటే భారతదేశ ప్రజలందరూ ఐక్యంగా ఉండాలని, మతపరంగా రెచ్చగొడితే అది దేశానికి ప్రమాదం అని అన్నారు. కాశ్మీర్ ప్రజలు ఎప్పుడు మతోన్మాదులు కాదని మతసామరస్యాన్ని కోరుకునే వారన్నారు కాశ్మీర్ ప్రజలు విభజన సమయంలో ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, కావాలని కోరుకున్నారని, భూ పంపకం కోసం పోరాటం జరిపారని గుర్తు చేశారు. పర్యాటకులు వెళితేనే కాశ్మీర్ ప్రజలు బతుకుతారని భవిష్యత్తు ఉంటుందని, మతసామరస్యాన్ని కోరుకుంటున్న అలాంటి వారిని మతం పేరుతో ముద్ర వేసే ప్రయత్నం చేస్తున్నారని, ఉగ్రవాదుల నుండి తుపాకి గుంజుకునే ప్రయత్నంలో హార్స్ రైడర్ ను కాల్చి చంపారని ఆ యువకుడు ఒక ముస్లిం అని మర్చిపోకూడదన్నారు. దుర్మార్గమైన దాడి జరిగినప్పుడు దేశమంతా ఒకటిగా ఉండాల్సిన సమయంలో రొచ్చుగుంటలో చేపలు పట్టినట్లు కొంతమంది మతపరమైన చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఇది దేశ భద్రతకు, సమగ్రతకు, మత సమరస్యానికి హానికరం అన్నారు. కేంద్రం బాధ్యతగా వ్యవహరించి ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఐక్యంగా ముందుకు వెళ్లాలన్నారు. వరి కొనుగోలు సెంటర్లలో కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు వరి ధాన్యానికి 500 బోనస్ చెల్లిస్తామని చెప్పి కేవలం సన్న రకాలకే 500 బోనస్ ఇవ్వడం రైతులను మోసం చేయడమే అన్నారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి 12000 ఇస్తామని వాగ్దానం చేశారని ఆర్భాటంగా 500 మండలాలు 500 గ్రామాల్లో ప్రారంభించారని ఒక్కరోజు మురిపించి మర్చిపోయారు అన్నారు. అంగన్వాడీలకు వేసవి సెలవులు ప్రకటించాలన్నారు. కిషన్ రెడ్డి బొగ్గు శాఖ మంత్రిగా ఉండి సింగరేణి బొగ్గు బ్లాకులను వేలాన్ని వేశారని గుర్తు చేశారు. సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని, ప్రజలకు అండగా పార్టీ ఎప్పుడు నిలబడుతుందని, ప్రజా సమస్యల పరిష్కారం పోరాటాల ద్వారానే సాధ్యమని వీరయ్య స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గిట్ల ముకుంద రెడ్డి, గుడికందుల సత్యం, జి బీమా సాహెబ్, జిల్లా కమిటీ సభ్యులు యు.శ్రీనివాస్, డి నరేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

## రెస్టారెంట్ ను ప్రారంభించిన ఎమ్మెల్యే మురళీ నాయక్




**విశ్వంభర, మహబూబాబాద్:** జిల్లా కేంద్రంలోని 13 వార్డులో ఎన్టీఆర్ స్టేడియం ముందు మన పొలం గట్టు బిరియాని రెస్టారెంట్ ను మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ ముఖ్య మురళీ నాయక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వయం ఉపాధి ఎంతో మేలు అని రెస్టారెంట్ నిర్వాహకులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా వినియోగదారులకు మెరుగైన సేవలు అందించినప్పుడే అందరి మన్ననలు పొందవచ్చునని అన్నారు . ప్రజలు తమ దైనందిన జీవితంలో భాగంగా వారంలో ఒక సారైనా కుటుంబంతో కలిసి రెస్టారెంట్ కు వస్తారని, వారిని దృష్టి లో ఉంచుకుని చాలా మంచిగా నాణ్యతతో రుచికరమైన భోజన, సేవలు ప్రజలకు కల్పించాలని, అలాగే రెస్టారెంట్ వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, పట్టణ నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

## జడ్సన్ యూనివర్సిటీలో స్పాట్ అడ్మిషన్స్ ప్రారంభం.




**విశ్వంభర, ఎల్బీనగర్** :ఉన్నత విద్య, గ్లోబల్ కేర్ అవకాశాల కోసం ప్రయత్నిస్తున్న విద్యార్థుల కోసం అమెరికాలోని జడ్సన్ యూనివర్సిటీ 2025గాను స్పాట్ అడ్మిషన్స్ అవకాశం కల్పిస్తుందని జడ్సన్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ డా. నిక్కి ఫెనర్ను తెలిపారు. శుక్రవారం చైతన్యపురి లోని కెరీర్ వింగ్స్ కన్సల్టెంట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంకు ఆమె హాజరయ్యారు. అనంతరం మాట్లాడుతూ అంతర్జాతీయ ఎడ్యుకేషనల్ కన్సల్టింగ్ లో లీడింగ్ లో ఉన్న కెరీర్ ఎడ్యు గ్రూప్ ఈ ఏడాది యునైటెడ్ స్టేట్స్ లో చదువుకోవాలని విద్యార్థుల కోసం అద్భుతమైన అవకాశాన్ని కల్పిస్తుందన్నారు. అమెరికాకు చెందిన జడ్సన్ యూనివర్సిటీతో అనుసంధానమై స్పాట్ అడ్మిషన్స్ ఈవెంట్ ను ఏప్రిల్ 26న హిమాయత్ నగర్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్టెమ్ ఫోకస్డ్ మాస్టర్స్, డాక్టోరియల్ ప్రోగ్రామ్లో స్పాట్ అడ్మిషన్స్ పొందవచ్చు అన్నారు. అప్లికేషన్ ఫీజు లేకుండా, ఐ20 డిపాజిట్స్ కూడా ఉండవన్నారు. 24 గంటల్లో యాక్సెప్టెన్స్, మూడు రోజుల్లో ఐ20 లభిస్తుంది అన్నారు. సీసీ ప్రెసిడెంట్ స్కాలర్షిప్ తో సహా 9200 స్కాలర్షిప్ లభిస్తుంది అన్నారు. ఎలాంటి సందేహాలున్న నేరుగా జడ్సర్ యూనివర్సిటీ అధికారుల్ని కలవచ్చు అన్నారు. జడ్సర్ నుంచి గ్రాడ్యుయేట్ అయిన వాళ్లకు డైరెక్ట్ క్యాంపస్ ప్లేస్మెంట్ అవకాశం కల్పిస్తుంది అన్నారు. స్టెమ్ ప్రోగ్రామ్స్ లో ఎమ్మెస్ కంప్యూటర్ సైన్స్, మాస్టర్ ఆఫ్ బిజినెస్ ఇన్ఫర్మేటిక్స్, డాక్టరేట్ ఇన్ కంప్యూటర్ సైన్స్ లు ఉంటాయి అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9052000710, 7995866681 నెంబర్లలో సంప్రదించవచ్చు అని తెలిపారు ఈ కార్యక్రమంలో కెరీర్ ఎడ్యుకేషన్ గ్రూప్ డైరెక్టర్ ఇర్ఫాన్ అహ్మద్,ఇంటర్నేషనల్ యూఎస్ఏ స్టూడెంట్ కౌన్సిలర్ నవ్య, మార్కెటింగ్ మేనేజర్ అబ్దుల్ సలాం తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం -డివిజన్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ జాహిద్.



**విశ్వంభర, ఎల్బీనగర్** :వరంగల్ లో ఏప్రిల్ 27న జరిగే బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేద్దామని ఆర్కేపురం డివిజన్ బి ఆర్ ఎస్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ జాహిద్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రంలో 15 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలందరూ విసుకు చెందారని, బిఆర్ఎస్ వైపు ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. సభలో కెసిఆర్ ఏం మాట్లాడుతాడు అని దేశం మొత్తం ఆతృతగా ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులు మోసం చేయడంతో, నిరుద్యోగులు సైతం సభకు తరలివచ్చేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. మాజీమంత్రి , శాసన సభ్యురాలు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో ఆర్కేపురం డివిజన్ నుంచి భారీ ఎత్తున రజహోత్సవ సభకు వెళ్లి సభను విజయవంతం చేస్తాం అని అన్నారు.

## కొవ్వొత్తుల ర్యాలీ.



విశ్వంభర, దిల్ సుఖ్ నగర్ జమ్మూ కాశ్మీర్ పెహోల్గాం లో పర్యాటకులపై ఉగ్రవాద దాడి, 27 మందికి పైగా మృతి, అనేక మంది గాయపడిన ఈ దాడి భారతదేశాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని, యావత్ దేశం ఈ ఉగ్రవాద దాడులను ఖండించాలని నందు ఆర్మీ ఫిజికల్ ట్రైనింగ్ అకాడమీ డైరెక్టర్ నందు నాయక్ అన్నారు. దిల్ షుఖ్ నగర్ సాయిబాబా ఆలయం ను రాజీవ్ చౌక్ వరకు నందు ఆర్మీ ఫిజికల్ ట్రైనింగ్ అకాడమీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి ఉగ్రవాద దాడిని ఖండించారు. మృతులకు నివాళులు అర్పించి, 2 నిమిషాల మౌనం పాటించారు.నేరుగా యుద్ధం చేయడం చేతకాని పాకిస్థాన్ ఉగ్రవాదులను పెంచి దొంగ దాడులకు పాల్పదుతుందని, భారత ప్రభుత్వం పాకిస్థాన్ కు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

## అనుమతిలేని తవ్వకాలతో.. జనం అవస్థలు



**విశ్వంభర, హైదరాబాద్:** అంబర్ పేట నియోజకవర్గం తిలక్ నగర్ మహేష్ పాన్ షాప్ సమీపంలో ఓ ఇంటి యజమాని రాత్రికి రాత్రి రోడ్డును తవ్వి తన ఇంటికి డ్రైనేజీ పైప్ లైన్ వేసుకున్నాడు. పైప్ లైన్ వేసిన తర్వాత కనీసం సదరు యజమాని రోడ్డుకు మరమ్మతులు చేయించకుండా అలాగే వదిలేశాడు. దీంతో వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రోడ్డు కంకరమయంగా మారి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ మార్గంలో నడుచుకుంటూ వెళ్లే మహిళలు, పిల్లలు కింద పడుతూ గాయాల పాలవుతున్నారు. అనుమతి లేకుండా రాత్రికి రాత్రి పైప్ లైన్ వేసిన యజమానిపై అటు జలమండలి అధికారులు గాని, అనుమతి లేకుండా రోడ్డును ధ్వంసం చేసిన యజమానిపై జిహెచ్ఎంసి అధికారులు చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

### నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి



**విశ్వంభర, తలకొండపల్లి;** తలకొండపల్లి మండలం వేల్జాల్ గ్రామానికి చెందిన మల్లి కేడి అశోక్, తుపాకుల పవన్, అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స చేయించుకోని హాస్పిటల్ బిల్స్ స్థానిక శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి కి ఇవ్వడం జరిగింది. వారి సహకారంతో మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిది చెక్కులను స్థానిక నాయకుల తో కలిసి లబ్ధిదారులు మల్లెకేడి అశోక్ , తుపాకుల పవన్ కు మార్కెట్ కమిటీ డైరెక్టర్ చెర్ల వెంకట్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మల్లి కేడి అంబాజి, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, మండల్ కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు, ఎం.డి. ఆరిఫ్, నాయకులు ఏ రవీందర్ గౌడ్, సి.వెంకటరమణారెడ్డి, ఏ కిరణ్ కుమార్ గౌడ్, ఎం.డి. అబ్బాస్, పులిజాల విష్ణు, ఎం.డి. అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## పెహల్గాం ఘటనపై భద్రాచల దేవస్థానం సంతాపం

### — మృతుల పట్ల శాంతికై ప్రత్యేక పూజలు



**విశ్వంభర, భద్రాచలం:** జమ్మూ కశ్మీర్‌లోని పెహల్గాం ప్రాంతంలో జరిగిన దుర్ఘటనలో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోయిన ఘటనపై భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం తీవ్ర విచారం వ్యక్తం చేసింది. ఈ సంఘటన నేపథ్యంలో శుక్రవారం దేవస్థాన పరిపాలన బృందం, ప్రధాన అర్చకులు, వైదిక సిబ్బంది మృతులకు సంతాపం ప్రకటించారు. మానవీయ కోణాన్ని కళ్లకు కట్టేలా స్వామివారి సన్నిధిలో శివరాం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని, బాధిత కుటుంబాలకు ఆ పరమాత్మ ఆదరణ కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో హోమాలు, సుదర్శన యాగం వంటి కార్యక్రమాలు కూడా చేపట్టే అవకాశం ఉంది. భద్రాచల దేవస్థానం తరఫున ప్రతి జాతీయ విషాద ఘటనపై ఇలా స్పందించడం శ్లాఘనీయం అని భక్తులు అభిప్రాయపడుతున్నారు.

### పారిశుధ్య కార్మికులకు టోపీలను అందజేసిన కార్పొరేటర్



**విశ్వంభర, హనుమకొండ:** వరంగల్ మహానగర పాలక సంస్థ ఆధ్వర్యంలో 21వ డివిజన్ లోని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు కార్పొరేటర్ కార్యాలయం వద్ద 21వ డివిజన్ కార్పొరేటర్ మహ్మద్ పుర్ఖాన్ వేసవి కాలంలో రక్షణకు టోపీలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మహమ్మద్ పూర్ ఖాన్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఉదయం నుండి సాయంత్రం వరకు వేడి తాకిడి తట్టుకొని పనిలో నిమగ్నమై ఉంటున్న సందర్భంలో ఎండలో ఉపశమనం కలుగుతుందని వారికి టోపీలు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ ధరమ్ సింగ్, మున్సిపల్ వినయ్, పారిశుద్ధ సిబ్బంది పాల్గొన్నారు.

### భూ భారతి రైతు అవగాహన సదస్సు

**విశ్వంభర, మాడ్గుల:** శుక్రవారం మాడ్గుల మండల కేంద్రం వావిచ పంక్షన్ హాల్ లో భూ భారతి రైతు అవగాహన సదస్సు అవివిదంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బీద వారికి కార్పొరేట్ వైద్యం చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డి, సూదిని రాంరెడ్డి పీసీసీ కార్యదర్శి, బట్టు కిషన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మరియు కాంగ్రెస్ మండల నాయకుల ఆధ్వర్యంలో సుద్దపల్లి గ్రామానికి చెందిన ముదిపోజు మాధవ చారి కి రూ. 60000లు, కొప్పుల రజిత శ్రీను కి రూ. 20000లు చెక్కులు నాగ్యార నర్సింహా మాజీ సర్పంచ్, కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ రంగారెడ్డి జిల్లా, గొర్ల ఓంప్రకాష్ కాంగ్రెస్ కార్యదర్శి మాడ్గుల, దేవరకొండ, శ్రీనివాస్ ల చేతుల మీదుగా ఇవ్వడం జరిగింది. కాంగ్రెస్ నాయకులు ఐలబోయిన మల్లేష్ యాదవ్, ఎటెల్లి ఈదయ్య పాల్గొనడం జరిగింది.

# తెలంగాణ ఉద్యమంలో జర్నలిస్టుల పనితీరు మరువలేనిది

## జగిత్యాల జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల

**విశ్వంభర, మెట్ పల్లి:** తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో సకల జనులతో పాటు జర్నలిస్టులు చేసిన కృషి పనితీరును రాష్ట్రం ఎప్పటికీ మరువనిదని తెలంగాణ రాష్ట్రం ఏర్పాట్లు పాత్రికేయుల పాత్ర కీలకమని జగిత్యాల జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కోరుట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ అన్నారు. శుక్రవారం మెట్ పల్లి పట్టణంలోని ఆర్మీ రెస్టారెంట్ సమావేశ మందిరంలో బి ఆర్ ఎస్ పార్టీ 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా మీడియా ప్రతినిధులు స్థానిక రిపోర్టర్లు తమతో పాటు రెండు దన్నుగా ఉండి ప్రజా సమస్యలపై ప్రతినిత్యం పోరాడి ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా నిలవడంలో తమదైన పాత్ర వహించి నియోజకవర్గం అభివృద్ధికి ఎనలేని సేవలు చేశారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమం కోసం మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు తో పాటు సకల జన సమ్మెలో రాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా ఎలక్ట్రానిక్ మీడియా ప్రింట్ మీడియా లో పనిచేసే తెలంగాణ రాష్ట్రం లో జరిగే ఉద్యమాన్ని ప్రతినిత్యం ప్రజలకు కళ్ళకు కట్టినట్టు చూపించి సమాధి అయిన భూమిక పోషించారని వాక్యానించారు. ప్రజలకు ఉపయోగపడే



వార్తలను సేకరిస్తే నియోజక వర్గ అభివృద్ధికి మరింత సహకారం అందించిన వారు అవుతారని ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ వాక్యానించారు. అనంతరం వరంగల్లో 27న జరగబోవు తెలంగాణ ఆవిర్భావ సభ ను ఆశీర్వదించాలని ఆహ్వాన పత్రిక ను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మారుసాయిరెడ్డి, ఇబ్రహీంపట్నం మల్లాపూర్ మెట్ పల్లి పట్టణ, మెట్ పల్లి మండల రిపోర్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిక



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలంలోని కుంకుడుపాముల గ్రామం నుండి కాంగ్రెస్ పార్టీ 25 కుటుంబాలు నకిరేకల్ మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య సమక్షంలో ఆ పార్టీకి రాజీనామా చేసి చిరుమర్తి లింగయ్య సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ వరంగల్ సభ కోసం కేసీఆర్ బహిరంగ సభ అంటేనే యావత్ కాంగ్రెస్ నాయకుల వెన్నులో వణుకు పుడుతోందని, కేసీఆర్ ఉపన్యాసం వినేందుకు దేశమంతా ఎదురు చూస్తోందని, కేసీఆర్ మాటలు వినేందుకు యావత్ తెలంగాణ రైతాంగం స్వచ్ఛందంగా కదం తొక్కిందని, రైతులు, మహిళలు, విద్యార్థులు కాంగ్రెస్ మోసపూరిత హామీలకు బలి అయ్యామని బాధపడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిల్లర మల్లర చేష్టలు చేస్తున్నారని, బిఆర్ఎస్ సభలకు అడుగడుగునా అడ్డంకులు సృష్టిస్తున్నారని, కేసీఆర్ ను ముఖ్య మంత్రిగా చూడాలని రైతులు ఎదురు చూస్తున్నారని, తమ గ్రామాలు కేసీఆర్ నాయకత్వంలోనే బాగుపడతాయని ప్రజలకు స్పష్టమైన అవగాహనతో ఉన్నారని, కేసీఆర్ ను ముఖ్య మంత్రిని చేసేందుకు ప్రతి తెలంగాణ బిడ్డ కంకణబద్ధులై ఉన్నారని, కేసీఆర్ హయాంలో జరిగిన సుభిక్షమైన పాలనే మళ్ళీ కావాలని కోరుకుంటున్నారని, కాంగ్రెస్ బిజెపి పార్టీలకు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, కేసీఆర్ వరంగల్ సభతో రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు రావడం ఖాయమని అన్నారు.

# పహల్ గావ్ దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ

**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలో పహల్ గావ్ దాడికి నిరసనగా సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కొవ్వొత్తులతో మండల కేంద్రంలోని స్థానిక సుభాష్ విగ్రహం నుండి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి కొవ్వొత్తులు వెలిగించారు. జమ్మూ కాశ్మీర్ పహల్ గావ్లో ఉగ్రవాద దాడిలో అమాయకులైన పర్యాటకులపై జరిగిన దాడిని సిపిఐ(ఎం) పార్టీ పట్టణ కమిటీ పూర్తిగా ఖండిస్తూ ఉందని అన్నారు. ఈ సందర్భంగా సిపిఐఎం మండల కార్యవర్గ సభ్యులు కందుల హనుమంతు, పట్టణ కార్యదర్శి మునుకుంట్ల లెనిన్ మాట్లాడుతూ ఉగ్రవాద దాడిలో అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని దాడుల్లో గాయపడిన వారికి ప్రభుత్వము మెరుగైన వైద్యం అందించాలని పహల్గావ్ ఉగ్రవాద దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని పహల్గావ్ రెడ్ జోన్ అయినప్పటికీ పోలీస్, మిలిటరీ రక్షక దళాలను మెరుగుపరచుకొని శాంతిభద్రతలు కాపాడుటకు



తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, ఐలు రాష్ట్ర ఉపాధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి, సీనియర్ నాయకులు ఉముద ఆంజనేయులు, పల్లె సత్యం, బి.సత్యం, గంజి అశోక్, రాసాల రమేష్, అప్పం సంతోష్, కదారి రాములు, కృష్ణారావు, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టి బొమ్మ దహనం




**విశ్వంభర, తలకొండపల్లి:** తలకొండపల్లి మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో తలకొండపల్లి బస్టాండ్ ఆవరణలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేశారు. జమ్మూ కాశ్మీర్ అనంత్ నాగ్ జిల్లా పహల్గామ్ సందర్శించడానికి వచ్చిన పర్యాటకుల పై ఉగ్రవాదులు జరిపిన దాడిలో 28 మందికి పైగా పర్యాటకులు మృతి చెందడంపట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేయడం జరిగింది. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ఉగ్ర మూకల దాడిలో గాయపడిన క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ఈ ఉగ్రదాడిలో హిందువులని గుర్తించి మరి చంపి పైశాచిక ఆనందాన్ని ఉగ్రవాదులు పొందారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి క్రూర చర్యలు మానవత్వానికి మచ్చలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. అవిశ్వాసాన్ని, అసహనాన్ని వ్యాప్తి చేసే ఈ విధమైన ఉగ్రవాద దాడులను తూర్పరిచే సమయం ఆసన్నమైందని ప్రజలంతా ఐక్యంగా నిలవాలని కోరారు. నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నాయకత్వంలో ఉగ్రవాదుల ఎరివేతపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇంటెలిజెన్స్ విభాగాన్ని అప్రమత్తం చేసి పర్యాటక ప్రాంతాలలో మరియు రద్దీగా ఉన్న ప్రాంతాలలో అదనపు బలగాలతో నిఘా పెట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమం లో బీజేపీ మండల అధ్యక్షులు తిరుమని రవి గౌడ్, జిల్లా నాయకులు బక్కి కుమార్, కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు శేఖర్ రెడ్డి, కల్వకుర్తి అసెంబ్లీ అసెంబ్లీ కన్వీనర్ పద్మ అనిల్ ముదిరాజ్, శాంతకుమారి యాదయ్య, పద్మ గణేష్,ఠాగూర్ నాయక్, జంగయ్య, అజయ్,శ్రీను నాయక్,రాజు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## శ్రీమాన్ కో ఆపరేటివ్ క్రెడిట్ యూనియన్ క్వాసి బ్యాంకింగ్ ప్రారంభం

### ప్రారంభించిన కార్పొరేటర్ లు పోతుల శ్రీమాన్, జన్ను శిబారాణి అనిల్

శ్రీమాన్ కో ఆపరేటివ్ క్రెడిట్ యూనియన్ క్వాసి బ్యాంకింగ్ ను ఐదు, మూడవ డివిజన్ల కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జన్ను శిబారాణి అనిల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీమాన్ కో ఆపరేటివ్ క్రెడిట్ యూనియన్ చైర్మన్ సంతోష్ యాదవ్ మాట్లాడుతూ సామాన్య మానవులకు పొదుపు ఖాతా, కరెంటు ఖాతా, డిపాజిట్లు అందుబాటులో ఉన్నాయని అన్నారు. చిన్న మధ్య తరగతి వ్యాపారాలను ప్రోత్సహించేలా రుణ సాదుపాయం అందించనున్నమని తెలిపారు. ప్రజలు ఒక్కసారి తమ బ్రాంచ్ ని సంప్రదించి తమ సేవలు వినియోగించుకోవాలని కోరారు. మా బ్యాంకు లో లాకర్ సౌకర్యం కలదు అని అన్నారు. ఈ సందర్భంగా చైర్మన్ సంతోష్ యాదవ్ కు కార్పొరేటర్లు పోతుల శ్రీమాన్, జన్ను శిబారాణి అనిల్, బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ లు శుభాకాంక్షలు తెలిపారు.



# భారీ బహిరంగసభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి రావాలి

## రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర

**విశ్వంభర, హైదరాబాద్:** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రజతోత్సవాల సందర్భంగా ఈనెల 27న హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగసభకు పెద్ద సంఖ్యలో తరలి రావలసిందిగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్ని వర్గాల ప్రజలకు పిలుపునిచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలో మన తెలంగాణ ప్రాంతానికి జరుగుతున్న అన్యాయాలను చూసి చలించిపోయి డిప్యూటీ స్పీకర్ పదవిని తృణప్రాయంగా త్యజించి పార్టీని స్థాపించి ప్రజలకు కొండంత ధైర్యాన్నిచ్చిన కల్వకుంట్ల చంద్రశేఖర రావు గొప్ప నాయకుడని ఎంపీ రవిచంద్ర అన్నారు. అహింసా మార్గంలో మహోద్యమాన్ని నడిపి దేశంలోని మెజారిటీ రాజకీయ పార్టీలను ఒప్పించి ఢిల్లీ పాలకుల మెడలు వంచి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి ప్రజల చిరకాల కోరికను నెరవేర్చిన మహనీయులు కేసీఆర్ అని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో కొనియాడారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి పదవిని చేపట్టి, పదేళ్ల తన సుపరిపాలనలో సంక్షేమం, అభివృద్ధి రెండు కండ్లుగా రాష్ట్రాన్ని బంగారుమయంగా తీర్చిదిద్దిన దార్శనికులు కేసీఆర్ అని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నాయకులు వాటిలో ఏ ఒక్కటి కూడా నెరవేర్చలేకపోవడంతో ప్రజలు తిరిగి బీఆర్ఎస్, గొప్ప పాలనాదక్షులు కేసీఆర్ వైపు చూస్తున్నారని ఎంపీ రవిచంద్ర స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జరుగుతున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు మహా కుంభమేళకు దండు కట్టిన మాదిరిగా గులాబీ శ్రేణులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, తెలంగాణవాదులు, ఉద్యమకారులు, అన్ని వర్గాల ప్రజలు తండోపతండాలుగా చేరుకుని మహానేత కేసీఆర్ కి అపూర్వ స్వాగతం పలుకుదామని, ఆయన నాయకత్వాన్ని మరింత శక్తివంతం చేద్దామని ఎంపీ వద్దిరాజు పిలుపునిచ్చారు.



## మలేరియా వ్యాధిని పూర్తిగా నిర్మూలిస్తాం




**విశ్వంభర, ఆమనగలు:** ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆమనగల్లు ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలకు, రోగులకు మలేరియా వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ

ప్రపంచ మలేరియా దినోత్సవం ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25వ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. 2007వ సంవత్సరం ప్రపంచ ఆరోగ్య సంస్థ తీర్మానం ప్రకారం 2008 నుండి ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. దీని ముఖ్య ఉద్దేశ్యం ప్రజలలో అవగాహన కల్పించి వివిధ శాఖల సమన్వయంతో పునరంకితులై ప్రపంచవ్యాప్తంగా మలేరియాని నిర్మూలించాలని, భారతదేశంలో 2030 సంవత్సరం వరకు మలేరియాని పూర్తి గా నిర్మూలించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని,తెలంగాణ రాష్ట్రం గత పది సంవత్సరాల నుండి మలేరియా వ్యాధిని తగ్గించడంలో గణనీయమైన ప్రగతిని సాధించింది. రాష్ట్రం లోని 33 జిల్లాలలో గత మూడు సంవత్సరాలుగా ఎలాంటి మలేరియా కేసులు నమోదు కాలేదు. 13 జిల్లాలలో గత సంవత్సరం 2024లో ఎలాంటి మలేరియా కేసులు నమోదు కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా మలేరియా వ్యాప్తిని 0.006% తగ్గించడం జరిగిందనీ, 2030 నాటికి మలేరియా పూర్తిగా నిర్మూలనకై నిబద్ధతగా పని చేస్తున్నామని డాక్టర్ లు మంజుల, మైమున బేగం, నాగరాజు తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ ఓ విజయ, హెచ్ ఈ ఓ తిరుపతి రెడ్డి, వేణు నాగేశ్వరి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

**అందాల కాశ్మీర్ లో అగ్నివర్షం**
**(రక్తంతో తడిసిన పూలవనం కన్నీటి గాథ)**

**పార్టు...2**
**ఎటుచూసినా శవాల గుట్టలే...**
**ప్రకృతి అందాలను ఆస్వాదించే అమాయకపు పర్యాటకుల**
**హాహాకారాలే ఆర్తనాదాలే...పారె రక్తపుటేరులే...**

**కాళ్ళేవేళ్ళా పడినా కాళ్ళపారాణి ఆరని హనీమూన్ కోసం**
**వచ్చిన నవవధువు కళ్ళముందే భయంకరమైన కాల్పులు...**
**క్షణాల్లో... శవమై నేలకొరిగిన భర్త...**

**కన్నబిడ్డల కట్టుకున్న భార్యల కళ్ళెదుటే కసాయి ముష్కరులు కర్కశంగా జరిపిన కాల్పుల్లో భర్తలెందరో రక్తపు**
**మడుగుల్లో**
**గిలగిల కొట్టుకుంటూ శవాలై మిగిలిన హృదయ విదారక**
**విషాధకర దృశ్యం...**

**నిన్నటి పహల్గామ్‌లోని**
**మినీ స్విట్జర్లాండ్ బైసరిన్ లోయ నేడు అమాయకపు**
**టూరిస్ట్ ల శ్మశానవాటిక.**

**వారు పర్యాటకులు కాదు...**
**ప్రకృతిని ఆరాధించే పాదయాత్రికులు వారు యోధులు**
**కాదు...**
**అందాన్ని ఆస్వాదించే ప్రేమ పక్షులు...**
**కానీ "టెర్రరిస్టులు టూరిస్టులే టార్గెట్" గా**
**పేల్చిన తుపాకీ తూటాలకు బలైపోయారు పచ్చని పచ్చిక**
**బయళ్ళలో రక్తపు మడుగుల్లో శవాలై మిగిలారు.**

**ఎటు చూసినా కన్నీటి నదుల ప్రవాహమే**
**రెక్కలు విరిగి నేలకొరిగిన శాంతికపోతాలే**
**ఎరుపెక్కిన సూర్యుని మౌన రోదనలే...**
**ఆరోజు కాశ్మీర్ శాలువా రక్తంతో తడిసింది**

**వారు మనుషులు కాదు**
**ఉన్మాదులు....ఉగ్రవాదులు...**
**మతోన్మాదులు...రక్తంత్రాగే రాబందులు**
**మానవత్వంలేని మానవ మృగాలు...**
**మరణమృదంగం వాయించే**
**ఆర్మీ దుస్తుల్లో వచ్చిన మృత్యుదూతలు...**
**వారు నరమేధ యజ్ఞానికి పర్యాటకుల్ని**
**బలి తీసుకున్న నరరూప రాక్షసులు...**

**రచన:**
**కవి రత్న**
**సాహిత్య ధీర**
**సహస్ర కవి భూషణ్**
**పోలయ్య కూకట్లపల్లి**
**అత్తాపూర్ హైదరాబాద్**

## 27 మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష



**విశ్వంభర, మహబూబాబాద్:** కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్ అడ్మిషన్ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్ష ఈనెల 27 ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పరిమి నవీన్ తెలియజేశారు. ఉదయం 10:00 నుండి 12 గంటల వరకు ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుంది. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటల నుండి నాలుగు గంటల వరకు 8, 9, 10 తరగతులకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుంది. కావున విద్యార్థులు మీ సేవా కేంద్రం నుండి హాల్టికెట్లను పొంది పరీక్షకు సిద్ధంగా ఉండాలని ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలియజేశారు. https://www.telanganams.cgg.gov.i ద్వారా డౌన్లోడ్ చేసుకోగలరు.

## పర్యాటకులపై ఉగ్రవాదుల దాడికి నిరసనగా క్యాండిల్ ర్యాలీ.



**విశ్వంభర, సరూర్ నగర్ :**జమ్మూ కాశ్మీర్ లోని పహల్గాం లో పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల దాడిని నిరసిస్తూ ఆర్కేపురం డివిజన్ చిత్రా లేఔట్ లో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు పెండ్యాల నగేష్ ఆధ్వర్యంలో కాలనీ పార్క్ నుండి అల్కాపురి సీతా రామరాజు విగ్రహం వరకు కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పెండ్యాల నగేష్, కాలనీ వాసులు మాట్లాడుతూ...ఉగ్రవాదుల దాడి పిరికిపంద చర్య అని దీని ద్వారా దేశ ప్రజల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేరని అన్నారు.ఈ ఘటన దేశ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని అన్నారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇలాంటి ఉగ్రవాదుల మరలా జరుగకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రధాన కార్యదర్శి గణేష్, కోశాధికారి రేవెల మల్లికార్జున్, రెగట్టి సుధాకర్ రెడ్డి, కిషోర్ రెడ్డి, శరత్,ఎర్ర శ్రీనివాస్, రాముకృష్ణ,ప్రవీణ రెడ్డి, సబిత రెడ్డి, వాణిశ్రీ,లావణ్య, శైలజ, స్వప్న, అంజల్ రావు, రఘునాథ్, సునీల్ కుమార్ కాలనీవాసులు పాల్గొన్నారు.

### మంత్రిని కలిసిన పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ , వైస్ చైర్మన్

## పోచంపల్లి బ్యాంక్ నూతన భవన ప్రారంభోత్సవానికి ఆహ్వానం



**విశ్వంభర, హైదరాబాద్ :** ది పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ ప్రధాన కార్యాలయ నూతన భవన ప్రారంభోత్సవం మే 1 వ తేదీన భూదాన్ పోచంపల్లి లో ఘనంగా ప్రారంభించనున్నారు. ఈ ప్రారంభ మహోత్సవానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర చేనేత , టెక్స్ టైల్ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరుగనుంది. భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ల ఆధ్వర్యంలో పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ , వైస్ చైర్మన్ భారత రాజేంద్ర ప్రసాద్ ఆహ్వానించడం జరిగింది. సానుకూలంగా స్పందించిన మంత్రి తప్పకుండ వస్తానని హామీ ఇచ్చారు. అలాగే చేనేత కార్మికుల తో ఇంటరాక్షన్ ప్రోగ్రామ్ లో పాల్గొంటారని బ్యాంకు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి , ఎమ్మెల్యే , ఎంపీలకు చేనేత శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తద్దు వెంకటేష్ , భారత లవ కుమార్ , కొట్టం కరుణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రజతోత్సవ సభను విజయవంతం చేద్దాం: ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి.



**విశ్వంభర, ఎల్బీనగర్** బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ వేడుకల్ని పురస్కరించుకొని ఈ నెల 27వ తేదీన వరంగల్‌లో నిర్వహించే కార్యక్రమాల్లో భాగంగా ఎల్.బి.నగర్ నియోజకవర్గంలోని చైతన్యపురి డివిజన్‌లోనీ ఫణిగిరి కాలనీ తెలంగాణ చౌరస్తాలో బిఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకులు శివ ప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించిన జెండా పండుగ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎల్బీనగర్ నుండి పెద్ద ఎత్తున బహిరంగ సభకు హాజరవుతానని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో కొత్తపేట మాజీ కార్పొరేటర్ సాగర్ రెడ్డి , మాజీ కార్పొరేటర్ విఠల్ రెడ్డి , డివిజన్ ప్రెసిడెంట్ తోట మహేష్ యాదవ్ , మహిళా ప్రెసిడెంట్ నాగలక్ష్మి, చంద్రశేఖర్, ఫణిగిరి కాలనీ ప్రెసిడెంట్ అజయ్ కుమార్, రవి యాదవ్,కడియం మోహన్,ప్రవీణ్ కుమార్, సాయినాథ్ రాజ్,సాయి యాదవ్, సుబ్బు,సుధాకర్,తరుణ్,పవన్,గణేష్ ,వల్లీ, ఆసిఫ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్ర దాడిని నిరసిస్తూ వ్యాపారస్తుల నిరసన ర్యాలీ



**విశ్వంభర, హైదరాబాదు:** జమ్మూకశ్మీర్ లోని అనంత్‌నాగ్ జిల్లా పహల్గావ్ జిల్లాలో జరిగిన టెర్రరిస్ దాడిని నిరసిస్తూ... హైదరాబాద్ బేగంబజార్ లో వ్యాపారస్తులు స్వచ్ఛందంగా బంద్ నిర్వహించి నిరసన తెలిపారు. టెర్రరిస్టుల చిత్ర పాటలను దహనం చేసి పాకిస్థాన్ కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీగా ర్యాలీ వ్యాపారస్తులు నిర్వహించారు. పాకిస్థాన్ ఎన్ని కావింపు చర్యలు చేసిన భారత్ భయపడే ప్రసక్తే లేదు..మోడీకి భారత ప్రజలు అండగా ఉంటారు. దాడికి పాల్పడిన వారిపై అతి త్వరలో భారత్ ప్రతీకారం తీసుకుంటుందని నమ్మకం ఉంది. దాడిలో మృతి చెందిన వారికి ర్యాలీగా శ్రేద్ధాంజలి ఘటించిన వ్యాపారస్తులు. ఈ కార్యక్రమంలో బేగంబజార్ జనరల్ మర్చంట్ సభ్యులు శ్రీరామ్ వ్యాస్, నరేందర్ బన్సాల్, సునీల్ శెట్టి, జై రాజ్ జైన్, కిషోర్ జైన్, ఉదయ్ సింగ్, భన్వర్ లాల్, వీర్ చంద్, దిలీప్ బన్సారీ, భారత్ కటరియా, సురేందర్ జై తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టం దీర్ఘకాలిక భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

### - కలెక్టర్ నారాయణరెడ్డి



**విశ్వంభర, ఆమనగల్లు:** దీర్ఘ కాలిక భూ సమస్యల శాశ్విత పరిష్కారానికి భూ భారతి ఎంతగానో తోడ్పడుతుందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు లక్ష్మి గార్డెన్ లో నిర్వహించిన భూ భారతి కొత్త ఆర్ఆర్ చట్టంపై అధికారులు, రైతులతో కలిసి అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాల్గొన్న జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు, నిషేధిత భూములు, ఆర్డీఓఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామాలు వంటి సేవలు సులభతరం కానున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు తిరగకుండా అధికారులు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను పరిష్కరిచేందుకు కృషి చేస్తారని తెలిపారు. ధరణితో ఉన్న బాధలు, భూ సమస్యలు ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన భూభారతి చట్టంతో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ధరణిలో పేరుకుపోయిన సమస్యలకు గ్రామ, మండల, రెవెన్యూ డివిజనల్ స్థాయిలో పరిష్కారం లభిస్తుందని, కోర్టులను ఆశ్రయించాల్సిన పని ఉండదని ఆయన తెలిపారు. వ్యవసాయం, వ్యవసాయేతర భూములకు ఈ చట్టం వర్తిస్తుందని, ప్రతి కమతంకు భూ ఆధార్ కార్డు అందించి భవిష్యత్తులో భూ సమస్యలు తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో గ్రామపాలన అధికారులను నియమిస్తున్నట్లు చెప్పారు. అవగాహన సదస్సులో మార్కెట్ చైర్మన్ యాట గీత మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారానికి చక్కని వేదిక భూ భారతి అని ఈ చట్టంతో ప్రతి భూ సమస్యకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుంటే ప్రతిపక్షాలు అసత్య ప్రచారం చేస్తూ ప్రభుత్వం పై బురద జల్లు తున్నారని అన్నారు. కార్యక్రమంలో కందుకూరు ఆర్డీవో తో పాటు ఎమ్మార్వో లలిత ఎంపీడీవో కుసుమ మాధురి, ఏవో అరుణ కుమారి, కమిషనర్ శంకర్ నాయక్, మార్కెట్ చైర్మన్ యాట గీతా నరసింహ, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ గంప వెంకటేష్, వైస్ చైర్మన్ సత్యం కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## వేసవి సెలవుల్లో బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, వెల్లంకి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వేసవి సెలవుల్లో విద్యార్థులను చేర్చుకోవడం కొరకు స్పెషల్ డ్రైవ్ ప్రోగ్రాంను నిర్వహిస్తున్నందుకు మండల విద్యాధికారి గవ్వజ్యోతి ప్రశంసలు తెలియజేశారు. అదేవిధంగా వెల్లంకి గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని, ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన ఉచిత విద్య అందుతుందని తల్లిదండ్రులకు తెలిపి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. అదే విధంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పల్లె మోహన్ రెడ్డి మాట్లాడుతూ, సెలవుల్లోనే ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్ళినప్పుడు వారి నుండి మంచి స్పందన వస్తుందని, సెలవుల్లో కూడా ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమం నిర్వహిస్తున్నందున గ్రామ ప్రజలు కూడా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీమతి పులగం సులోచన, మాజీ చైర్మన్ కర్రె రాజు, ఉపాధ్యాయులు ఇట్టే సోమిరెడ్డి, ఉయ్యాల బిక్షమయ్య, దూదిగామ సువర్ణ, మంధుగుల వెంకటయ్య, కొసనం మాధవి తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు తీర్చే అధికారం రెవెన్యూ అధికారులదే

### జిల్లా కలెక్టర్



**విశ్వంభర, ఘట్కేసర్:** భూభారతితో రైతుల, భూస్వాముల భూసమస్యలు తీర్చే అధికారం రెవెన్యూ అధికారులకు ఈ చట్టంలో ఇవ్వడం జరిగిందని, తద్వారా సమస్యలకు రెవెన్యూ అధికారులు శాశ్వత పరిష్కారం కల్పిస్తారని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతం అన్నారు. శుక్రవారం ఘట్కేసర్ మండలంలోని ఎదులాబాదు గ్రామంలో గల డిఎస్ఆర్ ఫంక్షన్ హాలు లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు గౌతమ్ ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ భూభారతితో రైతుల, భూస్వాముల భూ సమస్యలు తీర్చే అధికారం రెవెన్యూ అధికారులకు ఈ చట్టంలో ఇవ్వడం జరిగిందని, తద్వారా సమస్యలకు రెవెన్యూ అధికారులు శాశ్వత పరిష్కారం కల్పిస్తారని అన్నారు. ప్రతి గ్రామంలో తహాసీల్దారు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఆ సదస్సులో మీయొక్క వ్యక్తిగత భూసమస్యలకు సంబంధించిన అప్లికేషన్లు ఇస్తే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సదస్సులో కీసర ఆర్డిఓ ఉపేందర్ రెడ్డి, ఘట్కేసర్ తహాసీల్దారు రజనీ, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మేడే అమరవీరుల స్ఫూర్తితో నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై ఉద్యమిద్దం



విశ్వంభర, మహేశ్వరం : మేడే అమరవీరుల స్ఫూర్తితో నరేంద్ర మోడీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ లపై ఉద్యమిద్దాం కార్మిక చట్టాలను పరిరక్షించుకుందాం ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి బి దత్తు నాయక్ తుక్కుగూడ కేంద్రంలో పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది. 139 మే డే వాల్ పోస్టర్లను ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి దేవేంద్ర గౌడ్, కే రాజు, ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆయన విడుదల చేశారు ఈ సందర్భంగా బి.దత్తు నాయక్ మాట్లాడుతూ మేడే ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే గొప్ప కార్మిక పండుగ అని వాడవాడల అన్ని గ్రామాలు మండల కేంద్రాలలో ఘనంగా నిర్వహించే కార్మిక వర్గం పోరాట చైతన్యాన్ని ప్రదర్శించాలని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలను ఎండగట్టే విధంగా మేడే స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని ఆయన కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. 139 మే డే ను జిల్లాలో అన్ని ప్రాంతాలలో నిర్వహించాలని ఏఐటీయూసీ నాయకత్వానికి కార్యకర్తలకు కార్మిక వర్గానికి ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా తుక్కుగూడ పట్టణంలో వేలాది మంది కార్మికులు నివాసం అంటూ ఫ్యాబ్ సిటీ, హార్డ్వేర్ పార్క్. ఐడియల్ మంకాల. మహేశ్వరం పారిశ్రామిక ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్నారు వారికి ఈఎస్ఐ హాస్పిటల్ లేక తీవ్రమైన ఇబ్బందులకు గురవుతున్నారు ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకొని వెంటనే మే డే స్ఫూర్తితో కార్మికులకు వైద్య సౌకర్యం ఈఎస్ఐ హాస్పిటల్లో తుక్కుగూడ కేంద్రంలో ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని ప్రభుత్వానికి పోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దేవేంద్ర గౌడ్ కే రాజు న్. యాదగిరి. భాను సురేష్ లాలు నరసింహ ఆటో యూనియన్ కార్మికులు ఇతర నాయకులు పాల్గొన్నారు.

# మాన్యం భూమిని సర్వే నిర్వహించిన అధికారులు



విశ్వంభర, జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల పరిధిలోని పాపకొల్లు గ్రామం నందు గల శ్రీ ఉమా సోమలింగేశ్వర స్వామి వారి దేవస్థానం మాన్యం భూమిని శుక్రవారం పాపకోల్లు రెవెన్యూ పరిధిలోని గుండ్ల రేవు రాంపురం గ్రామాల సరిహద్దు నందుగల సర్వే నెంబర్ 1050 నందు 4 -00 ఎకరాలు మరియు 1051 నందు 6 -16 ఎకరాలు మొత్తం 10-16 ఎకరాల దేవుడి మాన్యం భూమిని సర్వే నిర్వహించి హద్దులు పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ బెల్ సింగ్, దేవాదాయ శాఖ సర్వేయర్ అనిల్ కుమార్, జూలురుపాడు రెవెన్యూ సర్వేయర్ ప్రవీణ్, ఉమా సోమలింగేశ్వర స్వామి ఆలయ ఈవో వెంకటరావు, జూలూరుపాడు ఎస్ఐ బాదావత్ రవి, కల్లూరు టెంపుల్ ఈవో సూర్య ప్రకాష్ రావు, నాచారం టెంపుల్ ఈవో శేషయ్య, అనుపరెడ్డిపల్లి ఈవో వెంకటరమణ, ఉమా సోమలింగేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ కోదుమూరి కోటేశ్వరరావు, టీపీసీసీ జిల్లా సోషల్ మీడియా చైర్మన్ నవీన్ రాథోడ్, ఆలయ సిబ్బంది బి. సంపత్ మరియు దేవాదాయ శాఖ అధికారులు, పోలీస్ అధికారులు,గ్రామస్తులు, భూమి హద్దు దారులు తదితరులు పాల్గొన్నారు

# మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ

### మలేరియా వ్యాధిని పూర్తిగా అరికడదాం వైద్య సిబ్బంది



**విశ్వంబర , త్రిపురారం:**ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మలేరియా దినోత్సవం పురస్కరించుకొని జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మాలోతు సంజయ్ సూచనలతో త్రిపురారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం ఏప్రిల్ 25వ తేదీన ప్రపంచవ్యాప్తంగా మలేరియా దినోత్సవం జరుపుకుంటారని, ఈ ర్యాలీ ముఖ్య ఉద్దేశం ప్రజలలో అవగాహన కల్పించి వివిధ శాఖల సమన్వయంతో మలేరియాను పూర్తిగా నిర్మించాలని భారతదేశంలో 2030 వరకు మలేరియా నిర్మూలనే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మాలోతు సంజయ్, సి హెచ్ ఓ మాతంగి వెంకయ్య, సూపర్వైజర్ పుట్ట గోపాల్ రెడ్డి, ఏ ఎన్ ఎం లు లీలావతి, సరోజ, నూర్జహాన్, మీనా ,జీవిత యాదమ్మ,హైమవతి, తదితరులు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ మందలించాడని విద్యార్థి సూసైడ్



విశ్వంభర, ఘట్కేసర్: మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ నారాయణ జూనియర్ కాలేజీ విద్యార్థి జశ్వంత్ (17) సూసైడ్ చేసుకున్నాడు. జగిత్యాల జిల్లాకు చెందిన అతడు ఇంటర్ ఫస్టియర్ చదువుతుండగా ఇటీవల వచ్చిన ఫలితాల్లో 3 సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. దీంతో ప్రిన్సిపల్ మందలించగా మనస్తాపానికి గురై కాలేజీలో గురువారం పురుగుల మందు తాగాడు. వెంటనే అతడిని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మరణించాడు

## హిందుస్థాన్ జిందాబాద్.. పాకిస్తాన్ ముర్దాబాద్

### జమ్ము కాశ్మీర్ ఉగ్రవాదులను ఉరితీయాలి



**విశ్వంభర, అమనగల్లు;**జమ్ముకశ్మీర్లోని అనంత్నాగ్ జిల్లా పహల్గాంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన బైసరన్లో ఉగ్రవాదులు నరమేదానికి పాల్పడి 26 మంది పర్యాటకులను హతమార్చిన ఉగ్రవాదులను ఉరితీయాలని కోరుతూ శుక్రవారం ఆమనగల్లు జామియా మజీద్, ముస్లిం మైనార్టీ ల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో పట్టణంలో నిరసన చేపట్టారు. నమాజు అనంతరం పట్టణంలో శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు. అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. హిందుస్థాన్ జిందాబాద్.. పాకిస్తాన్ ముర్దాబాద్ అంటూ నినాదాలు చేశారు. ఉగ్రవాదులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జామియా మజీద్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ మాసూమ్, అబ్దుల్ ఖలీల్, సయ్యద్ ఖలీల్, జహంగీర్, నయుం, జబ్బార్, ఎంఏరహీం, ఎంఏ కలీం, అలీమ్, కలీం, అల్తాఫ్, మజీద్ ఖురేషి, అజ్జు, చాంద్, అహ్మద్, జహంగీర్ పాషా,ఇస్మాయిల్, ఆరిఫ్, అసద్, అమీర్ పాషా, రావూఫ్, షాబు, తదితరులు ఉన్నారు.

## నార్కోటిక్ బృందాల వృత్తి నైపుణ్యానికి గుర్తింపుగా ప్రశంసా పత్రాలు నగదు రివార్డు



**విశ్వంభర, హైదరాబాదు:** హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నార్కోటిక్ డ్రగ్స్ (ఎన్‌డిపిఎస్) చట్టం కింద ముగ్గురు ప్రధాన డ్రగ్ కింగ్‌పిన్‌లను అరెస్టు చేయడంతో పాటు 36 కేసులను విజయవంతంగా పరిష్కరించినందుకు వారి అసాధారణ పనితీరు మరియు ఉన్నత స్థాయి వృత్తి నైపుణ్యానికి గుర్తింపుగా బృందాలకు ప్రశంసా పత్రాలు నగదు రివార్డులు బషీర్ బాగ్‌లోని పోలీస్ కమీషనర్ కార్యాలయంలో అందజేసిన ఐపిఎస్ డిజి అండ్ కమీషనర్ ఆఫ్ పోలీస్ హైదరాబాద్. సివి ఆనంద్, నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ యొక్క అంకితభావం, నగరంలో డ్రగ్స్ వ్యాపారాన్ని ఎదుర్కోవడంలో వారి కీలక పాత్రను అధికారులు నైపుణ్యంతో కూడిన దర్యాప్తు పద్ధతులను అవలంబిస్తూ, చట్టానికి లోబడి పనిచేసినందుకు వారిని ప్రశంసించినారు. ముఖ్యమైన డ్రగ్ కింగ్‌పిన్‌ల తో సహా ఈ ముఖ్యమైన 36 డ్రగ్ కేసులను విజయవంతంగా పరిష్కరించడం హెచ్‌ఎన్ఈడబ్ల్యు వింగ్ సిబ్బంది యొక్క వృత్తి నైపుణ్యం, కృషికి శక్తివంతమైన నిదర్శనం అని కమిషనర్ ఆనంద్ పేర్కొన్నారు. సివి ఆనంద్ ఈ కార్యక్రమములో వైవిఎస్. సుధీంద్ర డిసిపి టాస్క్ ఫోర్స్, అందె శ్రీనివాస రావు, అడిషినల్ డిసిపి టాస్క్ ఫోర్స్ హైదరాబాదులు పాల్గొన్నారు.

## కోర్టు భవనానికి ప్రభుత్వ భూమిని కేటాయించండి



విశ్వంభర, ఆమనగల్లు: బార్ అసోసియేషన్ ఆమనగల్ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆమనగల్ శ్రీ లక్ష్మి ఫంక్షన్ హాల్ లో భూ భారతి సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు నిర్మాణానికి అవసరమైనటువంటి ప్రభుత్వ భూమిని కేటాయించాలని వినతి పత్రాన్ని అందజేశారు. దీనికిగాను జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించడం జరిగింది. ఈ వినతి పత్రం అందజేసినటువంటి వారిలో ఆమనగల్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు యాదిలాల్, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, క్రీడా సాంస్కృతిక కార్యదర్శి శేఖర్, గ్రంథాలయ కార్యదర్శి వస్పుల మల్లేష్, న్యాయవాదులు జయంత్, గణేష్, సర్దార్ నాయక్, శిరీష్, శేఖర్, తదితరులు ఉన్నారు.

## వాహన దారుల సౌలభ్యం కోసం నీడ-తెరల ఏర్పాటు

-నగర మేయర్ గుండు సుధారాణి



**విశ్వంభర, హనుమకొండ:** వాహన దారుల సౌలభ్యం కోసం నీడతెరల ఏర్పాటు చేస్తున్నట్లు నగర మేయర్ గుండు సుధారాణి తెలిపారు. హన్మకొండ పరిధి అదాలత్ సిగ్నల్ జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన నీడ తెరలను మేయర్ శుక్రవారం క్షేత్ర స్థాయి లో పరిశీలించి సమర్థవంతంగా నిర్వహించుటకు అధికారులకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా ప్రతి రోజు ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయి కి చేరుతున్న క్రమంలో నగర పరిధి లోని హన్మకొండ వరంగల్ ప్రాంతాల్లోని ముఖ్య కూడళ్లలో వాహన దారులకు ఎండ నుండి ఉపశమనం కోసం సిగ్నల్ పాయింట్స్ వద్ద రెడ్ సిగ్నల్ పడినపుడు నిరీక్షించాల్సిన అవసరం ఉంటుందని ఎండ తీవ్రతల నేపథ్యంలో రక్షణ కోసం జీ డబ్ల్యూ ఏం సి తరపున నీడ తెర లను ఏర్పాటు చేస్తున్నామని హన్మకొండ ప్రాంతం లోని ప్రధాన కూడళ్లు ఐన అదాలత్ జంక్షన్ పోలీస్ హెడ్ క్వార్టర్ జంక్షన్ అశోక జంక్షన్ ములుగు రోడ్ జంక్షన్ కాకతీయ యూనివర్సిటీ జంక్షన్ తో పాటు వరంగల్ ప్రాంతం లో పోచమ్మ మైదాన్ కాశీబుగ్గ, పోస్టాఫీస్ జంక్షన్ అవసరం మేరకు ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్నామని ఈ సందర్భం గా మేయర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఈ ఈ రవి కుమార్, డి ఈ లు రాజ్ కుమార్, కార్తీక్ రెడ్డి, ఏ ఈ హరి కుమార్, తదితరులు పాల్గొన్నారు

## సర్వజన ఆశీర్వాదంతో వర్ధిల్లు

ఉద్యమ నేత శ్రీనివాస్ నాయక్



**విశ్వంభర, కేసముద్రం:** శుక్రవారం కేసముద్రం మండలం ఇంటికన్నె గ్రామంలో చిర్ర శ్రీదేవి శ్రీధర్ గౌడ్ సుపత్రిక, పుత్రులైన సాయి ప్రియ, సంజయ్ కుమార్ వస్త్ర, పుష్పాలంకరణ పంచకట్టు వేడుకలకు నర్సంపేట కాంటెస్ట్ ఎమ్మెల్యే అభ్యర్థి తెలంగాణ శ్రీనివాస్ నాయక్ హాజరై సర్వజన విశ్వ జననీ ఆశీర్వద ప్రాప్తిరస్తు అంటూ బంధం, బలగం విలువలు తెలుసుకొని నిండు నూరేళ్లు వర్ధిల్లుతూ తల్లిదండ్రులతో, సమాజంచే మన్ననలు పొందాలని అప్పుడే జీవితాలకు స్థిరత్వం తో పాటు , ఆనందాలు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీధర్ గౌడ్ శ్రీనాథ్ గౌడ్ పెద్ద గోని వెంకటేశ్వర్లు గౌడ్, రాము గౌడ్, కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు మిషన్ పంపిణీ



విశ్వంభర, హైదరాబాద్: శుక్రవారం కూకట్ పల్లి లో గల శ్రీ వాసవి కన్యాపరమేశ్వరి ఆలయం యందు ఆర్యవైశ్య సంఘం చైర్మన్ కుమార స్వామి, సిల్వెల్ ఫౌండేషన్ చైర్మన్ బండారు సుబ్బారావు ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ పంపిణీ చెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఐ వి ఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, కట్ట రవి గుప్త, భాస్కర్ గుప్త, నవీన్ రాజ్ గుప్త,-శేఖర్, చంద్ర శేఖర్,రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేత




**విశ్వంభర, మహేశ్వరం:** మహేశ్వరం మండలం కేంద్రంలో గడి కోట ప్రాంగణంలో మహేశ్వరం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. యూత్ కు క్రీడలు ఎంతో ఉత్సాహ పరుస్తాయని ప్రతి ఒక్కరూ స్పోర్ట్స్ పై శ్రద్ధ చూపించాలని, ఇలాంటి టోర్నమెంట్లో ఇంకెన్నో క్రీడలలో పాల్గొనాలని మహేశ్వరం గ్రామ పెద్దలు తెలియజేశారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో కాకుండా రాష్ట్రస్థాయిలో మండల స్థాయిలో మంచి బహుమతులు తీసుకురావాలని తెలిపారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఫస్ట్ బహుమతి రెవెల్లె శంకరయ్య ప్రథమ బహుమతిగా నిలిచారు. రన్నర్ గా యాదాద్రి డాక్యుమెంట్ వారు ద్వితీయ బహుమతిగా గెలుపొందగా తృతీయ బహుమతిగా శ్రీసాయి బోర్వెల్స్ బహుమతులు పొందారు. మహేశ్వరం గ్రామ యువకులు ఉత్సాహంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో మునగపాటి నవీన్, పోతర్ల సుదర్శన్, కాకి కుమార్, పోల్కం బాలయ్య, కర్రల చంద్రయ్య, వనంపల్లి శ్రావణ్, సయ్యద్ అలీ, క్రికెట్ టోర్నమెంట్ టీం గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## హై-రిస్క్ కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ విజయవంతం నిర్వహించిన యశోద హాస్పిటల్స్ బృందం.

**విశ్వంభర హనుమకొండ జిల్లా :** అధునాతన వైద్య నైపుణ్యంతో హైరిస్క్ కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ వియజయవంతంగా పూర్తి చేసినందుకు తమ వృత్తి పట్ల గర్వంగా ఉన్నట్లు యశోద హాస్పిటల్స్ ప్రకటించింది. ఈ ట్రాన్స్ ప్లాంట్ విజయవంతం కావడానికి కేవలం వైద్య నైపుణ్యం మాత్రమే కాకుండా మనుషులలో ధైర్యం, స్ఫూర్తి ప్రేమ కూడా కారణమని తెలిపారు. డాక్టర్ అరుణ్ పొన్న- కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ మరియు కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ ఫిజీషియన్, పేషేంట్ ప్రాణాలను నిలబెట్టే ట్రాన్స్ ప్లాంట్ చేయడానికి నాయకత్వం వహించారు. అత్యంత క్లిష్టమైన ట్రాన్స్ ప్లాంట్ కేసులను నిర్వహించడానికి ఆయన కెనడాలో శిక్షణ పొందారు. తీవ్రమైన ఊబకాయం, రెండు కాళ్ల పక్షవాతం, పల్మనరీ ట్యూబర్క్యులోసిస్, హెపటైటిస్ సి లో-గ్రేడ్ సార్కోమా వంటి అనేక ఆరోగ్య సమస్యలతో పోరాడిన గ్రహీత, రెండు సంవత్సరాలకు పైగా అనేక సవాళ్లతో కూడిన చికిత్స పొందుతున్నారు. అనేక వ్యాధులు, శస్త్రచికిత్స వలన ఎదురయ్యే సమస్యలు ఉన్నప్పటికీ, ఎదురయ్యే అన్ని పరిస్థితుల గురించి నిర్ధారణ తర్వాత కిడ్నీ ట్రాన్స్ ప్లాంట్ నిర్వహించాలనే దృఢ నిర్ణయం తీసుకోవడం జరిగింది.సాధారణ ట్రాన్స్ ప్లాంట్ కంటే ఈ కేసు ప్రత్యేకమైనది ఎందుకంటే ఈ ట్రాన్స్ ప్లాంట్ భార్య, భర్తల మధ్య ప్రేమను, బంధాన్ని కూడా వ్యక్తపరుస్తుంది. కిడ్నీ గ్రహీతకు ఆయన భార్య ప్రేమతో కిడ్నీ దానం చేశారు. మా పరిమితులను అధిగమించి చేసిన ఈ ట్రాన్స్ ప్లాంట్ పేషెంట్ ఆరోగ్య సంరక్షణలో యశోద హాస్పిటల్స్ యొక్క నిబద్ధతను ప్రతిబింబిస్తుంది."ఈ అద్భుతమైన ప్రయాణంలో మేము భాగమైనందుకు గర్విస్తున్నాము,యశోద హాస్పిటల్స్ గత 30 సంవత్సరాలుగా హైదరాబాద్ లోని యశోద హాస్పిటల్స్ ప్రపంచ స్థాయి ప్రమాణాలతో 4 బ్రాంచ్ లు (సికింద్రాబాద్, సోమాజిగూడ, మలక్ పెట్, హైటెక్ సిటీ) 4 వేల బెడ్స్ కలిగి ఉన్న అతిపెద్ద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్. వైద్య అవసరాలకు అనుగుణంగా అనుభవంతులైన వైద్యులచే, అదునాతన సాంకేతికతలతో ఇప్పుడు అందరికి చేరువలో కార్పొరేట్ వైద్య సేవలు, చురుకైన నాయకత్వం, బలమైన నిర్వహణ వైద్య చికిత్సలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలను అందించే అత్యుత్తమ కేంద్రంగా యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అభివృద్ధి చెందింది. భారతదేశంలోనే అతిపెద్ద వైద్య సదుపాయాలలో ఒకటిగా భావిస్తున్న తెలంగాణలోని హైదరాబాద్ లో 4000 బెడ్స్ సామర్థ్యంతో 20 లక్షలచదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉంది. సరసమైన ఖర్చులతో యశోద హాస్పిటల్స్ ప్రపంచ స్థాయి ఆరోగ్య సంరక్షణ సేవలను అందిస్తుందని వారు తెలిపారు.

## ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో దేశానికి అండగా నిలుస్తాం

### - బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్. రాంబాబు




**విశ్వంభర, హైదరాబాద్:** ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో దేశానికి అండగా నిలుస్తామని ఆంధ్ర ప్రదేశ్, తెలంగాణ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి బి.ఎస్. రాంబాబు తెలిపారు. పహల్గామ్‌లో జరిగిన క్రూరమైన ఉగ్రవాద దాడి బ్యాంకు ఉద్యోగులను తీవ్రంగా దిగ్భ్రాంతికి గురిచేసిందని, ఈ భయంకరమైన చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని చెప్పారు. పహల్గామ్‌లో అమాయక పౌరులపై ఉగ్రవాదుల దాడులను ఖండిస్తూ హైదరాబాద్, కోఠి, బ్యాంకు స్ట్రీట్ లో శుక్రవారం ఆంధ్ర ప్రదేశ్ & తెలంగాణ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ నిరసన ప్రదర్శన నిర్వహించింది. వందలాదిమంది బ్యాంకు ఉద్యోగులు ప్లకార్డులు చేతబూని ఉగ్రవాదం నశించాలి, శాంతిని కాపాడాలి, ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని పెద్దఎత్తున నినాదాలు చేసి, కొవ్వత్తులు వెలిగించి బాధితులకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బి.ఎస్. రాంబాబు పహల్గామ్‌లో జరిగిన దారుణమైన ఉగ్రవాద దాడి బ్యాంకింగ్ వర్గాలకు తీవ్ర దుఃఖం మరియు కోపాన్ని కలిగించిందని అన్నారు. ఈ విషాదకరమైన ఉగ్రవాద దాడిలో ఇద్దరు బ్యాంకు ఉద్యోగులు జె. చంద్ర మౌళి, శైలేష్ భాయ్ కాలాతియా బలికావడం బ్యాంకు ఉద్యోగులను తీవ్రంగా కలచివేసిందని అయన ఆవేదన వ్యక్తం చేసారు. ఈ దాడిని నాగరిక సమాజంపై ఒక మచ్చగా అభివర్ణిస్తూ, బాధ్యులను త్వరగా మరియు కఠినంగా శిక్షించాలని అయన కోరారు. శాంతి, ఐక్యత మరియు పురోగతి కోసం ప్రయత్నిస్తున్న సమాజంలో ఇటువంటి ఉగ్రవాద చర్యలకు స్థానం లేదని అయన నొక్కి చెప్పారు. అన్ని రూపాల్లో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి కేంద్ర ప్రభుత్వం గట్టిగ ప్రయత్నించాలని, బ్యాంకు ఉద్యోగులుగా కేంద్ర ప్రభుత్వానికి సంఘీభావంగా ఉంటామని, ఎల్లప్పుడూ శాంతి కోసం నిలబడతామని బి.ఎస్. రాంబాబు తెలిపారు. ఈ ప్రదర్శనలో ఆంధ్ర ప్రదేశ్ & తెలంగాణ బ్యాంకు ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు టి. రవీంద్రనాథ్, సంయుక్త కార్యదర్శి పి.వి. కృష్ణ రావు, ఉప ప్రధాన కార్యదర్శులు సమద్ ఖాన్, ఉదయ్ భాస్కర్, అజయ్ కుమార్, ఏఐబిఓఏ ప్రధాన కార్యదర్శి ఫణి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత అభివృద్ధికి ముఖ్యమంత్రి కి చిత్తశుద్ధి ఉంటే బడ్జెట్లో 2000 కోట్ల కేటాయించాలి

### బొల్ల శివశంకర్ మునుగోడు నియోజకవర్గం



**విశ్వంభర, చౌటుప్పల్:** రాష్ట్రంలో చేనేత, పవర్లూమ్ కార్మికులకు ఉపాధి లేక సంక్షేమ పథకాలు అమలు కాక గత సంవత్సర కాలంగా 32 మంది కార్మికులు ఆత్మహత్యలకు పాల్పడడం నేతన్నల సమస్య ఎంత తీవ్రంగా ఉందో రాష్ట్ర ప్రభుత్వం అర్థం చేసుకోవాలని అఖిల భారత రాజకియం విభాగం అధ్యక్షులు బొల్ల శివశంకర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చినటువంటి వాగ్దానాలు రాష్ట్రంలో ఉన్న కార్మికులందరికీ ఉపాధి కల్పిస్తామని ప్రభుత్వ రంగ సంస్థలకు కావలసిన వస్త్రాలను ఉత్పత్తి చేయించడం ద్వారా కార్మికులకు ఉపాధి కల్పించి మెరుగైన ఆదాయం వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని అనేక వాగ్దానాలు ఇచ్చింది. అధికారంలోకి వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను గాలికి వదిలేసి నేతన్నల చావులకు కారణం అయ్యింది. రాష్ట్రంలో నేతన్నలు 32 మంది ఆత్మహత్య చేసుకుంటే కనీసం ముఖ్యమంత్రి కానీ, చేనేత శాఖ మంత్రి కానీ, ఆ కుటుంబాలను పరామర్శించలేదు కనీసం ఆ కుటుంబాలని ఆదుకోలేదు. ఆత్మహత్య చేసుకున్న కుటుంబాలకు 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేనేత కార్మికులకు వాగ్దానాల పేరుతో కాలయాపన చేయడం తప్ప ఆచరణలో పెట్టడం లేదు. చేనేత కార్మికుల ఒక లక్ష రూపాయల లోపు రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారు, కానీ ఒక లక్ష రూపాయల రుణానికి పైగా ఉన్నవారికి రుణమాఫీ వర్తించదని ప్రభుత్వం ప్రకటించడం ఇది కార్మికులను మోసం చేయడమే అవుతుంది. త్రిఫ్ట్ ఫండ్ పథకం అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం అనేక ఎంక్వయిరీ ల పేరుతో లబ్ధిదారులను వేదిస్తూ సంఖ్యను తగ్గించే కుట్రలు చేస్తున్నది. మహిళా స్వయం సహాయక గ్రూపులకు రెండు చీరలు చొప్పున ఉత్పత్తి చేయిస్తామని గత ఎనిమిది నెలల క్రితం ప్రకటించి నేటికీ ఈ పథకాన్ని ప్రారంభించకపోవడం ఇటు కార్మికులను అటు మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసింది. ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు మరియు టెస్కోకు ఎన్నికలు జరిపి పాలకవర్గాలను నియమించి సహకార రంగాన్ని బలోపేతం చేయాలి అని గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కి చేనేత శాఖామంత్రి కి సమస్యలను పరిష్కరించాలి అని అనేక సందర్భాలు విన్నవించిన సమస్యలను పరిష్కరించకుండా ప్రకటన వరకే పరిమితం అవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన వాగ్దానాలు కానీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన వాగ్దానాలు అమలు కావాలి అంటే రాష్ట్ర ప్రభుత్వానికి చేనేతల పట్ల చిత్తశుద్ధి ఉంటే 19వ తేదీన ప్రవేశపెట్టే బడ్జెట్లో చేనేత రంగానికి 2000 కోట్ల రూపాయలు కేటాయించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేస్తుంది. బడ్జెట్లో చేనేతకు న్యాయం జరగకపోతే చేనేత సమస్యలను పరిష్కరించకపోతే రాబోయే కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

## పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్ ను సన్మానించి ఎస్పీ నరసింహ



విశ్వంభర, సూర్యాపేట: మోతే పోలీసు స్టేషన్ పరిధిలో 2021 సంవత్సరంలో మూఢనమ్మకాలకు పోయి కన్న కూతురిని నరబలి ఇచ్చిన కేసులో సూర్యాపేట జిల్లా మొదటి అదనపు సెషన్స్ కోర్టు నేరానికి పాల్పడిన తల్లికి ఉరి శిక్ష విధిస్తూ ఈనెల 11 వ తేదిన ఉత్తర్వులు ఇవ్వడం జరిగినది. ఈకేసులో బాధితుల తరపున కేసు వాదనలు వినిపించిన జిల్లా మొదటి అదనపు సెషన్స్ న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవిందర్ ను ఈరోజు జిల్లా పోలీసు కార్యాలయం నందు జిల్లా ఎస్పీ నరసింహ సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కేసుల దర్యాప్తులో పోలీస్ శాఖ సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ నాణ్యమైన దర్యాప్తును కొనసాగిస్తుంది. జిల్లాలో ప్రతి పోలీస్ స్టేషన్ నందు కోర్టు డ్యూటీ పోలీస్ అధికారి విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ కోర్టులతో సమన్వయంతో పని చేస్తున్నారు. బాధితులను, సాక్షులను, నిందితులను సకాలంలో కోర్టులో హాజరుపరిస్తున్నారు అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయం క్రైమ్ రికార్డ్ బ్యూరో నుండి కోర్టులలో ఉన్న కేసుల స్థితిగతులను నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాము అన్నారు. నేరాల్లో పక్కా ఆధారాలు సేకరించి రికార్డ్స్ నందు నమోదు చేసి కేసుల దర్యాప్తులో జోడీస్తున్నాము అని తెలిపినారు. పోలీసు వేగవంతమైన చర్యలతో వివిధ నేరాల్లో నేరాలకు పాల్పడ్డ వారికి త్వరగా శిక్షలు అమలు అయ్యేలా పనిచేస్తున్నాము, గత కొంతకాలంగా శిక్షల శాతం పెరిగినది అని జిల్లా ఎస్పీ తెలిపారు. బాధితులు ఎవరైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీసులకు పిర్యాదు చేయాలి, చట్టపరిదిలో నడుచుకోవాలి, చట్టంపై నమ్మకం కలిగి ఉండాలి అని కోరారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ నేరాలకు పాల్పడితే ఏనాటికైనా శిక్షలు తప్పవు అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు పోలీస్ లైజన్ అధికారి హెడ్ కానిస్టేబుల్ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

## ఘనంగా డైమండ్ జ్యువెలర్స్ షోరూం ప్రారంభం



**విశ్వంభర, సూర్యాపేట:** సరికొత్త మోడల్స్, అద్భుతమైన డిజైన్లతో నూతనంగా ఏర్పాటు చేసిన డైమండ్ జ్యువెలర్స్ షోరూంను సూర్యాపేట పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు ఆదరించాలని డైమండ్ జ్యువెలర్స్ ప్రొప్రైటర్లు తెడ్ల పురుషోత్తం, పోలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే సర్వీస్ రోడ్డులో సీఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన డైమండ్ జ్యువెలర్స్ గోల్డ్, డైమండ్స్, అండ్ సిల్వర్ ఆభరణాల షోరూంను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దపెద్ద నగరాలకు వెళ్లకుండా సూర్యాపేట పట్టణంలోనే సరికొత్త మోడల్స్, అద్భుతమైన డిజైన్లతో మన్నికైన ధరతో అందించేందుకు డైమండ్ జ్యువెలర్స్ ను ప్రారంభించినట్లు తెలిపారు. సూర్యాపేటలో మొట్ట మొదటిసారిగా బంగారు ఆభరణముల కొనుగోలుపై ఉచిత ఇన్సూరెన్స్ ను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. దీని వల్ల బంగారు ఆభరణాలకు ఊహించని నష్టం, దొంగతనం జరిగినప్పుడు మరింత భద్రత లభిస్తుందన్నారు. తమ షోరూమ్ నందు కొనుగోలు చేసిన ఆభరణాలకు అత్యాధునిక క్యారెట్ మీటర్ ద్వారా ప్యూరిటీ సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు చెప్పారు. బంగారు ఆభరణాల కొనుగోలు కలలను నిజం చేసేందుకు ప్రతినెల కొంత మొత్తం పొదుపు చేసేలా సేవింగ్స్ స్కీమ్ కూడా అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. డైమండ్ జ్యువెలరీస్ కు వినియోగదారుల నమ్మకమే అతిపెద్ద చిహ్నమని అన్నారు. డైమండ్ జ్యువెలర్స్ సేవలను అన్ని వర్గాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫరూఖ్, వనమా వెంకన్న, తెడ్ల ప్రభాకర్, అఖిల్, పవన్, ఉమా, రుక్మిణి, అనురాధ, పల్లవి, దివ్య, మమత తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ పాల్గొన్న ఎమ్మెల్సీ కోదండరాం

విశ్వంభర, హైదరాబాద్‌: జమ్ము కశ్మీర్ పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసనగా, అలాగే దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి సంతాపాన్ని తెలియజేస్తూ అఖిలపక్షం ఆధ్వర్యంలో శుక్రవారం పీపుల్స్ ప్లాజా నుంచి ఇందిరా గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన కొవ్వతుల ర్యాలీలో టి.జె.ఎస్ అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం పాల్గొన్నారు. ఆయనతో పాటు టి.జె.ఎస్ నాయకులు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.

## లక్ష్మీ నాథునికి పుష్పాలకరణ సేవ



**విశ్వంభర, సూర్యాపేట:** మున్సిపాలిటీ పరిధిలోని పిల్లలమర్రి శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో శుక్రవారం ఉదయం అర్చకులు ముడుంబై రఘువరన్ ఆచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి తదుపరి అష్టోత్తర శతనామావళి చేశారు. అర్చకుడు రఘువరన్ ఆచార్యులు మాట్లాడుతూ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు మరియు అలంకరణ నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని దర్శించి తరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి సభ్యులు మరియు భక్తులు పాల్గొన్నారు.

## నూతన వధువరులను ఆశీర్వదించిన సోయం వీరభద్రం



**విశ్వంభర, దమ్మపేట:** శుక్రవారం దమ్మపేట మండలం లింగాలపల్లి గ్రామం లో వుకే .వెంకటేశ్వర్లు -రత్తమ్మ దంపతుల కుమారుడు వుకే. నాగబాబు- ప్రతిమ పరిశుద్ధ వివాహానికి హాజరై నూతన వధువరులను ఆశీర్వదించి, వివాహ శుభాకాంక్షలు తెలియజేసిన అశ్వారావుపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోయం వీరభద్రం, వారి వెంటా సోయం బాలరాజు, సోయం వెంకన్న బాబులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వీరేశం ను కలిసిన కొత్తగూడెం గ్రామ నాయకులు



**విశ్వంభర, రామన్నపేట:** యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, కొత్తగూడెం తాజా మాజీ సర్పంచ్ చిల్లర కైలాసం, శంభాల వెంకటేష్ లు నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ను మర్యాదపూర్వకంగా కలిసి లక్ష్మాపురం నుండి కొత్తగూడెం కు గతంలో కోటి 5 లక్షల రూపాయలతో మంజూరు అయిన రోడ్డును త్వరగా పనులు ప్రారంభించుటకు, శంకుస్థాపన కోసం, గ్రామంలో ఇతర అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎమ్మెల్యేతో విన్నవించడం జరిగింది. త్వరలోనే సంబంధిత అధికారులతో మాట్లాడి తొందరగా పనులు ప్రారంభించుటకు ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది. లక్ష్మాపురం నుండి కొత్తగూడెం రోడ్డు శంకుస్థాపన జరుగుతున్నందుకు గ్రామం తరపున ఎమ్మెల్యేకి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

## వార్డెన్ అమ్మాయిల వీడియోలు తీస్తుందని విద్యార్థులు ఆందోళన

**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా ఔషాపూర్ లోని వి బి ఐ టి కళాశాలలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఈ మేరకు కళాశాలలో విద్యార్థులు శుక్రవారం ఆందోళనకు దిగారు. కాలేజీ క్యాంపస్ లో అమ్మాయిల వీడియోలు తీస్తోందని వార్డెన్ రూపపై ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేకాకుండా వీడియోలను మరో వార్డెన్ కు షేర్ చేసిందని విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే వార్డెన్ రూపపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు చేపట్టారు.

## ఘనంగా టీఎన్జీవోస్ నేత రాజ్ కుమార్ జన్మదిన వేడుకలు



**విశ్వంభర, బషీర్ బాగ్:** టీఎన్జీవోస్ యూనియన్ హైదరాబాద్ అసోసియేట్ ప్రెసిడెంట్, టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ అధ్యక్షుడు కె. ఆర్. రాజ్ కుమార్ పుట్టినరోజు వేడుకల సందర్భంగా కార్యక్రమాన్ని టీఎన్జీవోస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్మెంట్ హైదరాబాద్ కార్యదర్శి ఎం. భాస్కర్, ట్రెజరర్ ప్రేమ్, జాయింట్ సెక్రటరీ జయంతిరెడ్డి లు కేక్ కటింగ్ చేసి కేఆర్ రాజ్ కుమార్ ను గజమాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ జూపల్లి నర్సింగరావు, ఆర్గనైజేషన్ సెక్రటరీ ఫెర్రస్ అహ్మద్, రవి, ప్రియ, మోయిన్, ముజ్జాయిద్, రమేష్, శ్రీనివాసబాబు, యోగి, అజ్మత్, బషీర్, జేమ్స్, శ్రీధర్, మంజు, సిపిరెడ్డి, ఇమ్రాన్, మంజు, నర్సింహ, రాణి, ఫయాజ్, రేణుక, గిరిజ, శేషిరత్న, జాకీర్, హేమవతి, శ్రీకాంత్, పాల్గొన్నారు.

# మ్యాచ్ స్వరూపాన్నే మార్చి పడేసిన జోష్ హాజిల్‌వుడ్



ఐపీఎల్ 2025 42వ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడ్డాయి. దాదాపు రాజస్థాన్ గెలుపు ఖాయం అయిన మ్యాచ్ లో కీలక సమయంలో వికెట్లు కోల్పోయి రియాన్ పరాగ్ టీమ్ మ్యాచ్ ను కోల్పోయింది. ముందు బ్యాటింగ్ లో, ఆ తర్వాత కీలక సమయంలో సూపర్ బౌలింగ్ తో వికెట్లు పడగొట్టి ఆర్సీబీ 11 పరుగుల తేడాతో థ్రిల్లింగ్ విక్టరీ అందుకుంది. ఐపీఎల్ 2025 42వ మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రాజస్థాన్ రాయల్స్‌ను 11 పరుగుల తేడాతో ఓడించి ఆరో విజయాన్ని అందుకుంది. ఐపీఎల్2025లో తమ హోం గ్రౌండ్ లో ఆర్సీబీ తమ తొలి విజయాన్నినమోదుచేసింది. ఈ సీజన్‌లో చిన్నస్వామి స్టేడియంలో బెంగళూరుకు ఇది తొలి విజయం. మరోవైపు, రాజస్థాన్ వరుసగా 5 మ్యాచ్ లలో ఓడిపోయింది. చివరి ఓవర్లలో జోష్ హాజిల్‌వుడ్ అద్భుతంగా బౌలింగ్ చేసి వరుసగా వికెట్లు పడగొట్టి ఆర్సీబీకి విజయాన్ని అందించాడు. ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన రాజస్తాన్ కెప్టెన్ రియాన్ పరాగ్ బౌలింగ్ ఎంచుకున్నాడు. మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 205 పరుగుల భారీ స్కోరు చేసింది. లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రాజస్థాన్ బ్యాట్స్‌మెన్ 194 పరుగులు మాత్రమే చేయగలిగారు.మ్యాచ్‌ను మలుపు తిప్పిన జోష్ హాజిల్‌వుడ్ఆర్సీబీ ఉంచిన భారీ టార్గెట్ ఛేదించే క్రమంలో రాజస్థాన్ రాయల్స్ చివరి ఓవర్ వరకు పట్టుబిగించింది. మ్యాచ్‌లో బలమైన జట్టుగా కనిపించింది. కానీ చివరి ఓవర్లలో బ్యాటింగ్ వైఫల్యం కారణంగా వరుసగా వికెట్లు జారవిడుచుకుని మ్యాచ్ ను కోల్పోయింది. ముఖ్యంగా జోష్ హేజిల్‌వుడ్ వేసిన ఇన్నింగ్స్‌లోని 19వ ఓవర్ మ్యాచ్‌లో నిర్ణయాత్మకంగా నిలిచింది. ఆ ఓవర్‌లో జోష్ హాజిల్‌వుడ్ కేవలం ఒక పరుగు మాత్రమే ఇచ్చి ధ్రువ్ జురెల్ (47) పెద్ద వికెట్‌తో సహా రెండు వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో హాజిల్‌వుడ్ 4 వికెట్లు పడగొట్టాడు. కృనాల్ పాండ్యా రెండు వికెట్లు పడగొట్టగా, భువనేశ్వర్ కుమార్, యశ్ దయాల్ తలా ఒక వికెట్ తీసుకున్నారు.యశస్వి జైస్వాల్ తుఫాను ఇన్నింగ్స్ ఆడి రాజస్థాన్ కు గొప్ప ఆరంభాన్ని అందించాడు, కానీ మిడిల్ ఆర్డర్ దానిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. యశస్వి 19 బంతుల్లో 7 ఫోర్లు, మూడు సిక్సర్లతో 49 పరుగులు చేశాడు. నితీష్ రాణా (28), రియాన్ పరాగ్ (22), సిమ్రాన్ హెట్మె యర్ (11) భారీ స్కోర్లు చేయలేక పోయారు. 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 16 పరుగులు చేసి ఔటయ్యాడు.టాస్ ఓడిపోయి ముందుగా బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 200 పరుగుల మార్కును దాటడంలో విరాట్ కోహ్లీ, దేవ్‌దత్ పడిక్కల్ కీలక పాత్ర పోషించారు. కోహ్లీ 42 బంతుల్లో 70 పరుగులు సాధించగా, పాడిక్కల్ కూడా వేగంగా బ్యాటింగ్ చేసి కేవలం 27 బంతుల్లోనే 50 పరుగులు చేశాడు. కోహ్లీ ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, 2 సిక్సర్లు ఉన్నాయి. పాడిక్కల్ 185 స్ట్రైక్ రేట్‌తో 4 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు.చివరలో టిమ్ డేవిడ్ 23 పరుగులు, జితేష్ శర్మ 10 బంతుల్లో 20 పరుగులు సాధించారు. రాజస్థాన్ తరఫున సందీప్ శర్మ 2 వికెట్లు తీసిన అత్యంత విజయవంతమైన బౌలర్ గా నిలిచాడు. జోఫ్రా ఆర్చర్, వనిందు హసరంగా తలా ఒక వికెట్ తీసుకున్నారు

# రాజస్థాన్ రాయల్స్ పై ఆర్సీబీ థ్రిల్లింగ్ విక్టరీ



ఐపీఎల్ 2025లో రాజస్థాన్ రాయల్స్ వరుసగా గెలుపు ముంగిట బోల్తా పడుతోంది. ఆరంభం నుంచి అద్భుతంగా బ్యాటింగ్ చేసి విజయానికి సింగిల్ డిజిట్ పరుగులు అవసరమైన సమయంలో బోల్తా పడుతున్నారు. చివరి ఓవర్లలో లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్ చేతిలో వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిపోయిన రాజస్థాన్ రాయల్స్.. మరో మ్యాచ్ ను కూడా కోల్పోయింది. ఇప్పుడు ఆర్సీబీలో చేతిలో ఆర్ఆర్ 11 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఐపీఎల్ 2025 41వ మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ - రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్లు తలపడ్డాయి. ఆర్ఆర్ కెప్టెన్ రియాన్ పరాగ్ టాస్ గెలిచిన బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో మొదట బ్యాటింగ్ కు దిగింది ఆర్సీబీ. ఓపెనర్లు ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీలు మంచి ఆరంభం అందించారు.ఫిల్ సాల్ట్ 26 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన దేవదత్ పడిక్కలు అద్భుతమైన బ్యాటింగ్ తో హాఫ్ సెచరీ కొట్టాడు. తన ఇన్నింగ్స్ లో అతను 4 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు. విరాట్ కోహ్లీ 70 పరుగుల ఇన్నింగ్స్ లో 8 ఫోర్లు, 2 సిక్సర్లు బాదాడు. టిమ్ డేవిడ్ 23, జితేష్ శర్మ 20 పరుగులు చేయడంతో ఆర్సీబీ 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 205 పరుగులు చేసింది. 206 పరుగుల భారీ టార్గెట్ తో సెకండ్ బ్యాటింగ్ కు దిగిన రాజస్థాన్ కు ఓపెనర్లు యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీలు మంచి ఆరంభం అందించారు. 16 పరుగులు చేసి వైభవ్ అవుట్ అయ్యాడు. మరో ఎండ్ లో ఉన్న జైస్వాల్ సునామీ రేపాడు. సూపర్ బ్యాటింగ్ తో అదరగొట్టాడు. కేవలం 19 బంతుల్లోనే 49 పరుగులు తన ఇన్నింగ్స్ లో 7 ఫోర్లు, 3 సిక్సర్లు బాదాడు. నితీస్ రానా 28, రియాన్ పరాగ్ 22, ధ్రువ్ జురేల్ 47 పరుగులు ఇన్నింగ్స్ ఆడారు. ఆర్ఆర్ బ్యాటింగ్ సమయంలో 19 ఓవర్ బౌలింగ్ చేసిన జోస్ హాజిల్ వుడ్ వరుసగా రెండు వికెట్లు తీసుకుని మ్యాచ్ ను బెంగళూరు వైపు మార్చాడు. 18.3 బంతికి ధ్రువ్ జురేల్, 18.4 బంతికి జోఫ్రా ఆర్చర్ అవుట్ చేశాడు. 2 వికెట్లతో పాటు కేవలం 1 పరుగు మాత్రమే ఇచ్చి జోస్ హాజిల్ వుడ్ మ్యాచ్ ను మలుపు తిప్పాడు. ఆర్సీబీ అద్భుతమైన బౌలింగ్ తో ఆర్ఆర్ 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 194 పరుగులు మాత్రమే చేసింది. దీంతో 11 పరుగుల తేడాతో ఓడిపోయింది.

# మ్యూచువల్ ఫండ్‌ను కాలిక్యులేటర్‌తో ఎలా జత చేయాలి



నేటి ప్రపంచంలో పెట్టుబడి పెట్టడం సంక్లిష్టతతో కూడుకున్నది.. మన పెట్టుబడులపై స్పష్టత ఉండాల్సిన అవసరం ఉంది. మీ ఆర్థిక నిర్ణయాలకు మార్గనిర్దేశం చేయడానికి మరిన్ని సాధనాలు అందుబాటులో ఉన్నందున మీ సంపదను పెంచుకోవడానికి మీరు ఇకపై ఆర్థిక నిపుణుడిగా ఉండవలసిన అవసరం లేదు. రోజువారీ పెట్టుబడిదారులకు అత్యంత శక్తివంతమైన మరియు అందుబాటులో ఉండే ఎంపికలలో ఒకటి మ్యూచువల్ ఫండ్. దీన్ని డిజిటల్ ఎంఎఫ్ కాలిక్యులేటర్‌తో పాటు ఉపయోగించినప్పుడు ఈ పెట్టుబడి మీ ఆర్థిక లక్ష్యాలను ప్లాన్ చేయడంలో, కట్టుబడి ఉండటంలో మరియు ట్రాక్‌లో చేయడంలో మీకు సహాయపడుతుంది. మీరు ఇంటి కోసం పొదుపు చేస్తున్నా, పదవీ విరమణ నిధిని నిర్మిస్తున్నా, లేదా మీ పిల్లల విద్యను ప్లాన్ చేస్తున్నా, మ్యూచువల్ ఫండ్‌లు ఎలా పనిచేస్తాయో అర్థం చేసుకోవాలి. సంభావ్య రాబడిని ఎలా లెక్కించాలో తెలుసుకుంటే మీరు ఆర్థిక స్వాతంత్ర్యానికి ఒక అడుగు దగ్గరగా తీసుకెళ్లవచ్చు.మ్యూచువల్ ఫండ్‌లను అర్థం చేసుకోండిమ్యూచువల్ ఫండ్ అనేది వివిధ పెట్టుబడిదారుల నుండి సేకరించిన వృత్తిపరంగా నిర్వహించబడే డబ్బు సమూహం. నిర్వాహకులు ఈ నిధులను స్టాక్‌లు, బాండ్‌లు లేదా డబ్బు మార్కెట్ సాధనాలు వంటి వివిధ ఆస్తులలో పెట్టుబడి పెడతాడు, ఇది ఫండ్ యొక్క లక్ష్యాన్ని బట్టి ఉంటుంది.ఎంఎఫ్ కాలిక్యులేటర్ అనేది పెట్టుబడిదారులు తమ పెట్టుబడి కాలక్రమేణా ఎంత పెరుగుతుందో అంచనా వేయడానికి సహాయపడే సరళమైన, ప్రభావవంతమైన సాధనం. ఇది మీ ప్రణాళిక ప్రక్రియకు స్పష్టత మరియు నిర్మాణాన్ని తెస్తుంది.సాధారణంగా రెండు రకాల మ్యూచువల్ ఫండ్ కాలిక్యులేటర్లు ఉన్నాయి:1. కాలిక్యులేటర్‌మీరు స్థిర మొత్తాన్ని (నెలవారీగా) క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టాలని ప్లాన్ చేసినప్పుడు ఉపయోగించబడుతుంది. ఇచ్చిన రాబడి రేటు ఆధారంగా, ఒక నిర్దిష్ట వ్యవధి ముగింపులో మీ పెట్టుబడి యొక్క అంచనా విలువను ఇది మీకు చూపుతుంది.2. లంప్సమ్ కాలిక్యులేటర్‌మీరు ఒకేసారి మొత్తాన్ని పెట్టుబడి పెట్టినప్పుడు ఉపయోగించబడుతుంది. ఎంచుకున్న వ్యవధిలో మీ పెట్టుబడి యొక్క భవిష్యత్తు విలువను ఇది మీకు చూపుతుంది. ముఖ్యంగా ఎంఎఫ్ కాలిక్యులేటర్లు మీకు విశ్వాసాన్ని ఇస్తాయి. ఊహించడం లేదా ఆశించడం కంటే మీరు స్పష్టమైన ప్రణాళికతో పెట్టుబడి పెడుతున్నారు. ఉదాహరణకు ప్రియ కుమార్తె కళాశాల విద్యకు నిధులు సమకూర్చడానికి 8 సంవత్సరాలలో రూ.10 లక్షలు సేకరించాలనుకుంటున్నారని అనుకుందాం. నెలకు ఎంత పెట్టుబడి పెట్టాలో ఆమెకు తెలియదు. మ్యూచువల్ ఫండ్ ప్లాట్‌ఫామ్‌ను సందర్శించి కాలిక్యులేటర్‌ను ఉపయోగించారంటే పూర్తి వివరాలు తెలుస్తాయి. ఆ ఒక్క ఇన్‌పుట్‌తో ప్రియకు ఇప్పుడు ఒక రోడ్‌మ్యాప్ ఉంది. ఆమె తన లక్ష్యాన్ని చేరుకోవడానికి ట్రాక్‌లో ఉందని తెలుసుకుని స్పష్టత ఉండవచ్చు.

# ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలనుకునే యువతకు వంశీ జీవితం నిజమైన స్ఫూర్తి



తూర్పు గోదావరి జిల్లాలోని మారుమూల గ్రామం సామాన్య కుటుంబంలో జన్మించిన వంశీ అందుకూరి జీవితం, కష్టాలను ఎదుర్కొంటూ కలల్ని సాకారం చేసుకున్న ఓ స్ఫూర్తిదాయక ప్రయాణం. ఆర్థిక సమస్యలు ఎదురైనా, విశాఖపట్నం, హైదరాబాద్‌లో విద్యను పూర్తిచేసిన వంశీ, మొబైల్ యాప్ టెస్టింగ్‌తో కెరీర్‌ను ప్రారంభించాడు. తరువాత వెబ్, మొబైల్ డెవలప్‌మెంట్‌లో నైపుణ్యం పెంచుకుని, తన కలలను నిజం చేసుకోవాలని నిర్ణయించుకుని వ్యాపార రంగంలోకి అడుగుపెట్టాడు. ఈ రోజు సాంకేతికత, మీడియా, ఆటోమోటివ్ రంగాల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందిన వంశీ, యువతకు ప్రేరణగా నిలుస్తున్నాడు.టెక్ వరల్డ్‌లో ట్రెండ్‌సెట్టర్ వన్‌సీ టెక్నాలజీస్:2018లో తన స్వంత సాఫ్ట్‌వేర్ కంపెనీని ప్రారంభించిన వంశీ, తన విజన్‌ను మరింత విస్తృతం చేస్తూ 2021లో దాన్ని వన్‌సీ టెక్నాలజీస్‌గా మళ్ళీ బ్రాండింగ్ చేశాడు. తక్కువ సమయంలోనే ఈ సంస్థ అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, ప్రస్తుతం దుబాయ్, మలేషియా, థాయ్‌లాండ్, కంబోడియా, యూరప్, కెనడా, అమెరికా తదితర దేశాల్లో సేవలు అందిస్తూ.. 48కు పైగా ప్రముఖ సంస్థలకు సర్వర్ సర్వీసులు ఇస్తోంది. టెక్ రంగంలో భారత యువత ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పిన వంశీ, యువ టెక్ లీడర్‌గా గుర్తింపు పొందాడు.బ్రాండ్‌లకు గ్లోబల్ గ్లామర్ వన్‌సీ మీడియా:వంశీకి బ్రాండ్‌లను జనాలకు చేరువ చేయడంలో ఉన్న టాలెంట్ గురించి తెలిసే వన్‌సీ మీడియాని స్టార్ట్ చేశాడు. ఈ కంపెనీ ప్రపంచవ్యాప్తంగా జరిపిన ఈవెంట్స్‌తో అందరి చూపును తనవైపు తిప్పుకుంది:ఈ ఈవెంట్స్ ద్వారా వన్‌సీ మీడియా, బ్రాండ్‌లను ఆకర్షణీయంగా చూపడంలో, జనాలతో కనెక్ట్ అవడంలో కొత్త ఒరవడిని సెట్ చేసింది. వంశీ ఈ రంగంలో తన క్రియేటివిటీని అద్భుతంగా చూపించాడు.కార్లకు స్టైల్ రివల్యూషన్ ఏక్సిల్ ఏస్తటిక్స్:చిన్ననాటి నుంచే స్పీడ్ కార్లపై ఆసక్తితో ఉన్న వంశీ, తన ప్యాషన్‌ని వ్యాపారంగా మలిచే దిశగా అడుగులు వేశాడు. హైదరాబాదులో ప్రారంభించిన "ఏక్సిల్ ఎస్తెటిక్స్" కంపెనీ, కారు మోడిఫికేషన్ రంగంలో ప్రత్యేక స్థానం సంపాదించుకుంటోంది. ప్రస్తుతం భారతదేశంతో పాటు దుబాయ్, యూరప్, అమెరికా మార్కెట్లలో విస్తరించేందుకు వ్యూహాత్మక ప్రణాళికలు రూపొందిస్తోంది.ఏక్సిల్ ఎస్తెటిక్స్ ప్రత్యేకతలలో అడ్వాన్స్‌డ్ సస్పెన్షన్ సిస్టమ్స్, షాక్‌ప్రూఫ్ బంపర్స్, లగ్జరీ ఇంటీరియర్స్, ఆల్-టెరైన్ వెహికల్ మేకోవర్స్ వంటి హైఎండ్ కస్టమైజేషన్లు ఉన్నాయి. వంశీ తన ఇంజినీరింగ్ నైపుణ్యాన్ని స్టైలిష్ డిజైన్‌తో మిళితం చేసి, కార్ మోడిఫికేషన్ రంగంలో కొత్త ట్రెండ్‌కి ఆవిష్కర్తగా నిలిచాడు. ప్యాషన్‌ను ప్రొఫెషన్‌గా మార్చిన వంశీ, యూత్‌కి ప్రేరణగా మారుతున్నాడు. మహిళలకు అండగా "యూనిటీ డ్రైవ్" మిషన్:వ్యాపార విజయాల్లో ముందున్న వంశీ సమాజానికి సేవ చేయాలన్న ఆలోచనతో "యూనిటీ డ్రైవ్" అనే రోడ్‌షోను ప్రారంభించాడు. ఏక్సిల్ ఎస్తెటిక్స్, వన్‌సీ మీడియా సంస్థలతో కలిసి నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం, మహిళలను శక్తివంతంగా తీర్చిదిద్దే దిశగా కృషి చేస్తోంది. మహిళల్లోని ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించడం ద్వారా వారి సత్తాను ప్రపంచానికి చాటి చెబుతుందనే లక్ష్యంతో ఇది ముందుకెళ్తోంది. చదువు, మెంటార్షిప్, ఆర్థిక స్వాతంత్ర్యానికి అవసరమైన అవకాశాలు కల్పించడంలో కూడా ఇది విశేషంగా దృష్టి సారిస్తోంది.వర్క్‌షాపులు, అవగాహన కార్యక్రమాల ద్వారా మహిళల్లో ఆత్మవిశ్వాసం పెంచే దిశగా యూనిటీ డ్రైవ్ కొనసాగుతోంది. ఈ ఆవిష్కరణాత్మక సామాజిక ప్రయత్నం ద్వారా వంశీ కేవలం వ్యాపార విజేతగానే కాకుండా, సమాజాన్ని దిశానిర్దేశం చేసే నాయకుడిగా కూడా నిలుస్తున్నాడు. ఈ ప్రయాణం ఇప్పుడు యువతకు మాత్రమే కాదు, సామాజిక మార్పు కోరుకునే ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిగా మారుతోంది.యువతకు స్ఫూర్తిగా వంశీ విజయం:ఒక చిన్న గ్రామం నుంచి ప్రపంచ స్థాయికి ఎదిగిన వంశీ అందుకూరి జర్నీ, యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది. వన్‌సీ టెక్నాలజీస్ ద్వారా టెక్ రంగంలో వినూత్న ఆవిష్కరణలు, వన్‌సీ మీడియా ద్వారా బ్రాండింగ్‌లో నూతన దిశ, ఏక్సిల్ ఎస్తెటిక్స్‌తో కార్ల డిజైన్‌లో స్టైల్‌కు కొత్త రూపు ఇచ్చాడు.

## 78 వేల ఏళ్లయినా కశ్మీర్ లో మి.మీ. కూడా కదల్చలేరు



క్రికెట్ కెరీర్ లో ఎందరో పాకిస్థానీ బౌలర్లను చీల్చి చెండాడిన దిగ్గజ బ్యాట్స్ మన్ సునీల్ గావస్కర్.. పహల్గాం ఘటన మీద ఉగ్రవాదులను చెడుగుడు ఆడారు.పహల్గాం.. పహల్గాం.. పహల్గాం.. నాలుగు రోజుల నుంచి ఒకటే చర్చ.. వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందేందుకు కశ్మీర్ లోని ఈ ప్రాంతానికి వెళ్లిన పర్యటకులపై ఉగ్రవాదులు జరిపిన దారుణ మారణకాండతో భారత దేశం రగిలిపోతోంది.. ఏకంగా 26 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోవడంతో దేశమంతా ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి.. దీనికి ప్రతీకారం ఎప్పుడా? అని ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే ఐపీఎల్ మ్యాచ్ లకు కామెంటేటర్ గా వ్యవహరిస్తున్న భారత దిగ్గజ బ్యాట్స్ మన్ సునీల్ గావస్కర్ ఘాటుగా స్పందించారు.వేదిక ఏదైనా.. ప్రదేశం ఎక్కడైనా సరే.. భారత దేశ ప్రయోజనాల గురించి గొంతు ఎత్తే సునీల్ గావస్కర్ పహల్గాం ఘటనపైనా తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం బెంగళూరు చిన్నస్వామి మైదానంలో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు, రాజస్థాన్ రాయల్స్ మ్యాచ్ అనంతరం కామెంటేటర్ గా ఉన్న గావస్కర్ స్పందించారు.భారత్ కు స్వాతంత్ర్యం వచ్చిన 78 ఏళ్ల నుంచి ఉగ్రవాదులు, వారికి మద్దతు ఇస్తున్నవారు అంగుళం కూడా కదలించలేకపోయారని గావస్కర్ అన్నారు. ముందుముందు కూడా ఇదే పరిస్థితి ఉంటుందని పరోక్షంగా పాకిస్థాన్ కు చురకలు వేశారు.పహల్గాం ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయినవారికి గావస్కర్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. భారతీయులను కలచి వేసిన ఈ ఘటన నేపథ్యంలో.. ఉగ్రవాదులు, వారికి మద్దతుగా నిలిచేవారికి గావస్కర్ ఒక ప్రశ్న వేశారు. ఏం సాధించడానికి ఇదంతా? 78 ఏళ్లలో మిల్లీ మీటర్ భూమినైనా కదల్చలేని మీరు.. మరో 78 వేల సంవత్సరాల తర్వాతైనా ఏమీ చేయలేరని వ్యాఖ్యానించారు.

## ఐపీఎల్-18 10వ ప్లేస్ కోసం ఆ 2 జట్ల మ్యాచ్..



ఒక జట్టు ఐదుసార్లు చాంపియన్.. ఐదుసార్లు రన్నరప్.. ఒక జట్టు రెండుసార్లు చాంపియన్.. ప్రస్తుతం రన్నరప్.. మరి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ప్రస్తుత సీజన్ లో ఈ రెండు జట్ల మధ్య మ్యాచ్ అంటే ఎలా ఉంటుంది..? కనీసం వీటిలో ప్లేఆఫ్స్ చేరేది ఎవరు? అనే చర్చ నడుస్తుంది.. కానీ, దీనికి పూర్తి భిన్నమైన వాతావరణం నెలకొంది.ఐపీఎల్ ప్లే ఆఫ్స్ కు చేరేది ఎవరో ప్రస్తుతం ఓ అంచనా వచ్చేసింది. 14 మ్యాచ్ లకు గాను కనీసం 8 మ్యాచ్ లు గెలిచిన జట్లు ప్లే ఆఫ్స్ కు వెళ్తాయి. ఈ లెక్కన ప్రస్తుతం గుజరాత్ టైటాన్స్, ఢిల్లీ క్యాపిటల్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ).. 8 మ్యాచ్ లకు గాను ఆరు విజయాలు సాధించి 12 పాయింట్లతో ఉన్నాయి. ఈ మూడు జట్లు 6 మ్యాచ్ లలో కనీసం రెండు గెలిచినా చాలు ప్లేఆఫ్స్ నకు వెళ్లడం ఖాయం.

ఐదుసార్లు చాంపియన్ అయిన చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే), రెండుసార్లు టైటిల్ కొట్టిన సన్ రైజర్స్ (ఎస్ఆర్ హెచ్) మాత్రం ఈసారి లీగ్ లో దారుణ ప్రదర్శన కనబరుస్తున్నాయి. 8 మ్యాచ్ లకు కేవలం రెండు మ్యాచ్ లు మాత్రమే గెలిచాయి. నాలుగు పాయింట్లతో ఉన్నాయి.

తాజాగా ముంబై చేతిలో పరాజయం పాలైన ఈ రెండు జట్లు శుక్రవారం చెన్నైలోని చెపాక్ మైదానంలో తలపడనున్నాయి. పాయింట్ల పట్టికలో చెన్నై -1.392 అట్టడుగున ఉండగా.. సన్ రైజర్స్ 9వ స్థానంలో (రన్ రేట్ -1.361) ఉంది.

ఏ జట్టు గెలిచినా ఉపయోగం లేదు.. పాయింట్లతో ఒరిగేదేమీ లేదు.. బహుశా ప్రస్తుత ఐపీఎల్ లో అత్యంత అనాసక్తికర మ్యాచ్ ఇదేనేమో? దీన్నిబట్టే ఓ నెటిజన్.. "కప్ కోసం పోటాపోటీగా ఆడే జట్లను చూసుంటారు. ఈ రోజు 10వ స్థానం కోసం హోరాహోరీగా తలపడే టీమ్స్ ను చూస్తున్నాం" అంటూ ట్వీట్ చేశాడు.

## మీరు ఇలా ఐటీఆర్ దాఖలు చేస్తున్నారా




మీరు పాత పన్ను విధానంలో ఆదాయపు పన్ను రిటర్న్ (ఐటీఆర్) దాఖలు చేస్తుంటే, పన్ను వాపసును తప్పుగా క్లెయిమ్ చేస్తుంటే జాగ్రత్తగా ఉండండి. ఎందుకంటే దీనిపై ఆదాయపు పన్ను శాఖ కఠిన చర్యలు తీసుకోబోతోంది. ఇలాంటి మోసాలను గుర్తించేందుకు %ూ×% టెక్నాలజీ సహాయం తీసుకుంటున్నారు. ఆదాయపు పన్ను శాఖ ప్రకారం.. అలా చేయడం చట్టవిరుద్ధం మాత్రమే కాదు, 200 శాతం వరకు జరిమానా, వడ్డీ, జైలు శిక్ష కూడా విధించవచ్చు.పాత పన్ను విధానంలో తప్పుడు తగ్గింపులు లేదా మినహాయింపులను చూపడం ద్వారా కొంతమంది జీతాలు పొందే ఉద్యోగులు వాపసులను క్లెయిమ్ చేస్తున్నారని ఆదాయపు పన్ను శాఖ ఇటీవల ఒక అవగాహన బుక్‌లెట్‌లో పేర్కొంది. ఇది టీడీఎస్ తర్వాత కూడా జరుగుతోంది, అయితే దాని డాక్యుమెంటరీ రుజువు అందుబాటులో లేదు.ఫారమ్ 12 ని బాధ్యతాయుతంగా పూరించండి:పాత పన్ను విధానంలో యజమాని ఫారం 12 ద్వారా ఉద్యోగి నుండి తగ్గింపులు, మినహాయింపులపై సమాచారాన్ని పొందవలసి ఉండేది. దీనితో పాటు అవసరమైన అన్ని పత్రాలను సమర్పించడం కూడా తప్పనిసరి. దీని ఆధారంగా యజమాని తగ్గిస్తాడు.

## పవర్‌ఫుల్ బ్యాటరీ, అద్భుతమైన కెమెరాతో రియల్‌మీ



ప్రస్తుతం టెక్ ప్రపంచంలో బడ్జెట్ ఫోన్‌ల యుగం నడుస్తోంది. కొన్ని రోజుల క్రితం మోటరోలా మార్కెట్లో గొప్ప ఫీచర్లతో కూడిన బడ్జెట్ ఫోన్‌ను విడుదల చేసింది. ఈ ఎపిసోడ్‌లో ఇప్పుడు రియల్‌మే తన తాజా బడ్జెట్ స్మార్ట్‌ఫోన్ రియల్‌మే 14 భారతదేశంలో విడుదల చేసింది. ఇది పెద్ద 6000 బ్యాటరీ, 50-మెగాపిక్సెల్ ప్రైమరీ కెమెరా, 6.67-అంగుళాల కలిగి ఉంది. ఇలాంటి అనేక ఫీచర్లు జోడించారు. దాని ధర మార్కెట్లో లభ్యత తేదీ, అన్ని ఫీచర్స్ గురించి తెలుసుకుందాం. భారతదేశంలో రెండు స్టోరేజ్ వేరియంట్‌లతో ప్రారంభించింది. 8 వేరియంట్ ధర రూ.17,999 కాగా, హై-ఎండ్ మోడల్ ధర రూ.19,999. దీనితో పాటు స్మార్ట్‌ఫోన్ మూడు కలర్స్‌లో అందుబాటులో ఉన్నాయి.

## మీ జీమెయిల్‌పై హ్యాకర్ల దృష్టి యూజర్లకు గూగుల్ కీలక హెచ్చరిక




జీమెయిల్ లోని కొన్ని సాంకేతిక లోపాలను క్యాష్ చేసుకున్న సైబర్ నేరగాళ్లు దాడులకు పాల్పడినట్లు తాము గుర్తించినట్లు పేర్కొంది. గూగుల్ ఫోన్ కాల్స్, ఫాలో అప్ ఈ-మెయిల్స్ మీరు గుర్తించలేని విధంగా వారు ఏఐ సాయంతో పంపిస్తున్నారని, వినియో గదారులు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిషింగ్ లింక్ లపై క్లిక్ చేయొద్దని హెచ్చరించింది. జీమెయిల్ పై సైబర్ దాడిని గుర్తించిన గూగుల్ వెంటనే సెక్యూరిటీ అప్ డేట్ ను రిలీజ్ చేసింది. వెంటనే జీమెయిల్ యూజర్లు తమ పాస్ వర్డ్ లను వాడటం మానేయాలని సూచించింది. పాస్ వర్డ్ ఛేంజ్ చేసుకోవాలని సూచించింది.స్కామ్ ఏంటంటే..?కొన్ని ఆన్ లైన్ రిపోర్టుల ప్రకారం సైబర్ నేరగాళ్లు జీమెయిల్ అకౌంట్లను హ్యాక్ చేసి, పాస్ వర్డ్ లను, పాస్ వర్డ్ రికవరీ ఆప్షన్లను మార్చేస్తున్నారు. అందుకే ఎట్టి పరిస్థితుల్లోనూ డేంజరస్ లింక్ లపై క్లిక్ చేయొద్దని గూగుల్ హెచ్చరించింది. అయితే ఒకవేళ మీ పాస్ వర్డ్ మారిపోయినా.. రికవరీ ఫోన్ నంబర్ లేదా.. రికవరీ ఈ-మెయిల్ ద్వారా దానిని సెట్ అప్ చేయొచ్చని సూచించింది.ఎలా బయటపడిందంటే..ఈ సైబర్ దాడి ముందుగా ఈ డెవలపర్ పై జరిగింది. తన అకౌంట్ కు లీగల్ నోటీసు జారీ అయ్యిందని పేర్కొంటూ గూగుల్ నుంచి ఈ మెయిల్ వచ్చిందని, ఆ

# జూనియర్ ఎన్టీఆర్, ప్రశాంత్ నీల్ సినిమా షూటింగ్, సముద్ర తీరం, కొండల నడుమ కుమ్టాలో భారీ సెట్టింగ్

ప్రశాంత్ నీల్, జూ. ఎన్టీఆర్ కాంబినేషన్ మూవీకి, షూటింగ్ లొకేషన్ దొరికింది. కర్నాటకలోని కుమ్టా ధారేశ్వర సమీపంలోని రామనగిండి సముద్ర తీరంలో వారు స్టే చేశారు. ఈ ఇద్దరి కాంబినేషన్ లో రాబోతున్న పాన్ ఇండియా సిన్మకు 'డ్రాగన్' అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారు. ఈ భారీ బడ్జెట్ పాన్ వరల్డ్ సినిమా షూటింగ్ ఉత్తర కన్నడ సముద్ర తీరంలో జరుగుతోంది. నిర్మానుష్యంగా ఉన్న రామనగిండి సముద్ర తీరంలో ఈ సినిమా కోసం భారీ సెట్ నిర్మించారు. పెద్ద తుపాకులు, ఇల్లు, హెలికాప్టర్, రైలు సెట్లు వేశారు. ప్రతిరోజూ ఉదయం 7 నుండి సాయంత్రం 6 గంటల వరకు నిరంతరంగా షూటింగ్ జరుగుతోంది. ఇంకా చాలా రోజులు ఇక్కడ షూటింగ్ జరుగుతుందని తెలుస్తోంది. ఎన్నో ప్రదేశాలు వెతికిన తర్వాత ప్రశాంత్ నీల్ బృందానికి కుమ్టా ధారేశ్వర రామనగిండి బాగా నచ్చింది.






విశాలమైన సముద్ర తీరం, పక్కనే పచ్చని కొండలు, జనసందోహం లేని ప్రశాంతమైన ప్రదేశం ఇది. ఈ కొండ కిందనే ఇప్పుడు భారీ సెట్ వేశారు. సుమారు ఒక నెల నుండి ఇక్కడ సెట్ వేసే పని జరుగుతోంది. ఇప్పుడు షూటింగ్ సూపర్ ఫాస్ట్ గా చేస్తున్నారు టీమ్. ఇక ఈసినిమాకు సంబంధించిన క్లైమాక్స్ సీన్ తో పాటు రెండు పాటల షూటింగ్ కూడా ఇక్కడే జరుగుతుందని సమాచారం. ఈ సినిమా కోసం జూనియర్ ఎన్టీఆర్ గత ఐదు నెలల్లో 18 కిలోల బరువు తగ్గి పాత్రకు సిద్ధమయ్యారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాను వచ్చే ఏడాది మిడ్ వరకూ రిలీజ్ చేసేలా ప్లాన్ చేస్తున్నట్టు తెలుస్తోంది.

## ప్రియదర్శి 'సారంగపాణి జాతకం' మూవీ రివ్యూ, రేటింగ్



యంగ్ హీరో ప్రియదర్శి నటించిన లేటెస్ట్ మూవీ 'సారంగపాణి జాతకం'. కమెడియన్ గా కెరీర్ ప్రారంభించిన ప్రియదర్శి ప్రస్తుతం టాలీవుడ్ లో బిజీ హీరోగా మారిపోయారు. నెలన్నర వ్యవధిలో ప్రియదర్శి నుంచి వస్తున్న రెండవ చిత్రం సారం గపాణి జాతకం. మార్చిలో ప్రియదర్శి కోర్ట్ చిత్రంలో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు. దీనితో సారంగపాణి జాతకం చిత్రంపై మంచి అంచనాలు ఉన్నాయి. మోహన్ కృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో ప్రియదర్శికి జోడిగా రూప కొడువాయుర్ నటించారు. వెన్నెల కిషోర్, శ్రీనివాస్ అవసరాల, వైవా హర్ష, తనికెళ్ళ భరణి లాంటి నటులు కీలక పాత్రల్లో నటించారు. ఈ చిత్రంలో ప్రియదర్శి జాతకాల పిచ్చి ఉండే యువకుడిగా నటించారు. వినోదం ప్రధానంగా రూపొందిన ఈ చిత్రం నేడు ఏప్రిల్ 25న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సారంగపాణి జాతకం చిత్రం ప్రేక్షకులని మెప్పించే విధంగా ఉందా, ఎంతమేరకు నవ్వించగలిగారు లాంటి విషయాలు రివ్యూలో తెలుసుకుందాం. సారంగపాణి(ప్రియదర్శి) కార్ సేల్స్ మ్యాన్ గా పనిచేస్తుంటాడు. అతడికి మైథిలి (రూప కొడువాయుర్) అనే అమ్మాయి మేనేజర్ గా ఉంటారు. మైథిలి అంటే సారంగపాణికి ప్రేమ ఉంటుంది. ఆమె ప్రాక్టికల్ గా, లాజికల్ గా ఉండే అమ్మాయి. సారంగపాణికి మాత్రం జాతకాలంటే పిచ్చి ఉంటుంది. మైథిలి కూడా సారంగపాణిని ప్రేమిస్తుంది. దీనితో ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అవుతారు. నిశ్చితార్థం జరుగుతుంది.

## కశ్మీర్‌లో సినిమా షూటింగ్‌లు రద్దు..

### ఆ అందాలు ఇప్పట్లో చూడటం కష్టమే



జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఘోరమైన ఉగ్రవాద దాడిలో 26 మంది పర్యాటకులు మరణించారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు. ఘటనపై దేశంలోని ప్రతి పౌరుడు, కేంద్ర ప్రభుత్వం కూడా ఎంతో ఆవేదన వ్యక్తం చేసింది. ప్రస్తుతం కశ్మీర్‌లో ఆర్మీ వర్సెస్ తీవ్రవాదులు అన్నట్లు మారిపోయింది. ఈ దాడులు ఇప్పట్లో ఆగేలా కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో సినిమా షూటింగ్‌ల కోసం ఇప్పటికే ప్లాన్ చేసుకున్న దర్శకులు, నిర్మాతలు వారి ప్లాన్‌ను మార్చేసుకున్నారు. కశ్మీర్‌లోని లోయలు అక్కడి సహజ సిద్ద అందాలు అందరినీ ఆకర్షిస్తాయి. ఈ నేపథ్యంలో పెద్దఎత్తున సినిమా షూటింగ్‌లు అక్కడ జరుగుతుంటాయి. ఈ సమ్మర్ రెండు నెలలుపాటు నిరివిరామంగా పలు సినిమాల షూగింగ్‌లు జరిపించేలా పలువురు నిర్మాతలు ప్లాన్ చేశారు. ఇక తాజాగా ఉగ్రవాదుల దాడి నేపథ్యంలో వాటిని పూర్తిగా రద్దు చేసుకున్నారు. ఇప్పటికే జమ్మూకశ్మీర్ నుంచి సుమారు 3వేల మంది పర్యాటకులు వారి ఇళ్లకు చేరుకున్నారు. చాలా మంది వెళ్లాలనుకున్న వారు తమ ప్రయాణాలను రద్దు చేసుకున్నారు. టాలీవుడ్ విషయంలో కూడా ఇదే పరిస్థితి, రాబోయే రెండు నెలలపాటు కాశ్మీర్‌లో జరగాల్సిన షూటింగులు రద్దు చేసుకున్నారు. పహల్గామ్, సమీపంలోని ప్రాంతాలలో కొన్ని సినిమాలకు షూటింగ్‌లు ప్లాన్ చేసుకోవగా.. కానీ ఉగ్రవాద దాడి నేపథ్యంలో వాటిని పూర్తి రద్దు చేసుకున్నారు. తెలుగు ఇండస్ట్రీకి చెందిన ఓ బడా హీరో సినిమా కూడా జమ్మూ కశ్మీర్‌లో చిత్రీకరించాల్సి ఉండగా..

# సాయి పల్లవి పై భారీగా ట్రోలింగ్, పహల్గాం ఉగ్రదాడిపై హీరోయిన్ ట్వీట్, మండిపడుతున్న నెటిజన్లు

కాశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిపై హీరోయిన్ సాయి పల్లవి చేసిన ట్వీట్ పెద్ద దుమారం రేపింది. నెటిజన్లుపెద్ద ఎత్తున సాయి పల్లవిపై విమర్శలు చేస్తున్నారు. ఇంతకీ ఆమె ఏం ట్వీట్ చేసింది. ? ఎందుకు విమర్శలు వస్తున్నాయి.? ట్వీట్‌లో ఆమె, 'పహల్గాం దాడి బాధ, భయం నాకు బాధ కలిగించింది. చరిత్రలో జరిగిన దారుణాల గురించి తెలిసినా, ఇలాంటి అమానుష చర్యలు చూస్తుంటే ఏమీ మారలేదనిపిస్తుంది. ఆ మృగసమూహం (ఉగ్రవాదులు) మిగిలిన చిన్న ఆశను కూడా నాశనం చేసింది' అని పేర్కొన్నారు. ట్వీట్‌ను కొందరు నెటిజన్లు ప్రశంసించగా, మరికొందరు ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలను గుర్తు చేస్తూ విమర్శించారు. సోషల్ మీడియాలో సాయి పల్లవిపై వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ ఘటన ఆమె సామాజిక బాధ్యతపై చర్చను లేవనెత్తింది. తన అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఆమెకు ఉన్నప్పటికీ, బహిరంగంగా మాట్లాడేటప్పుడు పర్యవసానాల గురించి ఆలోచించాలని కొందరు అభిప్రాయపడ్డారు. గతంలో కాశ్మీరీ పండిట్ల హత్యలను, పశువుల అక్రమ రవాణాదారుల హత్యలను పోల్చినందుకు సాయి పల్లవి విమర్శలను ఎదుర్కొంది. తన



వ్యాఖ్యలకు వివరణ ఇస్తూ, 'మతం పేరుతో జరిగే ఏ హింసనైనా నేను ఖండిస్తున్నాను. హింస ఏ రూపంలోనైనా తప్పు' అని ఆమె చెప్పింది. 2022లో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో, 'పాకిస్థాన్‌లోని ప్రజలు మన సైన్యాన్ని ఉగ్రవాద సంస్థగా భావిస్తారు. కానీ మన దృష్టిలో వారే ఉగ్రవాదులు. కాబట్టి, దృక్కోణం మారుతుంది. మనం హింసను అర్థం చేసుకోలేదు' అని ఆమె వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలకు దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. శత్రు దేశ సైన్యంపై దయ చూపకూడదని, వారు మన దేశ శత్రువులని చాలామంది సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు. ఇప్పుడు, కాశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడిని సాయి పల్లవి తీవ్రంగా ఖండించి, మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఆమె గత వ్యాఖ్యలను గుర్తుచేసుకుంటూ అనే హ్యాష్‌ట్యాగ్‌ను ట్రెండ్ చేస్తున్నారు. దీంతో ఆమె భవిష్యత్ సినిమాలపై ప్రభావం పడుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది.

# తినడానికి తిండి లేక పస్తులున్నా, జబర్దస్త్ చమ్మక్ చంద్ర నవ్వుల వెనుక విషాద కథ

బుల్లితెరపై చిన్నస్థాయి నుంచి స్టార్ కమెడియన్ గా పేరు తెచ్చుకున్నాడు చమ్మకు చంద్ర. ప్రస్తుతం వరుస అవకాశాలతో హాస్య నటుడిగా బిజీ అయిపోయాడు చమ్మక్ చంద్ర, జబర్దస్త్'తో పాపులర్ అయిన చంద్ర.. ప్రస్తుతం కంప్లీట్ గా సినిమాలపైనే ఫోకస్ పెడుతూ వచ్చాడు. అయితే చంద్ర ఈ స్థాయికి రావడానికి చాలా కష్టాలు పడ్డాడు, ఎన్నో ఇబ్బందులు ఫేస్ చేశాడు. రీసెంట్ గా చంద్ర ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ, తన కెరియర్ కి సంబంధించిన అనేక విషయాలను గురించి ప్రస్తావించాడు. చంద్రా మాట్లాడుతూ..మాది చాలా పేద కుటుంబం.. హైదరాబాద్ వచ్చిన తరువాత ఇంటి నుంచి ఏదో పంపిస్తారనే ఆశ లేదు. అందువలన సిటీలో నా కష్టాలు నేను పడేవాడిని, అవకాశాల కోసం తిరుగుతున్నప్పుడు తిని తినక చాలా కష్టాలు అనుభవించాను. జబర్దస్త్'కి ముందు సినిమాలలో చిన్న చిన్న వేషాలు వేస్తున్నా కష్టాలు తీరలేదు. అప్పట్లో కేజీ బియ్యం 10 రూపాయలు ఉండేవి. అందువలన నేను ఆ 10 రూపాయలతో 3 కేజీల నూకలు కొనుక్కునే వాడిని.

ఆ మూడు కేజీలు పొదుపుగా వాడుకునేవాడిని అన్నారు. ఇక ఆ కష్టాలు పడలేక ఒక్కోసారి మా ఊరుకు వెళ్లిపోదామని అనిపించేది. కానీ ఊళ్లో వాళ్లు వెక్కిరిస్తారని భయం వేసింది, పట్టుదల పెరిగింది. అందుకే ఆ పనిచేయలేకపోయాను. ఆ అవమానం కంటే ఇక్కడ ఇబ్బందులే బెటర్ అనుకునేవాడిని" అలానే నెట్టుకొస్తూ.. చిన్న చిన్న వేశాలు వేసుకుంటూ కాలం



గడిపాను అని అన్నారు చంద్ర. " ఇండస్ట్రీలో నాకు తెలిసినవాళ్లెవరూ లేరు. ఎవరైనా ఎంకరేజ్ చేస్తారో లేదో కూడా తెలియదు. అయినా మొండిగా వచ్చేశాను. జేబులో డబ్బులు లేకపోయినా నిరాశపడకుండా ప్రయత్నాలు చేశాను. ఒకసారి వెనక్కి వెళితే నేనేనా ఇన్ని కష్టాలు పడింది .. నేనేనా ఇక్కడివరకూ వచ్చింది అనిపిస్తూ ఉంటుంది. అప్పుడు పడిన కష్టాలు ఇప్పుడు నాకు చాలా గొప్ప జ్ఞాపకాలుగా అనిపిస్తున్నాయి. నేను అనుకున్నది కొంతవరకూ సాధించగలిగాననే సంతోషం ఉంది" అని చంద్ర అప్పటి రోజులు గుర్తు చేసుకున్నారు.

## "చౌర్య పాఠం" సినిమా రివ్యూ.. క్షణ క్షణం ఉత్కంఠ




తెలుగులో వినూత్న సినిమాలకు ఎప్పుడు ఆదరణ ఉంటుందనే విషయం తెలిసిందే. కంటెంట్ బాగుంటే పరభాష సినిమాలను నెత్తిన పెట్టుకు ంటారు ప్రేక్షకులు. అలాంటిది తెలుగులో కొత్తదనంతో సినిమాలు వస్తే అసలు వదిలిపెట్టారు. ఆ కోవాలో వచ్చిన సినిమానే "చౌర్య పాఠం". టైటిల్ దగ్గర నుంచి టీజర్, ట్రైలర్ ఆకట్టుకోవడంతో సినిమాపై అంచనాలు పెరిగిపోయాయి. "చౌర్య పాఠం" నిఖిల్ గొల్లమారి దర్శకత్వంలో వచ్చిన క్రైమ్ కామెడీ థ్రిల్లర్. ఈ సినిమాలో ఇంద్ర రామ్ హీరోగా పరిచయం అవుతుండగా, పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటించారు. రాజీవ్ కనకాల, మాస్ట్ అలీ వంటి నటులు ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. దర్శకుడు త్రినాథ రావు నక్కిన ఈ చిత్రాన్ని నిర్మించారు. కామెడీ క్రైమ్ నేపథ్యంలో సాగిన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. మరి ఈ సినిమా ఎలా ఉందో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం .కథ: నలుగురు దారితప్పిన వ్యక్తులు నేరాలు లేని ధనపల్లి అనే గ్రామంలో దోపిడీ చేయడానికి ఒక పథకం వేస్తారు. వారి ప్రయత్నాలు ఎలాంటి మలుపులు తిరిగాయి, ఆ గ్రామంలో వారికి ఎలాంటి రహస్యాలు ఎదురయ్యాయి అనేది కథాంశం. వాస్తవ సంఘటనల స్ఫూర్తితో ఈ కథను రూపొందించినట్లు తెలుస్తోంది.కథాంశం మరియు దర్శకత్వం: క్రైమ్ కామెడీ జానర్‌లో తెరకెక్కిన ఈ సినిమా ఆసక్తికరమైన కథాంశంతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తోంది. ఒక ప్రశాంతమైన గ్రామంలో చోరీ చేయడానికి ప్రయత్నించే వారి ప్రయత్నాలు ఫన్నీగా ఉండొచ్చు. కొత్త దర్శకుడు నిఖిల్ గొల్లమారి తన విజన్‌ను తెరపై ఎలా చూపించారనేది చూడాలి.నటీనటుల ప్రదర్శన: హీరోగా పరిచయమవుతున్న ఇంద్ర రామ్ ఎనర్జిటిక్‌గా కనిపించాడని టీజర్ మరియు ట్రైలర్ ద్వారా తెలుస్తోంది. పాయల్ రాధాకృష్ణ తన పాత్రకు న్యాయం చేసిందని భావిస్తున్నారు. రాజీవ్ కనకాల వంటి అనుభవజ్ఞులైన నటులు సినిమాకు మరింత బలాన్ని చేకూర్చవచ్చు.

## అతనితో నా బంధం ప్రత్యేకం..సమంత ఓపెన్ కామెంట్స్



'ఏమాయ చేశావే' సినిమాతో హీరోయిన్‌గా పరిచయం అయిన సమంత.. మహేష్ బాబుతో నటించిన 'దూకుడు' సినిమాతో స్టార్ హీరోయిన్ హోదా సంపాదించింది. అతి తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా సమంత ఎదిగారు. ఎన్టీఆర్, మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్ వంటి హీరోలతో సమంత నటించారు. ఇదే సమయంలో తమిళంలో కూడా నటించి మంచి గుర్తింపు దక్కించుకున్నారు. అయితే ఆమె వైవాహిక జీవితంలో అనేక ఒడిదుడుకులను ఎదుర్కొంది. సమంత హీరో నాగచైతన్యను ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. పెళ్లైన కొన్నాళ్లకే వీరి మధ్య అభిప్రాయభేదాలు తలెత్తడంతో ఈ జంట విడాకులు తీసుకున్నారు. ఇదే సమయంలో సమంత కొంతకాలం మయసైటీస్ అనే వ్యాధితో బాధపడ్డారు. ఆర్యోగం సహకరించక పోవడంతో సమంత సినిమాలు చేయడం తగ్గించింది. నాగచైత్యన్యతో విడిపోయిన తరువాత చాలా సెలెక్టివ్‌గా సినిమాలు చేస్తుందామె. విజయ్ దేవరకొండతో కలిసి నటించిన 'ఖుషి' తరువాత ఆమె మళ్లీ వెండితెర మీద కనిపించింది లేదు. బాలీవుడ్ వెబ్ సిరీస్‌లో మాత్రం ఆమె కనిపించారు. ఈ క్రమంలోనే బాలీవుడ్ 'సిటాడెల్ (హనీ, బన్నీ)' అనే వెబ్ సిరీస్‌లో నటించారు. ఈ వెబ్ సిరీస్‌లో వరుణ్ ధావన్ హీరోగా నటించాడు. ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ సినిమా మిక్స్‌డ్ టాక్‌ను సొంతం చేసుకుంది. హీరో వరుణ్ ధావన్‌తో ఘాటైన లిప్ లాక్ సన్నివేశాల్లో సమంత నటించారు. ప్రస్తుతం సమంత చేతిలో రెండు సినిమాలు ఉన్నాయి. సమంత నిర్మాతగా కూడా మారబోతున్నారు. ఆమె నిర్మాతగా ఓ సినిమా తెరకెక్కుతుంది. ఇదిలా ఉంటే తాజాగా సమంత ఓ వ్యక్తి గురించి చేసిన కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి.

# ఆ హీరోతో జరిగిన సంఘటనే నా జీవితానికి మచ్చ, నా పాటకి చాలా మంది నటులు అన్యాయం చేశారు..



గాన గంధర్వుడిగా గుర్తింపు పొందిన లెజెండ్రీ సింగర్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం తన కెరీర్ లో 40 వేలపైగా పాటలు పాడారు. అన్ని భాషల్లో బాలు పాడిన పాటలు పాపులర్ అయ్యాయి. చాలా కాలం పాటు బాలు ఇండియాలో టాప్ సింగర్ గా రాణించారు. బాలసుబ్రహ్మణ్యం ఎన్టీఆర్, ఏఎన్నార్ హయాం నుంచి పవన్, మహేష్ లాంటి హీరోల వరకు తన పాటలతో అలరించారు. ఎస్పీ బాలు తన కెరీర్ లో జరిగిన సంఘటనలను ఓ ఇంటర్వ్యూలో వివరించారు. నా కెరీర్ లో నేను అతి కొద్దిమంది నటులకు మాత్రమే గొంతు మార్చి పాడవలసి వచ్చింది. ఎన్టీఆర్, ఏఎన్నార్ లకు గొంతు మార్చి పాడేందుకు చాలా ఇబ్బంది పడ్డాను. అప్పటివరకు ఎన్టీఆర్, ఏఎన్నార్ పాటలలో ఘంటసాల గారి గొంతు జనాలకు బాగా అలవాటు అయిపోయింది. ఆ తర్వాత నేను పాడుతుంటే ఎన్టీఆర్, ఏఎన్నార్ గొంతుకు మ్యాచ్ అయ్యేది కాదు. దీనితో గొంతు మార్చి పాడేందుకు శ్రమించాను. కొన్ని రోజుల తర్వాత నాకు గ్రిప్ దొరికింది అని ఎస్పీ బాలు అన్నారు. రాజబాబు, అల్లు రామలింగయ్య లాంటి కమెడియన్లకు వారిని ఇమిటేట్ చేస్తూ ట్రై చేసేవాడిని. నాగార్జున విషయానికి వస్తే మన్మథుడు చిత్రంలో కొన్నిసార్లు మిమిక్రీ చేయాల్సి వచ్చేది. ఎందుకంటే అక్కడ చెబుతున్నది నాగార్జునే అని జనాలు నమ్మాలి. వద్దురా సోదరా సాంగ్ లో శివ అని నా ఫ్రెండ్, కాలేజీలో వాడు గ్రీకు వీరుడు అంటూ పాట మధ్యలో నాగార్జునని మిమిక్రీ చేయాల్సి వచ్చింది. చిరంజీవి, బాలకృష్ణ, వెంకటేష్ లకు పాడేసమయంలో ఎలాంటి ఇబ్బంది రాలేదు.




Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com